PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 236 | విజయవాడ, ఆదివారం 31 మార్చి 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 31 March 2024 | Rs

డికాక్, పూరన్ మెరుపులు

• పంజాబ్‌పై 21పరుగుల తేడాతో నెగ్గిన లక్నో 6

ప్రఖ్యాత వ్యవసాయశాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు ప్రకటించిన భారతరత్న పురస్కారాన్ని అందుకుంటున్న ఆయన కుమార్తె ఎంఎస్ నిత్య (వార్త 5లో)

వాలంటీర్లతో పింఛన్లు వద్దు

వారి వద్ద ఉన్న ఫోన్లు, ట్యాబులు వెనక్కి

• ఇతర 'సంక్షేమ' పంపిణీలకు దూరంగా ఉంచండి • ఎన్నికల కమిషన్ ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. వాలంటీర్లపై పలు ఆంక్షలు విధించింది. వాలంటీర్ల విధుల్లో అత్యంత కీలకమైన పింఛన్ల పంపిణీ నుండి వారిని పక్కన పెట్టింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వాలంటీర్లతో నగదు పంపిణీ చేయించవద్దని ఆదేశించింది. పింఛన్లతో పాటు వాలంటీర్ల చేతుల మీదుగా నగదు పంపిణీ చేసే అన్ని ఇతర సంక్షేమ పథకాల్లోనూ ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు వారిని దూరంగా ఉంచాలని పేర్కొంది. పింఛన్లతో పాటు ఇతర సంక్షేమ పథకాల నగదు పంపిణీ బాధ్యతను ప్రభుత్వ ఉద్యోగులకు అప్పగించాలని ఆదేశించింది. అదే విధంగా ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు వాలంటీర్లకు ప్రభుత్వం అందచేసిన మొబైల్ ఫోన్, ట్యాబ్‌లతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఎవైనా ఉంటే వాటన్నింటిని వెనక్కి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ఎన్నికల అధికారులు వాటిని తమ వద్ద డిపాజిట్ చేసుకోవాలని పేర్కొంది. సోమవారం (ఏప్రిల్ 1) నుండి పింఛన్ల పంపిణీ జరగాల్సి వుండగా శనివారం సాయంత్రం ఈ ఆదేశాలు వెలువడటం గమనార్హం. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ 23.02.24, 25.02.24న హైకోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదుల ఆధారంగా హైకోర్టు 13.03.2024న జారీ చేసిన ఆదేశాలకు లోబడి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం లోగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఏప్రిల్ నెలలో పింఛన్లు జాప్యం కావచ్చని భావిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 2.56 లక్షల మందికిపైగా వాలంటీర్లు ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు విధులకు దూరమైనట్టే! వాలంటీర్లు తమ పార్టీ కార్యకర్తలేనంటూ అధికార పార్టీ నేతలు పలు సభల్లో చెప్పడంతో ఎన్నికల సమయంలో వారి విధులపై పలు అనుమానాలు, విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఎన్నికల కమిషన్‌కు కూడా పలు ఫిర్యాదులు అందాయి. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాల మేరకు వీరి కదలికలపై అధికారయంత్రాంగం నిఘా పెట్టింది. అధికారపార్టీ ప్రచార పర్వంలో భాగస్వాములుగా మారిన దాదాపు 100 మంది వాలంటీర్లను ఇప్పటికే విధుల నుండి తొలగించింది.

పింఛన్లు పంపిణీ చేస్తున్న వాలంటీర్ల (ఫైల్)

డిఎస్‌సి పరీక్షలు, టెట్ ఫలితాలు వాయిదా

రాష్ట్రంలో డిఎస్‌సి పరీక్షల నిర్వహణను, టెట్ ఫలితాల విడుదలను కేంద్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు వీటిని వాయిదా వేయాలని తాజా ఉత్తర్వుల్లోపేర్కొంది. రాష్ట్రప్రభుత్వం 6,100 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 12వ తేదిన నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన పరీక్షలు మార్చి 30 నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, వెబ్‌సైట్‌లో పరీక్షా కేంద్రాల ఎంపికకు కూడా అవకాశం ఇవ్వలేదు. దీంతో అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎట్టకేలకు డిఎస్‌సిని వాయిదా వేస్తున్నట్లు ఆదేశాలు వెలువడటంతో ఆ ఉత్కంఠ వీడింది.

ఈ ఎన్నికలు లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణకు

ఒక రెఫరెండం!

సిఎఎ అమలును లౌకికవాద సమస్యగానే చూడాలి

మృదు హిందూత్వ ధోరణితో బిజెపిని నిలువరించలేం

అభివృద్ధి చెందిన దేశాల సరసన కేరళ

'ది హిందూ' ఇంటర్వ్యూలో పినరయి విజయన్

తిరువనంతపురం : "ప్రస్తుతం జరగనున్న పార్లమెంటరీ ఎన్నికలు భారతదేశ లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంపై ఒక రెఫరెండం" అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పష్టం చేశారు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలును వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) తీవ్రంగా ప్రతిఘటించడాన్ని మైనారిటీ లేదా మెజారిటీ సమస్యగా చూడడం తప్పని విజయన్ పేర్కొన్నారు. దానికి బదులుగా దీన్ని లౌకికవాదానికి సంబంధించిన సమస్యగా చూడాలని అన్నారు. మృదు హిందూత్వ ధోరణిని అనుసరించడం వల్ల మరింత దూకుడుతో వ్యవహరిస్తున్న బిజెపిని నిలువరించలేమని అన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య పార్టీల నుండి మితవాద పార్టీలోకి జరుగుతున్న ఫిరాయింపులు కలవరపరుస్తున్నాయనివిజయన్ వ్యాఖ్యానించారు.

కేరళలోని 20 లోక్‌సభ నియోజకవర్గాల్లో 24 రోజుల పాటు పర్యటనకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 2024 పార్లమెంటరీ ఎన్నికల కీలక స్వభావాన్ని ఆయన వివరించారు. శుక్రవారం ఇ-మెయిల్ ద్వారా ది హిందూకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.

2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఎలాంటి ప్రభావం కనబరచలేరని అన్నారు. ఒక ఎంపీగా ఆయన పనితీరును వాయనాడ్ ప్రజలు సమీక్షిస్తారన్నారు. ఆయన పనితీరు గురించి చెప్పడానికి పెద్దగా ఏమీ లేదన్నారు. కాంగ్రెస్, బిజెపిలు చేసే నేరారోపణ ప్రచారాలు ఎన్నికల్లో ఎలాంటి ప్రభావాన్ని కలిగించబోవన్నారు.

• **సిఎఎ అమలు గురించి కాంగ్రెస్ అసందిగ్ధతపైనే మీరు ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు కదా. సాంప్రదాయంగా యుడిఎఫ్ వైపున వుండే మైనారిటీ ఓటర్లను దీంతో ఎల్‌డిఎఫ్ లౌకిక, బిజెపి వ్యతిరేక ఎజెండా వైపునకు తీసుకురాగలగుతారా?**

ఇది మైనారిటీ లేదా మెజారిటీ సమస్య కాదు, లౌకికవాదానికి సంబంధించిన సమస్య. భారతదేశం లౌకిక ప్రజాస్వామ్య దేశంగానే కొనసాగాలా లేక ఆఫ్ఘనిస్తాన్ మాదిరిగా తమపరమైన రాజ్యాల సరసన నిలబెట్టాలా? అదీ అసలైన సమస్య. భారతదేశంలో ఆనాటి వలస పాలనకు వ్యతిరేకంగా మహోజ్వలంగా సాగిన స్వాతంత్ర్య సంగ్రామంలో అన్ని మత విశ్వాసాలకు చెందినవారు పాల్గొని పోరాడారు. అలాగే ఏ మతాన్నీ విశ్వసించని వారు కూడా పోరాడారు. లౌకికవాద భారతదేశం కోసం వారు పోరు సల్పారు. అందువల్ల వారి మతపరమైన గుర్తింపు ప్రాతిపదికగా మిగతా 5లో

సిపిఎం అరకు ఎంపి అభ్యర్థిగా

పి.అప్పలనర్స

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని అరకు (ఎస్‌టి) లోక్‌సభ స్థానానికి అభ్యర్థిగా పాచిపెంట అప్పలనర్సను సిపిఎం ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

నేడు, రేపు తీవ్ర వడగాడ్పులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 33 మండలాల్లోనూ, సోమవారం 64 మండలాల్లోనూ తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. వీటి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు రెండు నుండి నాలుగు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు వారం రోజులుగా అనేక మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం రెండు, మూడు జిల్లాలు మినహాయించి రాష్ట్రమంతటా 37 నుంచి 43 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైంది. అనంతపురం, కడప, తిరుపతి, చిత్తూరు, గుంటూరు, నంద్యాల తదితర జిల్లాల్లో సరాసరి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డవగా.. మొత్తం 52 మండలాల్లో వడగాడ్పులు వీచాయి.

ముఖ్యమంత్రికి నిరసన సెగ

• తాగు, సాగు నీటి కోసం 'మేమంతా సిద్ధం' యాత్రను అడ్డుకున్న రైతులు, మహిళలు
• తిరిగి వైసిపి ప్రభుత్వం వచ్చాక సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని జగన్ హామీ

రైతులు, మహిళలు నిరసన తెలుపుతుండడంతో బస్ దిగి వస్తున్న ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- యంత్రాంగం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి నిరసన సెగ తగిలింది. తాగు, సాగు నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను రైతులు, మహిళలు శనివారం అడ్డుకున్నారు. దీంతో, ముఖ్యమంత్రి బస్సు దిగి వచ్చి వారితో మాట్లాడి వారిని శాంతింపజేశారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాతన, తుగ్గలి, జొన్నగిరి, ఎర్రగుడి తదితర గ్రామాల మీదుగా 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర వెళ్తుండగా జొన్నగిరి వద్ద రైతులు, మహిళలు ఈ బస్సును అడ్డుకున్నారు. సాగు, తాగు నీటి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. దీంతో, బస్సు దిగి ముఖ్యమంత్రి జగన్ వారి వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా నుంచి ఈ ఏడాది జనవరిలో పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి నీటిని విడుదల చేస్తారని, అయితే, జొన్నగిరి చెరువుతోపాటు చాలా చెరువులకు నీరు చేరలేదని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాగు, సాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని, వ్యవసాయం సాగక ఉపాధి కరువై వ్యవసాయ కార్మికులతోపాటు రైతులకు కూడా వలసలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ, వైసిపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. దీంతో, రైతులు, మహిళలు శాంతించారు. కాగా, కర్నూలు జిల్లా గూడూరు మండలం కొత్తూరు (రామచంద్రాపురం) లో శుక్రవారం మహిళలు మిగతా 2లో

బాండ్లతో విమర్శలు బంద్

• టిడిపికి షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ రూ.40 కోట్ల బాండ్లు
• వైసిపికి పలు కంపెనీల నుంచి రూ.133 కోట్లు
• జనసేనకు రూ.10 కోట్లు

లోపలి పేజీలో..

2030 నాటికి 34 శాతం విద్యుత్ కార్లే..

• ప్రపంచ దేశాలతో పోల్చితే వెనుకబాటు
• గోల్డ్‌మాన్ సాచే అంచనా
• గ్లోబల్ మార్కెట్‌లో 7% వాటా

సిఎఎ అత్యంత ప్రమాదకరం

• సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
• ఒంగోలులో వామపక్ష, లౌకిక పార్టీల నిరసన ప్రదర్శన

నిరసన ప్రదర్శన అగ్రభాగాన వి.శ్రీనివాసరావు, వామపక్ష, లౌకిక పార్టీల నాయకులు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలు దేశానికి అత్యంత ప్రమాదకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ మత దురహంకార విధానాన్ని దేశ ప్రజలందరూ ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. రాజ్యాంగ స్ఫూర్తికి తిలోదకాలిచ్చి బిజెపి ప్రభుత్వం సిఎఎ వంటి నిరంకుశ చట్టాన్ని చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రకాశం జిల్లా ఒంగోలులో వామపక్ష, లౌకిక పార్టీల ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన జరిగింది. ఒంగోలు పాత మార్కెట్ సెంటర్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి వి.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. అక్కడి నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఒంగోలు కలెక్టరేట్ వరకు సాగింది. అనంతరం జరిగిన కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో 2014 ముందు పక్క దేశాల వచ్చిన ముస్లిములు, హిందువులు, బుద్ధులు, క్రిస్టియన్లు ఎవరికైనా ఒకటే నిబంధన ఉండాలే తప్ప, ముస్లిములకు పౌరసత్వం ఇవ్వబోమని చెప్పడం సరికాదన్నారు. దేశంలోని ముస్లిములు కూడా ఏ దేశస్తులో నిరూపించుకున్న తరువాతే పౌరసత్వం ఖరారు చేస్తామంటే రెండో తరగతి పౌరులుగా బతకాల్సిన పరిస్థితి వారికి వస్తుందని తెలిపారు. ఇది పాకిస్తాన్ కాదని, భారత దేశమని, పాకిస్తాన్‌లా మత రాజ్యంగా మారుస్తామంటే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. మనది లౌకిక రాజ్యమని, అందరికీ మత స్వేచ్ఛ ఉందని తెలిపారు. అన్ని మతాలనూ సమానంగా రాజ్యాంగం గౌరవిస్తోందన్నారు. మనదేశం నుంచి అమెరికాకు లక్షలాది మంది వలస వెళ్తున్నారని, వారిలో క్రైస్తవులకు మాత్రమే పౌరసత్వం ఇస్తామని, మిగిలిన వారికి ఇవ్వబోమని ఆ దేశం చెబితే ఎలా ఉంటుందో... మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం ఆ విధంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అధికార పార్టీ వైసిపి, ప్రతిపక్ష టిడిపి సిఎఎకు అనుకూలంగా ఓట్లు వేసి ఇప్పుడు ముస్లిముల హక్కులు కాపాడుతామని హామీలు గుప్పిస్తున్నాయని విమర్శించారు. సిఎఎకు వ్యతిరేకంగా పార్లమెంట్లో ఇండియా వేదిక బిల్లు పెట్టనుందని, బలపరుస్తాయో, వ్యతిరేకిస్తాయో వైసిపి, టిడిపి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. లౌకిక పార్టీలని చెప్పుకుంటూ ఒక మిగతా 2లో

పిఠాపురంలోనే నివాసం

చేబ్రోలు బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రకటన

ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

ఎన్నికలలో తనను గెలిపిస్తే పీఠాపురంలోనే నివాసం ఉంటానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఎన్నికల పర్యటన సందర్భంగా ఆయన తొలి రోజు గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. పీఠాపురంలో తనను ఎలాగైనా ఓడించాలని వైసిపి ప్రయత్నిస్తోందని అన్నారు. 'చిత్తూరు జిల్లా నుంచి మిథున్ రెడ్డిని తీసుకువచ్చింది. మండలానికి ఒక కీలక నేతను పెట్టింది.' అనిఅన్నారు. నా దగ్గర అంతగా శక్తి లేకపోయినా ఎందుకంత కక్ష పెట్టుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసిపి ఫ్యాన్ సౌండ్ ఎక్కువ, గాలి తక్కువ అని ఎద్దేవా చేశారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలు తనను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. 21 ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లలో మాత్రమే పోటీ చేస్తున్నా తనపై వైసిపి కక్ష కట్టిందన్నారు. వాళ్ల అక్రమాలను భవిష్యత్తులో ప్రశ్నిస్తానని భయపడుతుండడమే ఇందుకు కారణమన్నారు. గొల్లప్రోలులో ముంపు, చేబ్రోలులో పట్టు రైతులకు ఏమి చేశారో చెప్పాలని వైసిపి నేతలను ప్రశ్నించాలని అన్నారు, ఒక దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎంఎల్‌సికి వైసిపి అండగా వైసిపి ఉందని విమర్శించారు. కూటమికి ఓట్లు వేస్తే తాను జవాబుదారీతనంగా నిలబడతానని, సమస్యలపై ప్రశ్నిస్తానని హామీ ఇచ్చారు. వైసిపి వ్యతిరేక ఓటు చీలనివ్వకుండా చేసేందుకు కూటమిగా ఏర్పడ్డామన్నారు. సుద్ధగడ్డ ఆధునీకరణ జరగక రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రూ.175 కోట్లు నిధులు వచ్చినా ఎందుకు పనులు చేపట్టలేదని, గడిచిన ఐదేళ్లలో ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. తీర ప్రాంతం కోతకు గురవుతున్నా సరైన ప్రణాళికలు చేయలేకపోయారని విమర్శించారు. కోనపాపపేటలో రసాయన పరిశ్రమల వల్ల మత్స్యకారులకు ఉపాధిపోతున్నా అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదన్నారు. వైసిపి పాలనలో అవినీతి లేదని చెప్పుకుంటున్నారని, అలా అయితే అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఎనిమిది లక్షల ఫిర్యాదులు ఎందుకు వెళ్లాయని ప్రశ్నించారు. కాకినాడ పోర్టులో డీజిల్, డ్రగ్స్ మాఫియా నడుస్తోందని, అక్రమ బియ్యం వ్యాపారులకు కాకినాడ పోర్టు అడ్డాగా మారిందని ఆరోపించారు. వర్మ తన కోసం పిఠాపురం అసెంబ్లీ సీటును త్యాగం చేశారని, ఆయన త్యాగాన్ని ఎప్పుడూ మర్చిపోలేనని, వర్మకు కూడా అదే స్థాయిలో ప్రాధాన్యత ఇస్తానని పవన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మిగతా 2లో

విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న షర్మిల

పదేళ్లు ప్రత్యేక హోదా

• తొమ్మిది గ్యారంటీల ప్రకటన
• 'గడప గడపకు కాంగ్రెస్'ను ప్రారంభించిన షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి పదేళ్ల పాటు ప్రత్యేక హోదాను అమలు చేస్తామని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. శనివారం విజయవాడలో గడపగడకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేకహోదా వచ్చి ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెంది ఉండేదని, వేల సంఖ్యలో పరిశ్రమలు వచ్చి ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించేవని అన్నారు. సిఎం జగన్ రాష్ట్ర ప్రజల గౌరవాన్ని తాకట్టు పెట్టారని చెప్పారు. పదేళ్లు ప్రత్యేక హోదా కావాలని చంద్రబాబు, రాజీనామాలు చేసి హోదా సాధించుకుందామని జగన్ ప్రజలను మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే హోదాకు కట్టుబడి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా తొమ్మిది గ్యారంటీలను ఆమె ప్రకటించారు. వాటిలో మొదటిది పత్యేక హోదానేనని చెప్పారు. ప్రతి పేద మహిళకు ప్రతి నెల రూ. 8,500 ఇస్తామని, రైతులకు రూ. 2 లక్షల మిగతా2లో

జనసేన మచిలీపట్నం ఎంపి అభ్యర్థిగా బాలశౌరి

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరిని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ శనివారం ప్రకటించారు. సిట్టింగ్ ఎంపిగా ఉన్న ఆయనకు వైసిపి అధిష్టానం ఈసారి టికెట్‌ను నిరాకరించడంతో ఇటీవల జనసేనలో చేరారు. 2004లో కాంగ్రెస్ తరుపున తెనాలి ఎంపిగా, 2019 ఎన్నికల్లో వైసిపి తరుపున మచిలీపట్నం ఎంపిగా గెలుపొందిన ఆయన 2009లో కాంగ్రెస్ తరుపున నర్సరావుపేట నుండి, 2014లో వైసిపి తరుపున గుంటూరు నుండి పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి టికెట్ ఇచ్చేందుకు వైసిపి అధిష్టానం నిరాకరించింది. ఆ తర్వాత జనసేనలో చేరిన బాలశౌరి మూడుసార్లు పవన్ కల్యాన్‌ను కలిసినా ఫలితం లేకుండా పోయింది. ఎట్టకేలకు ఆయననే మచిలీపట్నం ఎంపి అభ్యర్థిగా జనసేన ప్రకటించింది.

ఒకేరోజు ఎన్నికల ట్రైనింగ్, 'టెన్త్' మూల్యాంకనం

- ఆందోళనలో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఒకే రోజు రెండు విధులను ప్రభుత్వం కేటాయించింది. పదో తరగతి మూల్యాంకనం కార్యక్రమం ఎన్నికల శిక్షణ తరగతులను ఒకే రోజు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మే 13న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించాలని ఇసి నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ పరీక్ష ప్రశ్నపత్రాల మూల్యాంకనం కూడా ఉపాధ్యాయులే చేయాలి. ఈ మూల్యాంకనం కూడా ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. ఎన్నికల శిక్షణా తరగతులు కూడా ఇదే రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో ఉపాధ్యాయులు శిక్షణకు వెళ్లాలా? మూల్యాంకనానికి వెళ్లాలా? అనే ఆందోళనలో ఏటూ తేల్చుకోలేకపోతున్నారు. ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి దేవానందరెడ్డిని కలిసి ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు,ఎస్ చిరంజీవి కోరారు. జిల్లాల విద్యాశాఖ అధికారులతో మాట్లాడి తగు స్పష్టత ఇస్తామని డైరెక్టర్ వారితో అన్నారు.

సిఇసి ఉత్తర్వులను స్వాగతించిన సిటిజన్స్ ఫర్ డెమెక్రసీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వలంటీర్లను ఎన్నికల విధుల నుండి తొలగిస్తూ ఎన్నికల కమిషన్ తీసుకున్న ఉత్తర్వులను సిటిజన్స్ ఫర్ డెమెక్రసీ స్వాగతించింది. ఈ మేరకు జాయింట్ సెక్రటరీ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి శనివారం ప్రకటన విడుదల చేశారు. వైసిపి కార్యకర్తలుగా పనిచేస్తూ ప్రభుత్వ వేతనాలు తీసుకుంటున్న వలంటీర్లపై సిఇసి నిర్ణయం హర్షణీయమని తెలిపారు. సిఎం, రెవెన్యూ మంత్రి అందరూ వలంటీర్లు తమ పార్టీ కార్యకర్తలే అని ప్రకటించడం ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యం చేయడం, రాజకీయ లబ్ధికోసం వారిని వాడుకోవడంపై సిటిజన్ ఫర్ డెమెక్రసీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

మాగుంట కుటుంబానికి టిడిపి టిక్కెట్టు ఎలా ఇచ్చింది?

- ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవ్‌రెడ్డి తండ్రి మాగుంట శ్రీనివాసుల రెడ్డిని ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా బిజెపి మిత్రపక్షమైన టిడిపి నిలబెట్టడాన్ని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ప్రశ్నించారు. శనివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ప్రధాన సాక్షిగా ఉన్న వ్యక్తి కోసం ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన పార్టీ ఎలా ప్రచారం చేస్తుందని అన్నారు. 'శరత్ చంద్రారెడ్డికి బిజెపితో ఉన్న సంబంధాల గురించి చెప్పాం. మనీలాండరింగ్ కేసులో అరెస్టయి బిజెపికి విరాళాలు ఇచ్చాడు. దీని అర్థం (ఢిల్లీ సిఎం) అరవింద్ కేజ్రీవాల్‌కి వ్యతిరేకంగా ప్రధాన సాక్షిగా ఉన్న వ్యక్తికి ఇప్పుడు ప్రధాని మోడీ, మొత్తం బిజెపి ప్రచారం చేస్తాయి" అని ఆయన అన్నారు.

విశ్వాస ఘాతుకానికి ట్రేడ్ మార్క్ జగన్

- లంకా దినకర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశ్వాస ఘాతకానికి ట్రేడ్ మార్క్ సిఎం జగన్ అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోగొట్టి అభివృద్ధి, సంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటు కోసం మూడు పార్టీలు ఏకమయ్యాయన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకసారి వైసిపికి ఓటేస్తే రెండు దశాబ్దాలు వెనక్కిపోయిందన్నారు. 2019కి ముందు అమరావతే రాజధాని అని చెప్పి, 2024కి నిర్వీర్యం చేశాడన్నారు.

పిఠాపురంలోనే నివాసం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి, టిడిపి నేత సుజయ్‌కృష్ణ రంగారావు, జనసేన నేతలు బి.మహేందర్‌రెడ్డి, జనసేన పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గంటల ఆలస్యంగా సభ నిరాశ చెందిన పార్టీ శ్రేణులు

సాయంత్రం నాలుగున్నర గంటలకు నిర్వహించాల్సిన పవన్ కల్యాణ్ సభ రాత్రి 8.30 గంటలకు కూడా ప్రారంభం కాలేదు. రోడ్డు షోకి అనుమతి లేకపోవడంతో పవన్ బస చేసిన ప్రాంతం నుండి చేబ్రోలుకు రావడం ఆలస్యం చేశారు. అనుమతులు వచ్చిన తర్వాత బయలుదేరారు. సుమారు నాలుగు గంటలు ఆలస్యం కావడంతో జనసేన శ్రేణులు తీవ్ర నిరాశకు గురయ్యాయి. సభ ప్రారంభానికి ముందే అనేకమంది వెనుదిరిగారు.

సచివాలయాలు దేశానికే ఆదర్శం

- ప్రజల సహకారంతో ముందుకెళ్తా
- తుగ్గలి 'ముఖాముఖి'లో ముఖ్యమంత్రి జగన్
- కర్నూలు, అనంతపురం జిల్లాల్లో 'మేమంతా సిద్ధం' బస్ యాత్ర

కర్నూలు జిల్లా తుగ్గలిలో నవరత్నాల లబ్ధిదారులతో 'ముఖాముఖి' నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- యంత్రాంగం

గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో రూ.50 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. 'మేమంతా సిద్ధం' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన కర్నూలు, అనంతపురం జిల్లాల్లో బస్ యాత్ర నిర్వహించారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాతన, తుగ్గలి, జొన్నగిరి, ఎర్రగుడి తదితర గ్రామాల మీదుగా సాగింది. అనంతపురం జిల్లాలో ఎటువంటి ప్రసంగాలూ లేకుండా యాత్రను కొనసాగించారు. తుగ్గలిలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుమారులు ప్రతాపరెడ్డి, ప్రహ్లాదరెడ్డి చిత్రపటాలకు ముఖ్యమంత్రి జగన్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తుగ్గలిలో నవరత్నాల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయం వ్యవస్థ ద్వారా అన్ని గ్రామాలూ అభివృద్ధి చెందాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా 58 నెలల్లో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ఏర్పాటు ద్వారా 1,35,819 శాశ్వత ఉద్యోగాలను కల్పించామని, రాష్ట్ర వ్యాప్తంగా 2.26 లక్షల మంది వలంటీర్లను నియమించి వారి ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని వివరించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులకూ గురి కాకుండా ఉండేందుకు గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా తుగ్గలి గ్రామానికి చెందిన ఎలాజీబెత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని పథకాలు అందిస్తే ప్రజలు ముఖ్యమంత్రిగా మళ్లీ మిమ్మల్ని చూస్తారని అన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి : శ్యామల, రాతన గ్రామం

వర్షాభావ పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న రైతులను ఆదుకోవడానికి రుణమాఫీ చేయాలని తుగ్గలి మండలం రాతన గ్రామానికి చెందిన శ్యామల ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. వర్షం పడితే తప్ప పంటలు చేతికి రావడం లేదని, పంటలు పండక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిఎం దృష్టికి తీసుకెళ్లారు.

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించలేదు : సూరన్న

నిత్యం కరువుతో అల్లాడుతున్న తుగ్గలి మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించలేదని, దీంతో, రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. చెరువులను నీటితో నింపకపోవడంతో తుగ్గలి మండల ప్రజలు తాగు నీటికి కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని సిఎం దృష్టికి తీసుకెళ్లారు.

వైసిపిలో చేరిన టిడిపి కల్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు

ముఖ్యమంత్రి సమక్షంలో గుత్తి మండలం బసినేపల్లి గ్రామం వద్ద అనంతపురం జిల్లా వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున వైసిపిలో చేరారు. వారిలో కల్యాణదుర్గం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు ఉన్నారు. ఆయన టిడిపి టికెట్ ఆశించారు. ఆ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో తన మద్దతుదారులతో కలిసి వైసిపిలో చేరారు.

ప్రసంగం లేకుండా అనంతపురం జిల్లాలో యాత్ర

కర్నూలు జిల్లా తుగ్గలిలో శనివారం ఉదయం ప్రారంభమైన యాత్ర సాయంత్రానికి అనంతపురం జిల్లాకు చేరుకుంది. గుత్తి పట్టణంలో జరిగిన రోడ్ షోలో పెద్ద ఎత్తున జనం జగన్‌కు మద్దతుగా కదిలారు. పామిడి, గార్లదిన్నె మీదుగా రాప్తాడు వరకు యాత్ర సాగింది. దారి పొడవునా వందలాది మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు జెండాలను చేతపట్టుకుని ఆయన వెంట కదిలారు. అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లి వద్ద జగన్ రాత్రి బస చేశారు. మొదటి రోజు అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్ షోలో ఎక్కడా ప్రసంగాలు లేకుండానే యాత్ర సాగింది.

వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న చంద్రబాబు

శాశ్వత సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయాలి

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఒకటోతేదీనే పింఛన్లు వారి ఇళ్లకు వచ్చే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెనాయుడు కోరారు. సిఎం వలంటీర్లను ప్రభుత్వ కార్యక్రమాలకు కాకుండా సొంత పనులకు వాడుకుంటూ దుర్వినియోగం చేశారని అన్నారు. వందల మంది వలంటీర్లు సస్పెన్షన్లకు కారణమయ్యారని విమర్శించారు. మరోవైపు పింఛన్ల సొమ్ము ఇచ్చేందుకు ఖజానాలో డబ్బులు లేవని, దీన్ని కప్పిపెట్టుకునేందుకు ఎన్నికల కమిషన్‌పైనా, నిమ్మగడ్డపైనా వైసిపి నాయకులు దుష్ప్రచారానికి దిగారని పేర్కొన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే శాశ్వత సిబ్బందితో వెంటనే పంపిణీ చేయించాలని ఆయన కోరారు.

రూ.16.62 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - యంత్రాంగం

వేర్వేరు జిల్లాల్లో శనివారం నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేని నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లా పలమనేరులోని ఎంఎన్ఎస్ కాలనీకి చెందిన లక్ష్మీ అనే మహిళ ఇంట్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎన్నికల వేళ రూ.16 లక్షల నగలు, నగదు ఉన్నట్లు గుర్తించారు. అంత డబ్బు ఎలా వచ్చిందంటూ ఇంటి యజమాని నుండి సమాచారం అడిగి తెలుసుకున్నారు. నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో ఆదాయ పన్ను శాఖకు అప్పగిస్తామని తెలిపారు. ఎన్నికల వేళ అధిక మొత్తంలో నగదు ఇంట్లో దాచడం చట్టరీత్యా నేరమేనని అధికారులు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో చెక్‌పోస్ట్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.62 వేలు స్వాధీనం చేసుకున్నారు. అసిస్టెంట్ ఆఫీసర్ కె.గోవిందరాజులు సారధ్యంలో తనిఖీలు చేపట్టారు.

సీమకు పోలవరం నీళ్లు

- జగన్ పాలనంతా భూమ్ భూమ్.. స్కామ్ స్కామ్
- నీ చెల్లెలుకు సమాధానం చెప్పిన తర్వాత ఓట్లు అడుగు?
- ప్రజాగళం సభల్లో చంద్రబాబు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి, శ్రీకాళహస్తి

జగన్ ఐదేళ్ల పాలనంతా 'భూమ్ భూమ్.. స్కామ్ స్కామ్' లేనని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. మీ కుటుంబంలో మేలు జరిగి ఉంటే ఓట్లు వేయాలని సిఎం జగన్ కోరుతున్నారని... మీ కుటుంబంలో నష్టం జరిగి ఉంటే తమ పార్టీకి ఓట్లు వేయాలని అడుగుతున్నానని చెప్పారు. క్విట్ జగన్, సేవ్ రాయలసీమకు ప్రజలు సిద్ధమవుతున్నారని చెప్పారు. తమది విజన్ ఉన్న కూటమనీ, రానున్న ఎన్నికల్లో ఎన్‌డిఎను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే తొట్టతొలి సంతకం మెగా డిఎస్‌సిపైనే ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వైఎస్ఆర్ జిల్లాల ప్రొద్దుటూరు, తిరుపతి జిల్లా నాయుడుపేట, శ్రీకాళహస్తిలో ప్రజాగళం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... రాయలసీమకు కృష్ణాజలాలను తరలించడం ఎన్‌టిఆర్ కల అయితే, పోలవరం నీటిని రాయలసీమకు తరలించడమే ధ్యేయంగా పెట్టుకున్నానని అన్నారు. టిడిపి హయాంలో పోలవరం పనులను 72 శాతం పూర్తి చేశానని తెలిపారు. ముచ్చుమర్రి, గొల్లపల్లి రిజర్వాయర్లు, అవుకు, హంద్రీనీవా, గాలేరు-నగరి పనులు చేపట్టామని చెప్పారు. టిడిపి హయాంలో రాయలసీమలోని ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేశామని, వైసిపి హయాంలో రెండు వేల కోట్లు మాత్రమే వ్యయం చేశారని విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమకు రెండు సార్లు శంకుస్థాపనలు చేశారని, ఐదేళ్లవుతున్నా ఒక్క ఇటుక కూడా పేర్చలేదని దుయ్యబట్టారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గానూ, ఫ్రూట్‌బాస్కెట్‌గా మార్చుతామని హామీ ఇచ్చారు. క్విట్ జగన్, సేవ్ రాయలసీమకు ప్రజలు సిద్ధమవుతున్నారని చెప్పారు. విశాఖ పోర్టుకు 25 కిలోల గంజాయి వచ్చిందని, చేతగాక నన్ను విమర్శిస్తున్నారని, నేనైతే ఎగుమతి, దిగుమతి దారులను జైలుకు పంపేవాడినని చెప్పారు. చిన్నాన్న హత్య కేసులో సిబిఐ అధికారులపైనే కేసులుపెట్టి తప్పుడు మాటలు మాట్లడతావా అంటూ విమర్శించారు. ఇటువంటి నాయకునికి ఓట్లు వేస్తే ఎవరికీ రక్షణ ఉండదని హెచ్చరించారు. నీ చెల్లెలు సునీతకు సమాధానం చెప్పిన తర్వాత ఓట్లు అడగాలన్నారు. సిబిఐకి సహకరిస్తే జగన్ పేరే బయటికి వస్తుందని చెబుతోందన్నారు. హత్యలు చేసే వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండటానికి అనర్హుడని తెలిపారు. ప్రొద్దుటూరులో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు.

తిరుపతి, నెల్లూరు, చెన్నయ్ నగరాలను ట్రై సిటిలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నెల్లూరు-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కు రూపకల్పన చేశామనీ, ఇందులో భాగంగానే కృష్ణపట్నం ఓడరేవు, రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం, శ్రీకాళహస్తి ప్రాంతంలో టిసిఎల్, సెల్కాన్, కార్బన్, జోహో లాంటి పరిశ్రమలు వచ్చాయని చెప్పారు. ఇప్పటికే ఆంధ్ర రాష్ట్రం రూ.13 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందనీ, ఈ అప్పులన్నీ ఎవరు తీరుస్తారు? రాష్ట్ర ప్రజానీకమే కదా అని ప్రశ్నించారు. జగన్ కాలానీల పేరిట ఇంటి స్థలాల విషయంలో రూ.ఆరు వేల కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపించారు. శ్రీకాళహస్తి అంటే గుర్తు వచ్చేది బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అనీ, ఆయన రాజకీయాలకు ఆదర్శప్రాయమని కొనియాడారు.

డిపాజిటర్ల పరిరక్షణ చట్టం లక్ష్యాలకు విఘాతం

- అగ్రిగోల్డ్ వ్యవహారంలో ఇడి వైఖరిపై హైకోర్టు
- సిఐడి జప్తు చేసిన ఆస్తులనే మళ్లీ ఇడి చేయడంపై ఆక్షేపణ

ప్రజాశక్తి - అమరావతి

అగ్రిగోల్డ్ ఆస్తులను ఏపీ సిఐడి జప్తు చేసిన ఆస్తులనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కూడా జప్తు చేయడాన్ని రాష్ట్ర హైకోర్టు తప్పు పట్టింది. ఇడి జారీ చేసిన ప్రాథమిక జప్తు ఉత్తర్వులు ఏపీ డిపాజిటర్ల పరిరక్షణ చట్ట లక్ష్యాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ప్రకటించింది. దీంతో ఈ ఉత్తర్వులను కొట్టి వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ఇటీవల తీర్పు వెలువరించారు .

సిఐడి జప్తు ఉత్తర్వులు డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించేలా ఉన్నాయని హైకోర్టు గుర్తుచేసింది. మనీలాండరింగ్ చట్టం కింద అడ్జుడికేటింగ్ అథారిటీ వద్దకు వెళ్లి తేల్చుకోవడం డిపాజిటర్లకు చాలా కష్టమని చెప్పింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద ఏర్పాటైన ఏలూరులోని ప్రత్యేక కోర్టే ఈ వ్యవహారాన్ని తేల్చడం డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించినట్లవుతుందని పేర్కొంది. అగ్రిగోల్డ్ ఆస్తులను సిఐడి జప్తు చేయడాన్ని ప్రత్యేక కోర్టు సమర్థిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను ఆమోదించింది. అగ్రిగోల్డ్ స్కాం దర్యాప్తు కొనసాగించుకోవచ్చునని ఇడికి తేల్చి చెప్పింది.

జప్తు చేసిన ఆస్తుల విక్రయం ద్వారా వచ్చిన మొత్తాలను డిపాజిటర్లందరికీ సమానంగా పంచే అధికారాన్ని ప్రత్యేక కోర్టుకు డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కల్పిస్తోంది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 6లో ఉన్న ఏ నిబంధన కూడా మనీలాండరింగ్ చట్టం సెక్షన్ 5లో లేదు. జప్తు చేసిన ఆస్తుల విక్రయం ద్వారా వచ్చిన మొత్తాలను డిపాజిటర్లకు సమానంగా పంపిణీ చేయాలన్న నిబంధన ఏదీ మనీలాండరింగ్ చట్టంలో లేదు.. అని తీర్పుల పేర్కొంది.

ఇడి జప్తు ఉత్తర్వులపై పిటిషన్లు, అగ్రిగోల్డ్ యాజమాన్య ఆస్తులను జప్తు చేస్తూ ఇడి జారీ చేసిన తాత్కాలిక జప్తు ఉత్తర్వులను ఆల్ ఇండియా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ఇటీవల తీర్పు వెలువరించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జారీచేసిన జంతువులను మరికొన్ని కంపెనీలు వ్యక్తులు కూడా హైకోర్టులో వేరువేరుగా సవాల్ చేశారు. అగ్రిగోల్డ్ కు చెందిన ఆస్తులను తాము కొనుగోలు చేసిన తర్వాత వాటిని ఇడి జప్తు చేయడం చట్ట వ్యతిరేకమని వీరి వాదన. తాము కొనుగోలు చేసిన భూముల్లో నిర్మించిన అపార్ట్మెంట్లను కూడా జత్తు చేయడానికి ఆక్షేపించింది.

సిఐడి తరపున అడ్వొకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్, ఇడి తరపున సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్ జోశ్యుల భాస్కరరావు, పిటిషనర్ల తరపున పీఎస్పీ సురేష్ కుమార్. పూజారి నరహరి, సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్ వాదించారు

వ్యవసాయ కార్మికుల వాహనం బోల్తా

- ఒకరు మృతి, 20 మందికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ఆలూరు (కర్నూలు)

వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కార్మికులు ప్రయాణిస్తున్న వాహనం టైరు పేలిపోయి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సుమారు 20 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు... కర్నూలు జిల్లా హులేబీడు గ్రామానికి చెందిన 41 మంది వ్యవసాయ కార్మికులు చిప్పగిరి మండలంలోని ఓ గ్రామంలో మిరప పంట కోసేందుకు టాటా ఏస్ వాహనంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కర్నూలు జిల్లా ఆలూరు-గుంతకల్ రోడ్డు మార్గంలో హత్తిబెళగల్ బస్టాండ్ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న వాహనం టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో అదుపుతప్పి వాహనం బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మస్తానమ్మ (40) మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి.

ఘటన స్థలంలో క్షతగాత్రులు

'ఉక్కు' పరిరక్షణే ధ్యేయంగా పోరాటం

- పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా ఐక్య పోరాటాలు నిర్వహించనున్నట్లు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1143వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎఫ్ఎండి విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును ప్రయివేటీకరించాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను అందరూ వ్యతిరేకించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల వైపు నెడుతూ ఆర్థికంగా దెబ్బతీయాలని చూడటం దారుణమన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇటువంటి చర్యలను ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎన్.రామారావు, వెంకటరావు, రాజు, డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

లోకేష్‌కు జెడ్ కేటగిరీ భద్రత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు జెడ్ కేటగిరీ భద్రత కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు శనివారం అర్ధరాత్రి వరకూ బయటకు రానప్పటికీ వేర్వేరు మీడియాల్లో వార్తలు వచ్చాయి. లోకేష్ భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సిబ్బందికి అంతంత మాత్రంగానే ఉండటంతో కేంద్రానికి వెళ్లిన నివేదిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఒకటి రెండు రోజుల్లో దీనికి సంబంధించి సిఆర్‌పిఎఫ్ సిబ్బంది లోకేష్ భద్రతా బృందంలో చేరనున్నట్లు తెలిసింది. జెడ్ కేటగిరీ కింద భద్రత వస్తే నాలుగు నుండి ఆరుగురు ఎన్ఎస్‌జి కమెండోలు, 22 మంది పోలీసు సిబ్బంది రక్షణ కల్పిస్తూ ఉంటారు. వీరికి అదనంగా డిఎస్‌పి స్థాయి అధికారి, సిఐ, ఇద్దరు ఎస్ఐలు ఈ భద్రతా బృందంలో ఉంటారు.

సెక్యూరిటీల వేలంద్వారా రూ.66,900 కోట్ల రుణం

- ఈ ఏడాదికి ముగిసిన వేలం ప్రక్రియ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా 66,900 కోట్ల రూపాయల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. దీనికోసం 36 మంగళవారాలను వినియోగించుకుంది. వాస్తవానికి బడ్జెట్‌లో 63 వేల కోట్లను మాత్రమే రుణంగా తీసుకునేందుకు ప్రతిపాదించగా,3,600 కోట్ల రూపాయలను అదనంగా సమీకరించింది. ప్రతి నెలా మంగళవారాల్లో రిజర్వ్‌బ్యాంకు నిర్వహించే వేలంలో రుణాలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఎంత రుణాలు కావాలన్నది కూడా ముందుగానే రిజర్వ్‌బ్యాంకుకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే మొత్తం 36 సార్లు రుణ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారు. 2023 ఏప్రిల్‌లో కేవలం ఒక రోజు మాత్రమే రుణానికి వెళ్లిన ఆర్థికశాఖ మూడు వేల కోట్లను సమీకరించింది. అది కూడా ఒకే రోజు మూడు భాగాలుగా ఈ రుణాన్ని తీసుకోవడం గమనార్హం. ఆ తరువాత క్రమం తప్పకుండా మే నెల్లో నాలుగు సార్లు, జూన్‌లో ఐదు సార్లు, జూలైలో నాలుగుసార్లు, ఆగస్టులో మూడు పర్యాయాలు రుణాలకు వెళ్లారు. అలాగే సెప్టెంబర్‌లో, అక్టోబర్‌లో కూడా నాలుగేసి పర్యాయాలు రుణ సమీకరణ చేశారు. ఇక నవంబర్, డిసెంబర్, ఫిబ్రవరిలో మూడేసి పర్యాయాలు రుణానికి వెళ్లిన రాష్ట్రం ఈ ఏడాది జనవరిలో రెండు సార్లు రుణాన్ని సేకరించింది. కాగా ఆర్థిక సంవత్సరం చివరి నెల అయిన మార్చిలో మాత్రం కేవలం ఒక్కసారే రుణానికి వెళ్లిన ఆర్థికశాఖ ఆ ఒక్క రోజే ఏకంగా నాలుగు వేల కోట్లు సమీకరించడం విశేషం.

సెక్యూరిటీల వేలం ద్వారా నెలల వారీగా తీసుకున్న రుణం (రూ. కోట్లలో)

నెల	రుణ మొత్తం	నెల	రుణ మొత్తం
ఏప్రిల్	3,000	అక్టోబర్	5,450
మే	9,500	నవంబర్	2,500
జూన్	10,000	డిసెంబర్	7,000
జూలై	7,000	జనవరి	3,550
అగస్టు	3,000	ఫిబ్రవరి	6,900
సెప్టెంబర్	8,000	మార్చి	4,000

సిఎం అత్యంత ప్రమాదకరం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ బిజెపితో కలిసిందని, మరో పార్టీ లొంగిపోయిందని విమర్శించారు. పొత్తులు, తొత్తులుగా మారిన వీరు ముస్లిముల హక్కులు ఎలా పరిరక్షిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో మతతత్వ బిజెపిని ఓడించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి.హనీఫ్ తదితరులు ప్రసంగించారు.

పదేళ్లు ప్రత్యేక హోదా

(మొదటిపేజీ తరువాయి)

వరకు రుణమాఫీ చేస్తామని, పెట్టుబడి మీద 50 శాతం లాభంతో కనీస మద్దతు ధర ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధీ హామీ పథకం కింద కూలీలకు కనీస వేతనం రూ. 400లు, కేజి నుంచి పిజి వరకు ఉచిత విద్య, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.25 లక్షల ఉద్యోగాల భర్తీ, ఇళ్లు లేని పేదలకు పక్కా ఇళ్లు, ఇంట్లో అందరికీ పింఛన్-వికలాంగులకు రూ. 6వేల పింఛన్ ఇవ్వడాలను తొమ్మిది గ్యారంటీలుగా ఆమె చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వీటిని అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో బిజెపితో టిడిపిది బహిరంగ పొత్తు అయితే, వైసిపిది రహస్య పొత్తు అని ఇలాంటి మోసాలను గడప గడపకు కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు 1500 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో బిఫామ్‌లు మాత్రం 175 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు 25 మంది ఎంపి అభ్యర్థులకు మాత్రమే వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రావాలని, దీని కోసం అంతా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఐటి నోటీసులపై నిరసన

రూ. 1800 కోట్లు చెల్లింపులు చేయాలంటూ ఐటి నోటీసులు పంపటంపై పిసిసి కార్యాలయం ఆంధ్ర రత్న భవన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలతోపాటు, ఇతర కాంగ్రెస్ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, కాంగ్రెస్‌కు నోటీసులు ఇప్పించింది బిజెపినేనని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్‌లలో ఉన్న రూ. 230 కోట్లను ఫ్రీజ్ చేశారని, క్యాంపెయిన్‌కి కూడా పైసా లేకుండా కాంగ్రెస్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారన్నారు.

ముఖ్యమంత్రికి నిరసన సెగ

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఖాళీ బిందెలతో సిఎంకు నిరసన తెలిపారు.

సిపిఎం నాయకుని అరెస్ట్

తుగ్గలి మండలం జొన్నగిరి, దేశాయి తండాలలో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చిందని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌కు వినతి పత్రం ఇవ్వడానికి పేదలు, మహిళలతో వస్తున్న సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములును జొన్నగిరిలో పోలీసులు అరెస్టు చేశారు. పేదలను, మహిళలను చెదరగొట్టారు. గత కొన్ని సంవత్సరాల నుండి దేశాయి తండాలో నీటి సమస్య విపరీతంగా ఉందని, ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదని, ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి వెళ్తుంటే అరెస్టు చేయడం అన్యాయమని శ్రీరాములు అన్నారు. దేశాయ్ తండాలో నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి కాన్వాయ్‌పై చెప్పు విసిరిన ఆగంతకుడు

మేమంతా సిద్ధం యాత్రలో ముఖ్యమంత్రి జగన్ కాన్వాయ్‌పైకి ఆగంతకుడు చెప్పు విసిరాడు. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో రోడ్ షో నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గుత్తి బస్టాండ్ వద్ద జనం గుంపులో నుంచి గుర్తు తెలియని వ్యక్తి విసిరిన చెప్పు ముఖ్యమంత్రికి దూరంగా వెళ్లింది. ఈ ఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆ తర్వాత నుంచి ముందు గార్డును పెట్టుకుని యాత్రను జగన్ కొనసాగించారు. చెప్పు విసిరిన వ్యక్తిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై కొనసాగుతున్న దర్యాప్తు

- లైంగిక వేధింపులే కారణమంటున్న విద్యార్థి సంఘాలు

విద్యార్థిని మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఎపి బాలల హక్కుల కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి -మధురవాడ, కలెక్టరేట్ విలేకరులు (విశాఖపట్నం)

విశాఖ నగర శివారు కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ డిప్లొమో చదువుతూ గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డ అనకాపల్లి జిల్లా నాతవరానికి చెందిన విద్యార్థిని ఆత్మహత్యపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. తమ కుమార్తె చనిపోయే ముందు వాట్సాప్‌లో పంపిన సందేశాల ప్రకారం లైంగిక వేధింపులే కారణమని పేర్కొంటూ మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలు కళాశాలలో ఎవరెవరితో సన్నిహితంగా ఉండేది? అన్న విషయాలను తెలుసుకుంటున్నారు. మరణించడానికి ముందు కుటుంబీకులతో చేసిన వాట్సాప్ ఛాటింగ్‌పైనా ఆరా తీస్తున్నారు. శనివారం విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారని, ఆ నివేదిక ఆధారంగా మరికొంత దర్యాప్తు జరిపి వివరాలు వెల్లడిస్తామని పిఎం.పాలెం సిఐ రామకృష్ణ తెలిపారు. కెజిహెచ్‌లో విద్యార్థిని మృతదేహాన్ని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సందర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యార్థి మృతి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపి, కారకులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్ఒ ఆధ్వర్యంలో శనివారం కొమ్మాదిలోని చైతన్య ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కాలేజీ వద్ద, కెజిహెచ్ మార్చురీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆయా చోట్ల ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, గర్ల్స్ కన్వీనర్ పల్లవి, పిడిఎస్ఒ జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్ మాట్లాడారు. లైంగిక వేధింపులు తాళలేకే సదరు విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. కళాశాల యాజమాన్యం, పోలీసులు చెబుతున్న విషయాల్లో వాస్తవం లేదన్నారు. అనంతరం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. కెజిహెచ్ వద్ద మృతురాలి కుటుంబీకులు మాట్లాడుతూ ఈ కేసుపై సమగ్ర దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇసుక మాఫియా దాడిపై కేసు నమోదు

పోలీసుల వైఖరిపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - తెనాలి, కొల్లిపర (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా కొల్లిపర మండలంలో ఇసుక మాఫియా విచక్షణారహితంగా దాడికి తెగబడిన సంఘటనలో పోలీసులు ఎట్టకేలకు శనివారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో ఇసుక అక్రమ రవాణాను నిలువరించే ప్రయత్నం చేసిన స్థానికులపై శుక్రవారం రాత్రి ఇసుక మాఫియా దాడికి తెగబడిన సంగతి తెలిసిందే. మున్నంగి ఇసుక రీచ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలను నిలువరించేందుకు గ్రామానికి చెందిన వేమూరి బాలరాజు, అశోక్, రాజేష్, మరికొందరు ట్రాక్టర్లను అడ్డుకోవడంతో గొడవ చెలరేగింది. ట్రాక్టర్లను అడ్డుకున్న వారిపై ఇసుక మాఫియా దాడికి తెగబడింది. ఈ దాడిలో గాయపడిన బాలరాజు, అశోక్, రాజేష్‌ను తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరు గ్రూపుల పరస్పర ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వేమూరి మోషే, వేమూరి చెంచయ్య, వేమూరి సంజయ్, వేమూరి అంజి, వేమూరి మల్లికార్జునతోపాటు దాడిలో గాయపడిన బాలరాజు, అశోక్, రాజేష్‌పైనా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.రవీంద్రారెడ్డి తెలిపారు. అయితే, వాహనాలు అడ్డుకున్న వారు, ఇసుక తరలిస్తున్న వారు కూడా అధికార పార్టీ కనుసన్నల్లో పని చేసే వ్యక్తులుగా తెలుస్తోంది. ఇసుక రీచ్‌పై ఆధిపత్యం కోసం ఇరు గ్రూపులు దాడులకు తెగబడ్డారని స్థానికులు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎంతో బాధ్యతగా వ్యవహరించాల్సిన పోలీసులు కూడా వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డిజిటల్ క్లాసులపై అవగాహన లేకుంటే ఎలా?

డిఇఒ, డిప్యూటీ డిఇఒ, హెచ్ఎంపై ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

డిజిటల్ విద్యా బోధనపై అధికారులకు అవగాహన లేకపోతే విద్యార్థులకు ఏ విధంగా పాఠ్యాంశాలను బోధిస్తారని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఆయన గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తొమ్మిదవ తరగతిని పరిశీలించారు. విద్యార్థులు ఏ మేరకు మెరుగుపడ్డారు అనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బైజూస్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏ విధంగా బోధిస్తారో చూపించాలని డిఇఒ పగడాలమ్మను, డిప్యూటీ డిఇఒలను, హెచ్ఎం బిడ్డక భీముడును కోరారు. ఇందుకు వారు డిజిటల్ బోర్డు వరకు వెళ్లి తెల్లమొహం వేశారు. డైట్ ప్రిన్సిపల్‌గా పనిచేసిన అనుభవం ఉన్న మీకు బోధనపై కనీస అవగాహన లేకపోతే ఎలా అని డిఇఒను ప్రవీణ్‌ప్రకాష్ మండిపడ్డారు.

రాత్రి వివాహం.. తెల్లారేసరికి విషాదం

ప్రజాశక్తి - మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

కాళ్ల పారాణి ఆరక ముందే ఓ నవ వధువు మృతి చెందిన విషాద సంఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్కువ మండలం దబ్బగెడ్డ పంచాయతీకి చెందిన వారణాసి భాస్కరరావుకు పార్వతీపురం మండలం కొత్తవలసకు చెందిన అఖిల (20)తో శుక్రవారం రాత్రి వైభవంగా వివాహం జరిగింది. ఇంతలో ఏమైందోగానీ శనివారం ఉదయం అఖిల తనకు నీరసంగా ఉందని చెప్పి ఒక్కసారిగా అపస్మారస్థితికి చేరుకుంది. కుంటుంబ సభ్యులు సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అఖిల మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

జగన్ బస్సుయాత్ర ఫెయిల్ : దేవినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన బస్సుయాత్ర ఫెయిలైందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఓటమి భయంతో చెప్పిన అబద్ధాన్నే పదేపదే చెప్పి ప్రజల్ని ఇంకా మోసం చేయాలనుకుంటున్నారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం అన్ని విధాలా ఘోరంగా విఫలమైందన్నారు. మాజీమంత్రి వివేకనందరెడ్డి హత్యకేసులో చెల్లెల్లు సునీత, షర్మిల అడిగే ప్రశ్నలకు సిఎం జవాబు చెప్పగలరా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే జగన్‌కు బుద్ధి చెప్తారని అన్నారు. కాగా వైఎస్ జగన్ పేదల ద్రోహి అని టిడిపి ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న విమర్శించారు. ఎన్నికల ముందే వైసిపి ఓటమి ఖాయమైందన్నారు.

కడప తహాశీల్దార్ ఇంట్లో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

కడప తహాశీల్దారు శివప్రసాద్ ఇంట్లో ఎసిబి అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. ఏకకాలంలో బెంగళూరు, కడప, తిరుపతి, రేణిగుంటలోని తహాశీల్దారు ఇళ్లు, కార్యాలయం, బంధువుల ఇళ్లలో సోదాలు చేశారు. పలు అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులకు సమాచారం అందడంతో నాలుగు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. తిరుపతి పద్మావతిపురంలోని ఆయన నివాసంలో పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు, బెంగళూరులో భారీ స్థాయిలో నగదును పట్టుకున్నట్లు సమాచారం. గతంలో ఆయన రేణిగుంట తహాశీల్దార్‌గా విధులు నిర్వహించారు.

2030 నాటికి 34 శాతం విద్యుత్ కార్లే..

- ప్రపంచ దేశాలతో పోల్చితే వెనుకబాటు
- గోల్డ్‌మాన్ సాచే అంచనా
- గ్లోబల్ మార్కెట్‌లో 7% వాటా

న్యూఢిల్లీ : ప్రపంచ విద్యుత్ వాహన రంగంలో భారత్ కీలక మార్కెట్‌కు చేరుకోనుందని గోల్డ్‌మాన్ సాచే అంచనా వేసింది. 2040 నాటికి గ్లోబల్ ప్యాసింజర్ వెహికల్ (పివి) మార్కెట్‌లో 7 శాతం వాటాను పొందొచ్చని పేర్కొంది. భారత్ ప్రస్తుతం ఒక్క శాతం మార్కెట్ వాటాను మాత్రమే కలిగి ఉంది. 2024 అంచనాల ప్రకారం.. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల అమ్మకాలు 2023 నాటికి దాదాపు లక్ష కంటే ఎక్కువ లేదా తక్కువ స్థాయిలోనే ఉంటాయని గోల్డ్‌మాన్ సాచే అంచనా వేసింది. 2030 నాటికి 13 లక్షల యూనిట్ల మార్క్‌ను, 2040 నాటికి 55 లక్షల యూనిట్లకు చేరుకోవచ్చని అంచనా వేసింది. ఇతర దేశాలతో పోలిస్తే ఇవి వాహనాల మార్కెట్ విస్తరణలో భారత్ చాలా వెనుకబడి ఉంది. ప్రపంచ సగటు కంటే చాలా తక్కువగా ఉంది. భారత మొత్తం వాహన అమ్మకాల్లో 2026 నాటికి ఇవిల వాటా 7 శాతంగా, 2030లో 21 శాతం, 2040 నాటికి 57 శాతానికి చేరుకోవచ్చు. అదే అమెరికాలో 2030 నాటికి 34 శాతం, 2040 నాటికి 62 శాతం ఇవి వాహనాలు ఉండొచ్చని అంచనా. జపాన్, చైనా, ఇయు, భారత్ దేశాల్లోని ఇవి పురోగతి మిగితా ప్రపంచంపై ప్రధానంగా ఉంటుంది.

విద్యుత్ వాహన రంగంలో 30 శాతం వృద్ధి రేటును సాధించాలనే నీతి అయోగ్ లక్ష్యం కంటే సవరించిన అంచనాలు భారీగా తగ్గాయి. దీంతో ఇవి పరిశ్రమను ప్రోత్సహించడానికి కేంద్రం ఇటీవల ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్ (ఇఎంపిఎస్)ను ప్రవేశపెట్టింది. ఈ పథకం జూన్ 2024తో ముగుస్తుంది. నాలుగు నెలల పాటు అమల్లో ఉండే ఇఎంపిఎస్‌లో భాగంగా ప్రతి ద్విచక్ర వాహనానికి రూ.10,000 వరకు రాయితీని అందిస్తుంది. తేలికపాటి త్రీవీలర్‌కు రూ.25,000 (ఇ-రిక్షాలు వంటివి), భారీ త్రీ వీలర్‌కు రూ.50,000 (ఆటోలు మరియు వాణిజ్య యూనిట్లు వంటివి) రాయితీలు లభించనున్నాయి. ఇవి విభాగంలో టాటా మోటార్స్ ప్రస్తుతం టియాగో, నెక్సాన్, టిగోర్, పంచ్ వంటి మోడళ్లతో ఇవి మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తోంది, తర్వాత ఎంజి మోటార్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా మార్కెట్‌పై పట్టునకు ప్రయత్నిస్తున్నాయి.

బాండ్లతో విమర్శలు బంద్

టిడిపికి షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ రూ.40 కోట్ల బాండ్లు
వైసిపికి పలు కంపెనీల నుంచి రూ.133 కోట్లు
జనసేనకు రూ.10 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ కంపెనీపై విరుచుకుపడ్డ టిడిపి ఇప్పుడు మౌనంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టులను ప్రభుత్వం అడ్డగోలుగా షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు కట్టబెట్టిందని టిడిపి నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. ఎప్పుడయితే ఎన్నికల బాండ్ల ద్వారా ఆ పార్టీకి ముడుపులు అందాయో అప్పటి నుంచి ఆ కంపెనీని పల్లెత్తు మాట కూడా అనడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డిఎస్ఎస్) ప్రాజెక్టు కింద వ్యవసాయ పంపుసెట్లకు, ప్రభుత్వ కార్యాలయాలు, గృహ వినియోగదారులకు స్మార్ట్, ప్రిపెయిడ్ మీటర్లను రాష్ట్ర ప్రభుత్వం అమరుస్తున్న విషయం తెలిసిందే. ప్రజలపై భారాలు మోపే ఈ ప్రాజెక్టులను అధిక ధరకు విద్యుత్ పంపిణీ షిర్డిసాయికి ప్రభుత్వం కట్టబెట్టింది. అదేవిధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ ప్రాజెక్టులను కూడా పంపిణీ సంస్థలు ఇదే కంపెనీకి కట్టబెట్టాయి. మీటర్ల టెండర్లలో పెద్ద కుంభకోణం జరిగిందని టిడిపి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆ పార్టీ నేతలు, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, దీపక్ రెడ్డి, జివి రెడ్డితో పాటు పలువురు నాయకులు పదే పదే మీడియా ముందు విమర్శలు చేశారు. ఈ విమర్శలను షిర్డిసాయి కంపెనీ ఎన్నికల బాండ్ల రూపంలో టిడిపి నోరు మూయించింది. ఈ ఏడాది జనవరి 12వ తేదీన రూ.40 కోట్ల విలువైన బాండ్లను ఒక్కొక్కటి కోటి చొప్పున 40 బాండ్లను కొనుగోలు చేసి టిడిపికి సమర్పించింది. దీంతో అప్పటి నుంచి టిడిపి ఈ కంపెనీని పల్లెత్తి మాట కూడా అనడం లేదు. ఈ కంపెనీతో పాటు మరో మూడు విద్యుత్ కంపెనీలు టిడిపికి ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయి. వెస్టర్న్ యపి పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ రూ.20 కోట్లు, ఎస్ఇపిసి పవర్ కంపెనీ, రూ.5 కోట్లు, సోమశిల సోలార్ పవర్ కంపెనీ రూ.2 కోట్లు చొప్పున టిడిపికి కట్టబెట్టాయి. యుపి పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ జనసేనకు కూడా రూ.10 కోట్లతో బాండ్లు కొనుగోలు చేసింది.

క్విడ్ ప్రోకోలో వైసిపి

అధికార పార్టీ వైసిపి క్విడ్ ప్రోకోలో విద్యుత్ కంపెనీల నుంచి బాండ్ల రూపంలో ముడుపులు తీసుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటులో భాగంగా పలు కంపెనీలకు ప్రభుత్వం భూములు కేటాయింపులు చేసింది. గ్రీన్‌కో విండ్ సంస్థకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు వైసిపి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీనికోసం 4,766 ఎకరాలను ఈ సంస్థకు అప్పగించింది. దీనికి గాను గ్రీన్‌కో రూ.10 కోట్లను బాండ్ల రూపంలో వైసిపికి అప్పగించింది. గ్రీన్‌కో సంస్థ సిఇఒ సోదరుడు కాకినాడ లోక్‌సభ నుంచి వైసిపి తరపున పోటీ చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుతోపాటు 960 మెగావాట్ల పోలవరం విద్యుత్ ప్రాజెక్టు దక్కించుకున్న మేఘా కంపెనీ వైసిపికి రూ.37 కోట్ల రూపంలో బాండ్లు కొనుగోలు చేసింది. అదేవిధంగా రూ.12,264 కోట్ల విలువైన ఎగువ సీలేరు పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టును ప్రభుత్వం కట్టబెట్టింది. అస్ట్రో మధ్య విండ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 2023 నవంబర్‌లో రూ.17 కోట్ల విలువైన బాండ్లను వైసిపికి కొనుగోలు చేసింది. అస్ట్రోజై సల్మార్ ప్రైవేట్ కంపెనీ కూడా ఇదే తేదీలో మరో రూ.17 కోట్లు వైసిపికి బాండ్ల రూపంలో అప్పగించింది.

తెలుగు కంపెనీలే ఇతర రాష్ట్రాల్లో..

ఉత్తరప్రదేశ్‌కు చెందిన యుపి వెస్టర్న్ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీకి తెలుగు వారే డైరెక్టర్లుగా ఉన్నారు. రాష్ట్రానికి చెందిన వారే అక్కడ కంపెనీలు పెట్టారు. ఒక కంపెనీలో ఉన్న డైరెక్టర్ పలు కంపెనీల్లో కూడా డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. మేఘా ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఉన్న పమిరెడ్డి పిచ్చిరెడ్డి వెస్టర్న్ యుపి పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నారు. తానోత్ విండ్ కంపెనీకి చెందిన డైరెక్టర్ కె హరికృష్ణ, రామానుజం వెంకట సీత, గ్రీన్‌కో, అచ్యింత కంపెనీల్లో డైరెక్టర్లుగా ఉన్నారు. ఎస్ఇపిసి కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్న బొంతు శ్రీనివాస్, కొత్తురు గోవర్ధన్‌రెడ్డి మేఘాతో పలు ప్రైవేట్ విద్యుత్ కంపెనీల్లో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

విద్యుత్ కంపెనీలు బాండ్ల వివరాలు

వైసిపికి ఇచ్చిన కంపెనీలు

కంపెనీ పేరు	ఇచ్చిన నగదు	తేదీ
మేఘా	37కోట్లు	2023
గ్రీన్‌కో విండ్	10కోట్లు	2023 ఏప్రిల్ 11
స్కిరాన్ రెన్యువబుల్ ఎనర్జీ	7కోట్లు	2023 ఏప్రిల్11, 15 నవంబర్ 2023
తానోత్ విండ్ పవర్,		
తాడాస్ విండ్ ఎనర్జీ	4కోట్లు	2022 ఏప్రిల్
స్నేహ కైనెటిక్ పవర్	10కోట్లు	2023 నవంబర్
అస్ట్రోమధ్య విండ్	17కోట్లు	2023 నవంబర్
ఖండ్కే విండ్ ఎనర్జీ	కోట్లు	2023 ఏప్రిల్
ఆరిష్ సోలార్	2 కోట్లు	2023 ఏప్రిల్
ఆష్మాన్ ఎనర్జీ	కోటి	2023 ఏప్రిల్
అనిమల విండ్	2కోట్లు	2023 ఏప్రిల్
అచింత్య సోలాం	కోటి	2022 ఏప్రిల్
జెఎస్‌డబ్ల్యూ	4కోట్లు	
దివ్యేశ్ పవర్	3కోట్లు	ఏప్రిల్2022 2 కోట్లు, 23
యాక్సిస్ విండ్	3కోట్లు	2023 ఏప్రిల్
ఎలెనా రెన్యువబుల్	3కోట్లు	2022 ఏప్రిల్ 8వ 2కోట్లు, 2023, ఏప్రిల్ 15 కోటి
ఎన్ఎస్ఎల్ రెన్యుబుల్ పవర్	కోటి	2023 ఏప్రిల్ 10
దేవర విండ్	2కోట్లు	2023 నవంబర్
శ్రేయాస్ రెన్యుబల్ ఎనరీ	కోటి	2023 ఏప్రిల్ 15

మొత్తం : రూ.133 కోట్లు

టిడిపికి ఇచ్చిన కంపెనీలు

కంపెనీ పేరు	ఇచ్చిన నగదు	తేదీ
షిర్డి ఎలక్ట్రికల్స్	40కోట్లు	2024 జనవరి
వెస్టర్న్ యుపి పవర్	20కోట్లు	2024 జనవరి
ఎస్ఇపిసి పవర్	5కోట్లు	2023 నవంబర్
మేఘా	4కోట్లు	2022 అక్టోబర్
సోమశిల సోలార్ పవం	2కోట్లు	2023 నవంబర్

మొత్తం: 71 కోట్లు

fincare Small Finance Bank
ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : 301-306, 3వ అంతస్తు, అభిజీత్-వి, మేయర్స్ బంగ్లా ఎదురు, లా గార్డెన్ రోడ్డు, మితఖాలి, అహ్మదాబాద్-380006, గుజరాత్
హెడ్ ఆఫీస్ : 835/39, బ్రెన్ మెర్క్యూరి, 5వ అంతస్తు, కైకొండనహళ్లి వర్తూరు హొబ్లి, బెంగళూరు తూర్పు తాలూక, బెంగళూరు-560035, కర్నాటక, www.fincarebank.com

అనుబంధం IV స్వాధీనతా నోటీసు (రూల్ 8(1) చూడండి)

ఏదైతే, దిగువసంతకందారుడు అయిన ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూర్డ్ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) యొక్క సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, యొక్క రూల్ 3 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అతనికి ఇవ్వబడిన అధికారాలను వినియోగిస్తూ **తేది 14.11.2022న డిమాండ్ నోటీసు** జారీ చేయడమైనది. **లోన్ ఎకౌంట్ నం.21630000003968** కొరకు పిలువబడిన **రుణగ్రహీతలు, తనఖాదారులు, కో-అబ్లిగెంట్స్ మరియు అంగీకరించేవారు : 1. శ్రీ/శ్రీమతి. షేక్ నాజిని,** నివాసం : నం.41 16 9, కృష్ణలంక, కాటూరివారి వీధి, హై స్కూల్ ఎదురు, విజయవాడ అర్బన్ 520013 మరియు **ఇక్కడ కూడా :** ఫ్లాట్ నం.3/1, సూర్య టవర్స్, ఎన్‌సిబి కాలనీ, బెంజి సర్కిల్ వద్ద, విజయవాడ, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-520008. **2. శ్రీ/శ్రీమతి.షేక్ సుభాని,** నివాసం : నం.41 16 9, కృష్ణలంక, కాటూరివారి వీధి, హై స్కూల్ ఎదురు, విజయవాడ అర్బన్ 520013 మరియు **ఇక్కడ కూడా :** ఫ్లాట్ నం.3/1, సూర్య టవర్స్, ఎన్‌సిబి కాలనీ, బెంజి సర్కిల్ వద్ద, విజయవాడ, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-520008, నోటీలో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడానికి ఉన్న **రూ॥ 24,91,909/- (ఇరవై నాలుగు లక్షల తొంభై ఒక్క వేల తొమ్మిది వందల తొమ్మిది రూపాయలు మాత్రమే)** సదరు నోటీసు తేది నుండి 60 (అరవై) రోజులలోపు తిరిగి చెల్లించాలని తెలపడమైనది.

రుణగ్రహీతలు, తనఖాదారులు, కో-అబ్లిగెంట్స్ మరియు అంగీకరించినవారు మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా ఆధీకృత అధికారి సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9 చదువుతూ పేర్కొన్న చట్టం సెక్షన్ 13లోని సబ్ సెక్షన్(4) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద వివరించిన ఆస్తిని **28.03.2024**వ తేదీన దిగువసంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకోవడమైనది.

రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది. ముఖ్యంగా సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తి/ఆస్తులతో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు **ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌కు రూ॥ 24,91,909/- (ఇరవై నాలుగు లక్షల తొంభై ఒక్క వేల తొమ్మిది వందల తొమ్మిది రూపాయలు మాత్రమే) 08.10.2022** నాటికి రియలైజేషన్ తేది వరకు దానిపై తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించి జరుపవచ్చు.

తనఖా ఆస్తి వివరణ :
అంశం నం.1 : ఆస్తి నం. కృష్ణాజిల్లా, పటమట ఎస్ఆర్ఓ, కానూరు గ్రామ పంచాయతీ ఏరియా, కానూరు గ్రామం, ఆర్.ఎస్.నం.130/3ఎ, 129/2ఎ లో ఈ మొత్తం విస్తీర్ణం 345.6 చ.గ.లు. ఈ రోజు తెలియజేసే పేర్కొనబడని ఉమ్మడి హక్కు ఆస్తి బయట పరిధి 24.68 చ.గ.లు. లేదా 20.63 చ.మీ.లు. తో అన్నీ సౌలభ్య హక్కులు ఉన్న డో.నం.3-216/14. **అంశం నం.2 :** పై ఎ షెడ్యూల్‌కి సంబంధించిన "మహాలక్ష్మి రెసిడెన్సీ" పేరుతో కొత్త రెసిడెన్షియల్ గ్రూప్ ఇల్లు, 3వ అంతస్తులోని ఫ్లాట్ నం.టిఎఫ్-4, ఎ-షెడ్యూల్ ఆస్తి పై నిర్మాణం ఫ్లాట్ సంబంధించిన పరిధి 600 చ.అ.లు. ప్లింత్ ఏరియా, 100 చ.అ.లు. కామన్ ఏరియా, 20 చ.అ.లు. పార్కింగ్ ఏరియాతో అపార్టుమెంట్ లో సాధారణ సౌకర్యాలలో కామన్ హక్కులు తో అన్నీ సౌలభ్య హక్కులు. మరియు **హద్దులు : తూర్పు :** మొత్తం సైట్ **సరిహద్దులు : తూర్పు :** అంగిరేకుల మురళీకృష్ణం ఆస్తి, **పడమర :** పంచాయతీ రోడ్డు, **ఉత్తరం :** 12 అ.లు. వెడల్పు ఉమ్మడి రోడ్డు, **దక్షిణం :** అంగిరేకుల రామ్‌ప్రసాద్ ఆస్తి.

తేది: 28.03.2024, ప్రదేశం: విజయవాడ. సం/- అధీకృత అధికారి, ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

Chola Enter a better life
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: చోల క్రెస్ట్, సూపర్ బి, సి54 & సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గ్యాండీ, చెన్నై-600 032.

స్వాధీనతా ప్రకటన ((అనుబంధం-4)(రూల్ 8(1) క్రింద)

ఏదైతే, క్రింది సంతకందారు **మెసర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002, మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీత **(పేర్లు మరియు చిరునామాలు దిగువ పేర్కొనబడినవి)** లను, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా సదరు నోటీసులో పేర్కొనబడిన మొత్తాలును మరియు దానిపై వడ్డీతో తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. ఇందు దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా ఇందు దిగువ పేర్కొన్న రుణగ్రహీతలుకు మరియు సర్వజనులుకు ప్రకటన ఇవ్వడమేమనగా, సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, క్రింది సంతకందారు ఇందు దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనంచేసుకున్నారు.** ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తి తో లావాదేవీలు జరుపరాదని ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు ఏవేని అట్టి లావాదేవీలు **మెసర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** కు ఇందు దిగువ పేర్కొన్నట్లుగా మొత్తాలు మరియు దానిపై వడ్డీను చెల్లించుటకులోబడి ఉంటుంది.
రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

క్ర. సం.	రుణగ్రహీతలు పేరు & చిరునామా & రుణఖాతా నంబరు	డిమాండ్ నోటీసు తేది	బకాయి మొత్తాలు	స్వాధీనంచేసుకొన్న ఆస్తి వివరణ	స్వాధీనతా తేది
1.	రుణ ఖాతా నం.లు HL01VJI000038482 నాగుల్ మీరావలి షేక్, శకీలా షేక్, ఇరువురి నివాసం: 24-28/3-284, రాజీవ్‌గాంధీ స్ట్రీట్, సుందరనగర్ కాలనీ, విజయవాడ (అర్బన్), ఆం.ప్ర.-520003. మరియు: 204, మొదటి అంతస్తు, ఆర్.ఎస్.నం. 143/4, 144/5, గునడాలా వంతెన, విజయవాడ (అర్బన్)-520004.	16-10-2023	14.10.2023 నాటికి రూ. 33,77,170/- (రూపాయలు ముప్పై మూడు లక్షల డెబ్భై ఏడు వేల నూటా డెబ్భై మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	ఎ-షెడ్యూలు: కృష్ణా జిల్లా, విజయవాడ తూర్పు జిల్లా రిజిస్ట్రేషన్, గునడాల సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, గునడాలా, ఆర్.ఎస్.నం.143/4, 144/5, డోర్ నం.49-4-12 దగ్గర, 968.88చ.గ.ల విస్తీర్ణపు సైటు, సరిహద్దులు: తూర్పు: గట్టి శకుంతల ఆస్తి 80.0అ.లు, దక్షిణం: 33.0అ.ల వెడల్పు రోడ్డు, 109.0అ.లు, పడమర: దీప నివాస్‌కు చెందిన సరిహద్దు గోడ 80.0అ.లు, ఉత్తరం: కలపల ప్రసాద రావు, కలపల అంబేద్కర్ ఆస్తి, 109.0అ.లు. ఈ నాలుగు సరిహద్దుల్లో 46.58చ.గ.లు లేదా 38.94చ.మీ.ల సైటు యొక్క ఏదైతే విడదీయలేని ఉమ్మడి భాగంలో 968.88చ.గ.లు లేదా 810.1చ.మీ.ల సైటు. బి-షెడ్యూలు: పై ఎ-షెడ్యూలులో "శ్రీ కనకదుర్గ కన్‌స్ట్రక్షన్స్" పేరున నిర్మించిన పూర్తిసైటు అపార్టుమెంట్, దేనిలోనైతే గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నం.103, సరిహద్దులు: తూర్పు: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఒపెన్ టు స్కై, పడమర: ఉమ్మడి కారిడార్, ఉత్తరం: ఒపెన్ టు స్కై. ఈ నాలుగు సరిహద్దుల్లో ఫ్లాట్ యొక్క 857చ.అ.ల ప్లింత్ ఏరియా, ఫ్లాట్ యొక్క 257చ.అ.ల ఉమ్మడి ఏరియా, 100చ.అ.ల పార్కింగ్ ఏరియా. దానిపై అన్ని ఈజిమెంట్ హక్కులతోసహా.	స్వాధీనతా తేది 26.03.2024

ప్రదేశం: విజయవాడ (అర్బన్)
తేది: 26.03.2024
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున, అధీకృత అధికారి.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్ రికవరీ బ్రాంచి-1 (కోడ్-05172), రెండవ అంతస్తు, టిఎస్ఆర్‌టిసి కమ్యూటర్ ఎమెనిటీ సెంటర్, బస్ టెర్మినల్ కాంప్లెక్స్, కోఠి, హైదరాబాద్ - 500095, తెలంగాణ రాష్ట్రం. ఇ-మెయల్ : sbi.05172@sbi.co.in

చర/స్థిరాస్తుల కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 6(2)/8(6) ప్రకారం) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూలు 6(2) / 8(6) నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తులు అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా **ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)** ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా **ఋణగ్రహీత:** మెస్సర్స్ వాసుదేవ మిల్క్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్స్ : శ్రీ కె. సతీష్ మరియు శ్రీమతి కె. శ్రావణి, **రిజిష్టర్డు చిరునామా :** డి.నెం.54-11-1/1, ప్లాట్ నెం.79, 3వ ఫేజ్, జవహర్ ఆటో నగర్, విజయవాడ, కృష్ణాజిల్లా - 520007. **వేరొక చిరునామా :** డి.నెం.677/1ఎ, 677/1సి, 677/3, దాచేపల్లి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521260. **వేరొక చిరునామా :** డి.నెం.59-13-34/24, గ్రౌండ్ ఫ్లోర్, గాయత్రి నగర్, విజయవాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్. **హామీదారులు : 1. శ్రీ కొమ్మరాజు సతీష్,** తండ్రి : కృష్ణారావు, డి.నెం.5-117, మానికొండ గ్రామం, ఉంగుటూరు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521260. **2. శ్రీమతి కొమ్మరాజు శ్రావణి,** భర్త : శ్రీ కొమ్మరాజు సతీష్, డి.నెం.5-117, మానికొండ గ్రామం, ఉంగుటూరు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521260. వారి నుండి రావల్సిన బకాయి **తేది.28.03.2024** నాటికి **రూ.10,66,45,120/-** (అక్షరాల పది కోట్ల అరవై ఆరు లక్షల నలభై ఐదు వేల నూట ఇరవై రూపాయలు మాత్రమే) + డిఆర్‌టి హైదరాబాద్ వారి ద్వారా తేది.17.02.2020న ఇవ్వబడిన ఓ.ఎ.నెం.747/2019 లోని డిక్రీడ్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు వ్యయాలు మొదలగునవి రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారియైన సెక్యూర్డ్ క్రెడిటార్‌చే **లాంఛనాత్మక స్వాధీనత** చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులను **తేది.19-04-2024** న **"ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే"** మరియు **"అక్కడ ఏమున్నదో అదే"** పద్ధతి పై విక్రయించబడును. **రిజర్వు ధర మరియు ధరావత్తు దిగువ తెలిపిన సంబంధిత ఆస్తుల వద్ద ఇవ్వబడినవి.**

ఏవేని తెలిసిన ఎన్‌కంబరెన్స్‌తో గల చరాస్తి సంక్షిప్త వివరములు

ప్లాంట్ & మెషినరీ :- ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, దాచేపల్లి వద్ద గల మెస్సర్స్ వాసుదేవ మిల్క్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున గల చరాస్తి. 1) Milk Reception Unit (Quantity-10), 2) Milk Storage Unit (Quantity-5), 3) Processing Unit (Quantity-7), 4) Ghee Plant & Bi Products Unit (Quantity-9), 5) Milk Packing Unit (Quantity-5), 6) Steam Supply Plant (Quantity-1), 7) Refrigeration & Cold Room Section (Quantity-16) and 8) Other Assets- a) Sub- station Equipment, b) D.G. Set 125 KVA, c) Laboratory Equipment, b) Pesto-Flash, c) Cans(plastic) & Sachet Crates, d) Crate Transporters, e) Electronic Weigh Scale, f) Office Furniture, g) Computers (2 Nos), Printers (2 Nos), h)Date Coding & Rewinding machine, i) RO & Softner Plant & j) Air Compressor.

రిజర్వు ధర: రూ.1,10,00,000/- | ధరావత్తు: రూ.11,00,000/-
ధరావత్తు చివరి తేది : 18.04.2024 | బిడ్ పెంపుదల: రూ.50,000/-
ఇ-వేలం తేది : 19.04.2024 | వేలం సమయం : ఉ॥ 11.00 గం.ల నుండి మ॥ 1.00 గం. వరకు
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసినంతవరకు ఎన్‌కంబరెన్స్ : లేవు | ఆస్తి ఐడి : SBIN400020983999

ఏవేని తెలిసిన ఎన్‌కంబరెన్స్‌తో గల స్థిరాస్తి సంక్షిప్త వివరములు

విజయవాడ (సెమి అర్బన్)-521260, కృష్ణాజిల్లా, ఉంగటూరు మండలం, మానికొండ గ్రామ పంచాయితీ వద్ద సర్వే నెం.669/2, 670/1 లోని ఎ.2.08 సెంట్ల విస్తీర్ణం గల కమర్షియల్/నివాస ప్లాట్ యావత్తు ఆస్తి కంకిపాడు ఎస్ఆర్ఓ వద్ద, తేది.29/07/2010న రిజిష్టరు కాబడిన రిజిష్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.2855/2010 ప్రకారం శ్రీ కొమ్మరాజు సతీష్ గారి పేరున కలదు. **హద్దులు : ఉత్తరం :** కొనుగోలుదారునికి చెందిన ఆస్తి, **దక్షిణం :** ఈ ఆస్తి యొక్క తూర్పు నుండి పడమర వైపు గల పంట బోదె, **తూర్పు :** పంట కాలవ, డొంక, **పడమర :** కొనుగోలుదారునికి చెందిన ఆస్తి కొంతమేర మరియు రావులపల్లి సత్యనారాయణ కుమార్తెలకు మరియు ఇతరులకు చెందిన ఆస్తి కొంతమేర.

రిజర్వు ధర: రూ.94,00,000/- | ధరావత్తు: రూ.9,40,000/-
ధరావత్తు చివరి తేది : 18.04.2024 | బిడ్ పెంపుదల: రూ.50,000/-
ఇ-వేలం తేది : 19.04.2024 | వేలం సమయం : మ॥ 12.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసినంతవరకు ఎన్‌కంబరెన్స్ : లేవు | ఆస్తి ఐడి : SBIN400020984553

ఏవేని తెలిసిన ఎన్‌కంబరెన్స్‌తో గల స్థిరాస్తి సంక్షిప్త వివరములు

ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, దాచేపల్లి, సర్వే నెం./డి.నెం.677/3 లోని ఎ.2.44 సెంట్లు లేదా 11809.60 చ॥గ॥లు లేదా 9874.36 చ॥మీ॥ల విస్తీర్ణం గల ఇండస్ట్రియల్ భూమి మరియు భవనం యావత్తు ఆస్తి గురజాల ఎస్ఆర్ఓ వద్ద, తేది.22/09/2017న రిజిష్టరు కాబడిన రిజిష్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.5040/2017 ప్రకారం మెస్సర్స్ వాసుదేవ మిల్క్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ : శ్రీ కొమ్మరాజు సతీష్ మరియు డైరెక్టర్ : కొమ్మరాజు శ్రావణి, వారి పేరున కలదు. **హద్దులు : ఉత్తరం :** దాచేపల్లి నుండి తంగెడ పోవు రోడ్డు, **దక్షిణం :** మామిడి వెంకటేశ్వర్లు గారి ఆస్తి, **తూర్పు :** తాటిపర్తి సైదమ్మ గారి ఆస్తి, **పడమర :** కల్లం కుమారి గారి ఆస్తి.

రిజర్వు ధర: రూ.1,74,00,000/- | ధరావత్తు: రూ.17,40,000/-
ధరావత్తు చివరి తేది : 18.04.2024 | బిడ్ పెంపుదల: రూ.50,000/-
ఇ-వేలం తేది : 19.04.2024 | వేలం సమయం : మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసినంతవరకు ఎన్‌కంబరెన్స్ : లేవు | ఆస్తి ఐడి : SBIN400018719195

కాబోయే బిడ్డర్లు అందరూ వీటిని అభ్యర్థించారు : ఎ) తమను తాము నమోదు చేసుకోవడం కోసం https://ibapi.in-> బిడ్డర్స్ రిజిస్ట్రేషన్ ద్వారా లేదా బ్రౌజర్‌లో URL: https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp టైప్ చేయడం ద్వారా వేలం తేదీ కంటే ముందే పైన పేర్కొన్న ఆస్తి యొక్క ఇ-వేలంలో పాల్గొనవచ్చును. బి) నిర్వహించాల్సిన వేలం ప్రక్రియను తెలుకోవడానికి "Buyer Guide for Login & Registration" విభాగంలో అందించిన వీడియోలను డౌన్‌లోడ్ చేయమని భావి కొనుగోలుదారుని సూచించండి. సి) విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి వెబ్‌సైట్ URL: https://ibapi.in->ని చూడవలెను. వేలం తేదీని అన్నింటినీ, అందించడం ద్వారా ఆస్తిని శోధించండి, SBI Bank గా బ్యాంక్‌ని ఎంచుకోండి, నిబంధనలు మరియు షరతులను అంగీకరించి శోధించండి. **తదుపరి వివరముల కొరకు సంబంధిత అధికారులను పనివేళలలో ముందస్తు అనుమతి తీసుకుని తేది.18.04.2024, సా॥5.00 గం.ల లోపు సంప్రదించవలెను. 1) శ్రీ గంజి ప్రసాద్, అధీకృత అధికారి మరియు చీఫ్ మేనేజర్ : మొబైల్ నెం.: 9866986725. 2) శ్రీ ధనుంజయ్ పాండా, మేనేజర్ : మొబైల్ నెం.: 7036159065.**

తేది: 28-03-2024, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంపాదకీయం

నీటి విలువ తెలుసుకో!

భూమికి/ పురుడు పోసింది నీరే కదా/ జలజలలాడే గుండెను గట్టిపరుచుకొని/ కాళ్లకు నేలను తొడిగింది నీరే/ హిమఖండాలైనా/ గట్టిబండలైనా/ అవి ఘనీభవించిన నీటిస్వప్నాలే/ ఆకాశం నుంచి దూకుతూ వచ్చిన నీరు/ అమృతకలశాన్ని వెంట తెచ్చింది' అంటారు డాక్టర్ ఎన్.గోపి తన 'జలగీతం'లో. ఈ ప్రపంచంలో దేనికైనా విశ్రాంతి వుంటుందేమో గానీ, నీటికి వుండదు. ప్రకృతిలో అనుక్షణం మేల్కొని వుండేది నీరు. ప్రతి క్షణం ఎక్కడోకచోట ప్రవహిస్తూనే వుంటుంది. 'నీటి పేరు వింటేనే నిలువునా తడిసిపోతాం/ నీరంటేనే జలజలలాడిపోతాం/ నీటితనంతో ప్రాణులం/ నిత్యజీవన తేజో విరాజితులమౌతాం' అంటారు డాక్టర్ గోపి. వాగులు, వంకలు, చెలమలతో పెదవులు తడుపుకున్నాయి నదులు. నదుల నడకలతో నీటికి కొత్త మార్గాలు సమకూరాయి ధరిత్రిలో. నాగరికత తరుమూలాలను తడివేళ్లతో సేచనం చేసింది నది. నీరు ఒక సంస్కృతి... ఒక చారిత్రక కృతి. సకల జీవ విన్యాసాల ఆవిష్కృతి నీరు. భూమిపై లభ్యమౌతోన్న మొత్తం నీటిలో 97 శాతానికిపైగా సముద్రజలం. కాగా, మరో రెండు శాతానికిపైగా మంచురూపంలో వుంది. మిగిలిన ఒక్క శాతంకన్నా తక్కువగా వున్న మంచినీరే జీవకోటికి పనికొచ్చేది. ఇప్పుడా మంచినీటికి పెద్ద ముప్పు ఏర్పడింది. అధిక జనాభా, పర్యావరణం వంటివి ఒక కారణమైతే, రెండోది కాలుష్యం. దీంతో మంచినీటికి గడ్డుకాలం ఏర్పడింది. ఈ పరిస్థితిని ఉపయోగించుకొని కార్పొరేట్లు నీటిని ఓ సరుకుగా మార్చేస్తున్నాయి.

మరికొన్నేళ్లలో చమురు నిల్వలు అంతరించిపోతాయని అనేక నివేదికలు చెబుతున్నాయి. దీంతో ప్రపంచ దేశాలు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారిస్తున్నాయి. చమురుకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవన విద్యుత్తు, అణు ఇంధనం వంటివి కనిపిస్తున్నాయి. కానీ అడుగంటిపోతున్న భూగర్భ జలాలకు ప్రత్యామ్నాయం ఏముంది? యావత్ ప్రాణికోటికి జీవాధారమైన నీటిని సంరక్షించుకోకపోతే మనిషి మనుగడకే ముప్పు. దేశంలో దాదాపు 30 నగరాలు నీటి సమస్య ప్రమాదపుటంచున వున్నాయి. సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పిలిచే బెంగళూరు ఇప్పుడు తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. చివరకు రేషన్ మాదిరిగా నీటిని కొలతలు వేసి పంచాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది భారతదేశానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదు, యావత్ ప్రపంచమే నీటి ఎద్దడిని ఎదుర్కోనే కాలం ఎంతో దూరంలో లేదని, 2050 నాటికి ప్రపంచంలో చాలా భాగం తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కోనుందని వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ జనాభాలో 31 శాతం నీటి కొరత ప్రభావానికి గురికానుంది. గత డెబ్బై ఏళ్లలో ప్రపంచ జనాభా మూడు రెట్లు పెరగగా, నీటి వాడకం ఆరు రెట్లు పెరిగింది. నీతి అయోగ్ నివేదిక ప్రకారం... 2030 నాటికి 40శాతం మంది భారతీయులకు తాగునీరు అందుబాటులో వుండదు. ముఖ్యంగా నీటి వ్యాపారం ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున జరుగుతోంది. బహుళజాతి సంస్థలు ప్రభుత్వాల నుంచి హక్కులు పొంది, నీటి వ్యాపారం ద్వారా వేల కోట్ల రూపాయలు తరలించుకుపోతున్నాయి. తద్వారా సహజ నీటి వనరులపై ప్రజలు తమ హక్కును కోల్పోతున్నారు. 'ఒక్కడే/ నీటికుప్ప మీద కూచొని/ కరువును వినోదిస్తాడు/ కరువును వ్యాపారం చేసే విద్యలో/ ఘనుడు వాడు' అంటారు కవి ఎన్.గోపి. ప్రకృతిసిద్ధమైన తాగునీరు, సాగునీరు ప్రజలందరి హక్కు. రక్షిత మంచినీటిని అందించాల్సిన ప్రభుత్వాలు... భూమిని పీల్చి పిప్పి చేస్తున్న కార్పొరేట్ సంస్థల దోపిడీకి అప్పగించాయి. తద్వారా భూగర్భజలాలు అడుగంటిపోయి... మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

'నీరు విలువ తెలుసుకో/ నీరు నిలువ చేసుకో/ నీటితోనే భూతల్లి నిత్యము బాలింత/ ఆ నీరు వృధా చేస్తే బాధలే బతుకంతా...' అంటాడో కవి. మనుషులు పెరిగినట్టు నీళ్లు పెరుగుతాయా? ప్రకృతిని విధ్వంసం చేస్తూ జలవనరులను హరిస్తున్న మనిషి... ఇప్పటికైనా మేలుకోవాలి. నీటిని పొదుపు చేయాల్సిన తక్షణావసరాన్ని ప్రభుత్వాలు సైతం గుర్తించాలి. మానవ దుర్వినియోగం కారణంగా మనుగడ కోల్పోతున్న సరస్సులు, నదులు, సముద్రాలు, జలపాతాలు, వాగులు, వంకలను పరిరక్షించుకోవాలి. నీటికి ఆపన్నహస్తం అందించాలి.

మహనీయుల మాట

'బాలలు పెద్దవారై గొప్ప గొప్ప పనులు చేయాలి. వారు ధైర్యవంతులుగా, సాహస వీరులుగా తయారు కావాలి'. అని మాటలలో వారితో చెప్పడం కన్నా...వారే సాహసవంతమైన చిన్న చిన్న పనులు చేసేటట్లు మనం ఎందుకు నేర్పకూడదు?

- గిజుభాయి,
సుప్రసిద్ధ విద్యావేత్త.

న్యాయం ముసుగులో అన్యాయ లేఖ



మద్రాసు హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్.వైగై మరింత సూటిగానే చెప్పేశారు. ఇవిఎంలు, పౌరసత్వ సవరణ చట్టం...వంటి అతి కీలక అంశాలను అత్యున్నత న్యాయస్థానం విచారిస్తున్న తరుణంలో అసమ్మతి, అణచివేత, మీడియా స్వేచ్ఛ వంటి విషయాలపై ఆందోళన పెరుగుతున్న వేళలో సుప్రీం కోర్టు బాధ్యతలు నిర్వహించకుండా అడ్డుకోవడానికే ఈ లేఖ ఉద్దేశించిందని తేల్చారు. ఢిల్లీ సీనియర్ లాయర్ చందర్ ఉదయ్ సింగ్ చరిత్రను కూడా గుర్తు చేస్తూ... 'న్యాయ వ్యవస్థను టార్గెట్‌గా చేసి లొంగదీసుకోవడానికి ఒత్తిడి చేయడం హిట్లర్ నాజీ పాలన నాటి నుంచి నిరంకుశులకు పరిపాటి' అని 'వైర్' పత్రికతో చెప్పారు. తాను గతంలో దీనిపై రాసిన వ్యాసాన్ని కూడా గుర్తు చేశారు. కనుకనే ఈ అన్యాయ లేఖలో అదృశ్య కోణాలను గుర్తించి ఎదుర్కోవడం తప్పనిసరి. ఎన్నికల వేళ ఇది మరింత అవశ్యకం. ప్రజల తీర్పుపైన, కోర్టుల తీర్పులపైన నమ్మకం లేని వారికి తగిన పాఠం చెప్పాల్సి వుంటుంది.



తెలకపల్లి రవి

ఒక వ్యవస్థను రక్షించే పేరిట దానిపైనే దాడి చేయడం ఒక విచిత్రమైన ఎత్తుగడ, విడ్డూరమైన ప్రయత్నం. న్యాయాన్ని ధర్మాన్ని రాజ్యాంగాన్ని కాపాడాల్సిన సుప్రీంకోర్టు చుట్టూనే ఈ తతంగమంతా జరగడం, దానిపై సాక్షాత్తూ దేశ ప్రధాని, విశ్వగురు నరేంద్ర మోడీ క్షణాల మీద జోక్యం చేసుకోవడం మామూలు సంగతా? గురువారం నాడు 600 మంది ప్రముఖ న్యాయవాదులు భారత ప్రధాన న్యాయమూర్తి సిజెఐ డి.వై. చంద్రచూడ్‌కు రాసిన లేఖ అలాంటి ఉదాహరణే. ఈ మధ్య తెలుగువారు ఎక్కువగా విన్న పేరు హరీశ్ సాల్వే, అదీశ్ సి. అగర్వాలా, చేతన్ మిట్టల్, పింకీ ఆనంద్, హితేష్ జైన్, స్వరుపమ చతుర్వేది తదితరులు ఈ లేఖపై సంతకాలు చేశారు. న్యాయవ్యవస్థకు ప్రమాదం-రాజకీయ, వృత్తిపరమైన ఒత్తిళ్ల నుంచి న్యాయవ్యవస్థ రక్షణ అని ఆ లేఖకు పేరు పెట్టారు.

ఒక స్వార్థపర బృందం న్యాయవ్యవస్థపై ఒత్తిడి తేవడానికి, కోర్టులను అపఖ్యాతిపాలు చేయడానికి ప్రయత్నిస్తుందని లేఖలో ఆరోపించారు. అర్థరహితమైన తర్కాలు, కాలం చెల్లిన రాజకీయ ఎజెండాలతో వారు కోర్టులను ఒత్తిడి చేస్తున్నారని లేఖ విమర్శించింది. "రాజకీయ కేసుల్లో వారి ఒత్తిడి, ఎత్తుగడలు అత్యంత స్పష్టంగా కనిపిస్తాయి. మరీ ముఖ్యంగా కీలకమైన నాయకులకు సంబంధించిన అవినీతి కేసులలో ఇది జరుగుతుంది. ఈ ఎత్తుగడలు మన కోర్టులను దెబ్బ తీస్తున్నాయి. ప్రజాస్వామ్య చట్రానికి ముప్పు తెస్తున్నాయి. న్యాయవ్యవస్థ పని చేయడానికి కీలకమైన విశ్వాసం సుహృద్భావంతో కూడిన వాతావరణం వారి కుప్పిగంతుల వల్ల కలుషితమైపోతున్నది. ఉద్దేశపూర్వకమైన ఈ వర్గాలు వివిధ రూపాల్లో పనిచేస్తాయి. లేనిపోని కథనాలు సృష్టిస్తాయి. కోర్టులు గతంలో చాలా మెరుగ్గా వుండేవంటూ ఇప్పటి పరిస్థితిని పోల్చి చూపిస్తుంటాయి. ఇవి కావాలని చేసే ప్రకటనలు మాత్రమే. కొన్ని రాజకీయ ప్రయోజనాల కోసమే ఇవన్నీ ముందుకు తెస్తాయి. కోర్టుల నిర్ణయాలను ప్రభావితం చేయడానికి, కోర్టులను ఇబ్బందిలో పెట్టడానికి ప్రయత్నిస్తాయి. కొంతమంది న్యాయవాదులు ఉదయంపూట ఒక రాజకీయ నేతను సమర్థిస్తూ వాదించి రాత్రి పూట మీడియా ద్వారా ఆ న్యాయమూర్తిని ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తారు. గతంలో కోర్టులు ఇలాంటి ప్రభావాలకు సులభంగా లోబడేవన్న అభిప్రాయం ఏర్పరచడం ప్రజల విశ్వాసానికి భంగం కలిగిస్తుంది...". ఇలా ఆ లేఖలో అనేక ఆరోపణలు గుప్పించారు.

ఇవన్నీ నిజం కాదా?

ఇంతటితో ఆగకుండా 'బెంచి ఫిక్సింగ్' (అనుకున్న ధర్మాసనానికి కేసు వచ్చేలా చేయడం) అనే సిద్ధాంతాన్ని కూడా ముందుకు తెస్తున్నారని ఆ లేఖ తిట్టిపోసింది. ఇది అగౌరవపరిచేదే గాక కోర్టు ధిక్కారం కూడా. కొన్ని సార్లు ఇది దుష్ప్రచారాలకు, సంబంధిత జడ్జిలపై పరోక్ష ఆరోపణలకు కూడా దారితీస్తుంటుంది. వారు మరీ దిగజారి మన కోర్టులను చట్టబద్ధ పాలన లేని దేశాలతో పోల్చడానికి కూడా తెగబడుతున్నారు. ఇవి కేవలం విమర్శలే కాదు, కోర్టులపై ప్రత్యక్ష దాడులే అంటూ ఆ లేఖ రాసిన వారు తీవ్రంగా వ్యాఖ్యానించారు. మా మాటే చెల్లాలి. లేదంటే రోడ్డుకెక్కుతాం అనే ఈ పద్ధతి అనర్థదాయకమని హెచ్చరించారు. రాజకీయవేత్తలు తాము అవినీతిపరులని ఆరోపించినవారి తరఫునే కోర్టులో వాదించడం మరో విపరీతం. కోర్టుల్లోనూ బయటా కూడా తప్పు సమాచారం వ్యాప్తి చేస్తారు. లోపాయికారీ ఎత్తుగడలకు పాల్పడతారు. అది కూడా కీలకమైన ఎన్నికల సమయంలో ఇలాంటి పనులు చేయడం మరింత సందేహాస్పదమైంది. 2018-19 ఎన్నికల సమయంలోనే ఈ విధమైన ఎత్తుగడలకు పాల్పడ్డం చూశామంటూ ఇప్పుడు జరుగుతున్నదీ అదేననే భావన కలిగించేందుకు ఆ లేఖ ప్రయత్నించింది. ఇలాంటి వారిని మౌనంగా సహించే సమయం కాదనీ, ప్రధాన న్యాయమూర్తి నాయకత్వంలో సరైన నిర్దేశం కోసం, నిర్ణయాత్మక నాయకత్వం కోసం తాము ఎదురు చూస్తున్నామనీ ఆ లేఖ ముగింపులో రాశారు.

మోడీ అర్జెంటు మద్దతు రహస్యం?

ఆ లేఖపై ఇంకా ఎవరూ పెద్దగా స్పందించక ముందే స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ రంగంలోకి దిగారు. అన్ని వ్యవస్థలనూ దెబ్బకొట్టి లొంగదీసుకోవడం కాంగ్రెస్‌కు అలవాటని మోడీ 'ఎక్స్' (ట్విటర్)లో రాశారు. అంటే ఒక విధంగా న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా పని చేస్తున్న వర్గం ప్రతిపక్షం అండతో పనిచేస్తుందని ఆరోపించారన్న మాట. లోబడి వుండే న్యాయవ్యవస్థను కాంగ్రెస్ కోరుకుంటుంది అంటూ ఎమర్జన్సీ నాటి నినాదాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అందుకే 140 కోట్ల భారతీయులు వారిని తిరస్కరిస్తున్నారని ఎన్నికల భాషలో మాట్లాడారు. దీనిపై కాంగ్రెస్ కూడా వెంటనే స్పందించింది. ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో రాస్తూ ప్రజాస్వామ్యాన్ని తారుమారు చేయడంలోనూ రాజ్యాంగాన్ని దెబ్బ తీయడంలోనూ మోడీ ప్రత్యేక ప్రజ్ఞ సాధించారని ఎగతాళి చేశారు. న్యాయవ్యవస్థకు ముప్పు తెచ్చే అనేక చర్యలు మోడీనే తీసుకున్నారని ఉదాహరణలతో సహా ప్రస్తావించారు. 2018లో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నలుగురు సీనియర్ న్యాయమూర్తులు న్యాయవ్యవస్థ పరిణామాలపై ఆందోళన వెలిబుచ్చడం, ప్రజాస్వామ్యం నాశనమవుతుందని హెచ్చరించడం గుర్తు చేశారు. వారిలో ఒకరిని (రంజన్ గొగోయ్) రాజ్యసభకు పంపడం న్యాయవ్యవస్థను లోబడి వుండేలా చేసుకోవడం కోసం కాదా అని ఖర్గే ప్రశ్నించారు. ఒక హైకోర్టు న్యాయమూర్తిని (బెంగాల్‌లో) మీ పార్టీ అభ్యర్థిగా నిలబెట్టడం దేనికి సూచన అని నిలదీశారు. న్యాయాధికారుల నియామక కమిషన్ బిల్లును లోపభూయిష్టంగా తీసుకొచ్చి సుప్రీంకోర్టు కొట్టివేసే పరిస్థితి తెచ్చింది మీరే కదా అనీ ఆక్షేపించారు. నిజానికి ఈ లేఖలో రహస్యమే అది.

మింగుడు పడని తీర్పులు, నిరసనలు

పైకి చూస్తే న్యాయవ్యవస్థను సమర్థిస్తున్నట్టు, సంరక్షించడానికే ఉద్దేశించినట్టు రాసిన ఈ లేఖ వాస్తవానికి సిజెఐతో సహా మొత్తం వ్యవస్థను బెదిరించడానికే రాసింది. ఎన్నికల బాండ్లతో సహా కొన్ని కేసుల్లో వచ్చిన సంచలన తీర్పులు ఈ వర్గానికి కంటగింపుగా మారాయి. సాక్షాత్తూ హోంమంత్రి అమిత్ షా తీర్పును గౌరవిస్తున్నా నంటూనే వాటిని రాజ్యాంగ విరుద్ధమనడాన్ని తప్పు పట్టారు. దీనికి బదులు ఏదో ఒక మధ్యే మార్గం చూపించి వుండాల్సిందన్నారు. ప్రయోగాత్మకంగా చేసినప్పుడు పొరబాట్లు వుండొచ్చని అంతమాత్రాన మొత్తం తప్పంటే సమస్య అని ఆరెస్సెస్ మార్గదర్శక మండలి వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్ల బండారం ఒకవైపున బహిర్గతమవుతుంటే బిజెపి నేతలు, గురువులు ఇలా మాట్లాడారంటే ఈ తీర్పు వారికి ఎంత ఇబ్బందిగా మారిందో తెలుస్తుంది. రాష్ట్రాల హక్కులకే కేరళ, తమిళనాడు వేసిన కేసులలో కూడా సుప్రీం కోర్టు గట్టి తీర్పులే ఇచ్చింది. తమిళనాడు గవర్నర్‌కు ఆదేశాలిచ్చి మరీ ఆయన నిరాకరించిన మంత్రితో ప్రమాణ స్వీకారం చేయించింది. పేద రాష్ట్రమైన కేరళ ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు ఏ పద్ధతిలో సహకరిస్తారని ప్రశ్నించింది. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసైకీ, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌కూ కూడా రాజ్యాంగపరమైన సహకారం అందించనందుకు చివాట్లు పెట్టింది. ఇప్పటికీ కొన్ని కీలక బిల్లులపై సంతకాలు పెట్టకుండా సతాయిస్తున్న గవర్నర్‌ను, తనను నియమించే రాష్ట్రపతిని దారికి తేవాలని కేరళ వేసిన తాజా కేసు ఇప్పుడు నడుస్తున్నది. అంతేగాక ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టుతో సహా అనేక ప్రతిపక్ష ప్రభుత్వాలు, నేతల కేసులు ముందుకు రానున్నాయి. మీడియా ప్రముఖులపైన, మానవ హక్కుల కార్యకర్తలపైన ఆంక్షలు నిర్బంధాలను ప్రశ్నించే పిటిషన్లు సాగుతున్నాయి. ఇదివరకే చెప్పుకున్నట్టు ఎన్నికల కమిషనర్ల నియామకం ఆదరాబాదరాగా చేసేస్తే దాన్ని కొట్టివేయకపోయినా ఈ తొందరపాటు ఎందుకని కూడా సుప్రీంకోర్టు అసంతృప్తి వెలిబుచ్చింది. మీడియా సంస్థలపై ఆరోపణల్లో ముందస్తు చర్యలు తీసుకోవద్దని తాజాగా తీర్పు వెలువడింది. ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబాను విడుదల చేయడమే గాక ప్రబీర్ పుర్కాయస్థ వంటి వారి పిటిషన్లు కూడా పరిశీలించేందుకు వివిధ స్థాయిల్లో కోర్టులు సిద్ధమవుతున్నాయి. దిగువ కోర్టులు బెయిలు ఇవ్వడానికి భయపడనవసరం లేదని స్వయంగా సిజెఐ చంద్రచూడ్ స్పష్టతనిచ్చారు. సుప్రీంకోర్టులో కొంతమంది అడ్వకేట్లు కేకలు వేసినప్పుడు మందలించడమేగాక గట్టిగా చివాట్లు పెట్టారు. కేజ్రీవాల్ అరెస్టు తర్వాత ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి నిరాకరిస్తే రాజ్యాంగం 163, 164 ప్రకారం ఆ అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు తీర్పునివ్వడం సంచలనం కలిగించింది. అమెరికా, జర్మనీ మాత్రమే గాక ఐక్యరాజ్యసమితి కూడా రంగంలోకి దిగి భారత న్యాయవ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందని ఆశిస్తున్నట్టు వ్యాఖ్యానించాయి. బయటి దేశాల జోక్యం అనే మాట అటుంచితే సరిగ్గా ఈ పరిణామమే కార్పొరేట్ కాషాయ పాలక కూటమికి కంపరం కలిగించింది. తత్పర్యవసానమే ఈ లేఖ.

సుప్రీంను అడ్డుకోవడానికేనా?

ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలపై కేసులు, అరెస్టులు, ఇ.డి ప్రయోగాలు పాలక బిజెపికే మేలు చేస్తాయి. సమానతా సూత్రాన్ని దెబ్బతీస్తాయి. దేశ దేశాల్లో నిరంకుశ పాలకులు అనుసరించే ఒక ముఖ్యమైన ఎత్తుగడ అది. ఈ సమయంలో సుప్రీం కోర్టు గట్టిగా నిలబడటం చాలా కీలకమవుతుంది. సుప్రీంకోర్టుతో సహా న్యాయవ్యవస్థ అనేక కేసుల్లో రాజ్యాంగపరమైన విమర్శలు ఎదుర్కొందిగానీ ఒక మేరకు కేంద్రానికి మింగుడు పడని నిర్ణయాలు, ఆదేశాలు ఈ కాలంలో వెలువడిన మాట నిజం. ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణ కోరే న్యాయ నిపుణులు, న్యాయవాదులు, మాజీ న్యాయమూర్తులు, మాజీ ఉన్నతాధికారులు కూడా తరచూ ఆ మేరకు పిలుపులిస్తున్నారు. అలాంటి ప్రయత్నాలను దొంగదోవలో అడ్డుకోవడానికి వారికి ఉద్దేశాలు ఆపాదించడానికి ఆరువందల మంది మూకుమ్మడి లేఖ. మాజీ సుప్రీం న్యాయమూర్తి మదన్ బి లోకుర్ ఈ లేఖపై స్పందిస్తూ గౌరవనీయులైన ప్రధాన న్యాయమూర్తిపై ప్రత్యక్ష దాడిగా ఈ లేఖను అభివర్ణించారు. వివిధ సందర్భాలలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలను, సహేతుక వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకోబట్టే ఇది రాసివుండవచ్చని పేర్కొన్నారు. పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అంజనా ప్రకాశ్ స్పందిస్తూ ఈ లేఖలో ఉపయోగించిన పరిభాష సుప్రీంకోర్టు గౌరవానికి గానీ, లేఖ రాసిన వారి విజ్ఞతకు గాని పొసగదని స్పష్టం చేశారు. రాజ్యాంగ విలువల ప్రకారమే కోర్టులు తీర్పులు ఇస్తాయి తప్ప ఇతర ఒత్తిళ్లకు లొంగి కాదని పేర్కొన్నారు. అందుకు కట్టుబడి పనిచేసే న్యాయవాదుల నిజాయితీని ప్రశ్నించడం సరికాదని కూడా వ్యాఖ్యానించారు. మద్రాసు హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్.వైగై మరింత సూటిగానే చెప్పేశారు. ఇవిఎంలు, పౌరసత్వ సవరణ చట్టం...వంటి అతి కీలక అంశాలను అత్యున్నత న్యాయస్థానం విచారిస్తున్న తరుణంలో అసమ్మతి, అణచివేత, మీడియా స్వేచ్ఛ వంటి విషయాలపై ఆందోళన పెరుగుతున్న వేళలో సుప్రీం కోర్టు బాధ్యతలు నిర్వహించకుండా అడ్డుకోవడానికే ఈ లేఖ ఉద్దేశించిందని తేల్చారు. ఢిల్లీ సీనియర్ లాయర్ చందర్ ఉదయ్ సింగ్ చరిత్రను కూడా గుర్తు చేస్తూ...'న్యాయవ్యవస్థను టార్గెట్‌గా చేసి లొంగదీసుకోవడానికి ఒత్తిడి చేయడం హిట్లర్ నాజీ పాలన నాటి నుంచి నిరంకుశులకు పరిపాటి' అని 'వైర్' పత్రికతో చెప్పారు. తాను గతంలో దీనిపై రాసిన వ్యాసాన్ని కూడా గుర్తు చేశారు. కనుకనే ఈ అన్యాయ లేఖలో అదృశ్య కోణాలను గుర్తించి ఎదుర్కోవడం తప్పనిసరి. ఎన్నికల వేళ ఇది మరింత అవశ్యకం. ప్రజల తీర్పుపైన, కోర్టుల తీర్పులపైన నమ్మకం లేని వారికి తగిన పాఠం చెప్పాల్సి వుంటుంది. ★

సమీక్ష

ప్రతి కార్యకర్త చదవాల్సిన పుస్తకం



గేట్ల దగ్గర గుమిగూడితే సీసీ కెమేరాల్లో వెతికి వేటాడి యాజమాన్యాలు వేధిస్తున్నాయి. ఉద్యోగం నుండి తొలగిస్తున్నాయి. కానీ పోలీసులకు చిక్కకుండా ఎమర్జెన్సీ కాలమంతా పనిచేయడం 'వీరోచితం'గా అనిపించిందని బృందా తన జ్ఞాపకాల్లో రాసుకున్నారు. నివాస ప్రాంతాల్లో ఎలా పని చేయాలో చక్కని అనుభవాలు ఈ పుస్తకంలో మనకు బృందా అందించారు. జహింగీర్‌పురి ప్రాంతంలో నాడు నివాస ప్రాంతంలో పనిచేసిన అనుభవం నేటికీ ఉపకరించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నా జహింగీర్‌పురి లోని పేద ముస్లింల నివాసాలను బుల్డోజర్లతో కేంద్ర బి.జె.పి ప్రభుత్వం అక్రమంగా కూల్చడానికి 2022 ఏప్రిల్‌లో సిద్ధపడింది. బృందా సుప్రీంకోర్టు ఆర్డరు చేతిలో పట్టుకుని స్థానికుల సహాయంతో బుల్డోజర్లను అడ్డుకున్నారు. ఇది దేశమంతా వైరల్ అయ్యింది. నివాస ప్రాంతాల్లో పనికి ఎంతో ప్రాధాన్యత వుందని ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు గుర్తించినా వారితో ఎలా కలసి మెలసి ఉండాలో తెలుసుకోవడానికి ఆమె అనుభవాలు మనకు ఎంతగానో తోడ్పడతాయి.



సిహెచ్. నరసింగరావు

'రీటా' ఎమర్జెన్సీలో బృందాకరత్ మారు పేరు. వామపక్ష పార్టీల్లో పనిచేసే వారికి బృందాకరత్ గురించి తెలియని వారుండరు. బృందాకరత్ కమ్యూనిస్టు జీవితం ఎంతో విలక్షణం. ఉన్నత కుటుంబం నుంచి వచ్చి, ఉన్నత విద్య అభ్యసించారు. ఎయిర్ ఇండియాలో ఉద్యోగం చేశారు. ఎయిర్ ఇండియాలో పని చేసే మహిళలు స్కర్ట్, షర్టులు మాత్రమే వేసుకోవాలనే నిబంధనపై పోరాడి చీర కట్టుకోవడానికి ఇష్టమైన వారందరికీ అనుమతించాలనే హక్కు సాధించారు. వియత్నాంపై అమెరికా యుద్ధానికి వ్యతిరేకంగా ప్రత్యక్షంగా పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నారు. మార్క్సిస్టుగా మారడానికి వియత్నాం యుద్ధమే ప్రేరణ అని రాశారు. బ్రిటన్‌లో ఉన్న కాలంలో మార్క్సిస్టు సాహిత్యం చదవడం మొదలుపెట్టారు. బ్రిటన్‌లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థుల మధ్య వివిధ సిద్ధాంతాలపై చర్చలు సాగాయి. తర్వాత భారతదేశానికి వచ్చి వ్యవసాయ కార్మిక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సునీత్ చోప్రాతో సహా అనేక మంది భారతీయులు ఆ గ్రూపులో ఉన్నారు. అదే కాలంలో ఆమె స్వరాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏకపక్ష నిర్బంధం, వామపక్ష ఉద్యమాల ఉధృతి లాంటి పరిణామాలను ఇంగ్లీషు పత్రిక ద్వారా తెలుసుకునేవారు.

ఉద్యోగం వదిలి లండన్ నుంచి వచ్చి కఠోరమైన ఎమర్జెన్సీ కాలంలో ఢిల్లీలో ట్రేడ్ యూనియన్ బాధ్యతలు చేపట్టారు. అదే నిబద్ధతతో నేటికీ పని చేస్తున్నారు. ఆమె యూనివర్సిటీ మేధావుల మధ్య ఎంత స్పష్టంగా మాట్లాడగలరో అత్యంత వెనుకబడిన గిరిజన ప్రజల్లో కూడా అంతే స్పష్టంగా మాట్లాడగల మాస్ లీడర్. నేను స్వయంగా ఆమె మాట్లాడిన అనేక గిరిజన సభల్లో పాల్గొని ఆమె ఉపన్యాసాన్ని ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువాదం చేశాను. ఆమె ఎమర్జెన్సీలో రహస్యంగా ఢిల్లీలోని కార్మిక రంగంలో పనిచేశారు. 'రీటా నేర్పిన పాఠం' (యాన్ ఎడ్యుకేషన్ ఫర్ రీటా-ఎ మెమైర్ 1975-1985) పేరుతో ఆమె రాసిన ఎమర్జెన్సీలో జ్ఞాపకాలు ప్రతి ట్రేడ్ యూనియన్ కార్యకర్త చదవడం ఎంతో అవసరం. ఆ కాలపు అనుభవాలు నేటి తరం ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు ఎదుర్కొనే అనేక సమస్యలకు ఆచరణలో పరిష్కారం చూపుతున్నాయి. గత 40 సంవత్సరాల నుండి బృందాతో సన్నిహిత సంబంధాలున్న నాకే ఈ పుస్తకం చదివే వరకు...ఆమెకు ట్రేడ్ యూనియన్‌లో ఇటువంటి మంచి అనుభవాలు ఉన్నాయని తెలియదు. ఈ పుస్తకం ద్వారా ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు, నాయకులు నైపుణ్యంతో ఎలా పనిచేయాలో నేర్చుకోవచ్చు.

ఎమర్జెన్సీ రహస్య కాలంలో బృందా స్వయంగా ఎలా పనిచేశారో వివరించారు. నేడు ఎమర్జెన్సీ లేదు. కానీ టి.యు పనిలో అంతకంటే అధ్వాన్న పరిస్థితులున్నాయి. అడుగడుగునా ఆటంకాలు ఎదుర్కొంటున్నాము. ప్రభుత్వం, యాజమాన్యాలు ఒక్కటై కార్మికవర్గం మీద ముప్పేట దాడి సాగిస్తున్నాయి. ముఖ్యంగా బి.జె.పి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి మతోన్మాదాన్ని జోడించి కార్మికవర్గంలో తీవ్రంగా చీలికలు తీసుకొస్తున్నాయి. ఎమర్జెన్సీకి ముందు కంపెనీల గేట్లు ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉండేవి. గేట్ మీటింగ్‌లు, కరపత్రాలు పంచడం, ధర్నాలు చేయడం, నోటీసులు అంటించడం, పోస్టర్లు వేయడం అన్నింటికి కేంద్రాలు కంపెనీల గేట్లే. ఎమర్జెన్సీలో అన్నీ బంద్ అయ్యాయి. ఎమర్జెన్సీ తర్వాత కార్మిక పోరాటాలు మరింత ఉధృత స్థాయిలోకి వెళ్లాయి. కానీ 1991 సరళీకరణ విధానాల ఫలితంగా నేడు పరిస్థితి పూర్తిగా తారుమారయ్యింది. గేట్ల దగ్గర గుమిగూడితే సీసీ కెమేరాల్లో వెతికి వేటాడి యాజమాన్యాలు వేధిస్తున్నాయి. ఉద్యోగం నుండి తొలగిస్తున్నాయి. కానీ పోలీసులకు చిక్కకుండా ఎమర్జెన్సీ కాలమంతా పనిచేయడం 'వీరోచితం'గా అనిపించిందని బృందా తన జ్ఞాపకాల్లో రాసుకున్నారు. నివాస ప్రాంతాల్లో ఎలా పని చేయాలో చక్కని అనుభవాలు ఈ పుస్తకంలో మనకు బృందా అందించారు. జహింగీర్‌పురి ప్రాంతంలో నాడు నివాస ప్రాంతంలో పనిచేసిన అనుభవం నేటికీ ఉపకరించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నా జహింగీర్‌పురి లోని పేద ముస్లింల నివాసాలను బుల్డోజర్లతో కేంద్ర బి.జె.పి ప్రభుత్వం అక్రమంగా కూల్చడానికి 2022 ఏప్రిల్‌లో సిద్ధపడింది. బృందా సుప్రీంకోర్టు ఆర్డరు చేతిలో పట్టుకుని స్థానికుల సహాయంతో బుల్డోజర్లను అడ్డుకున్నారు. ఇది దేశమంతా వైరల్ అయ్యింది. నివాస ప్రాంతాల్లో పనికి ఎంతో ప్రాధాన్యత వుందని ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు గుర్తించినా వారితో ఎలా కలసి మెలసి ఉండాలో తెలుసుకోవడానికి ఆమె అనుభవాలు మనకు ఎంతగానో తోడ్పడతాయి.

కార్మిక నాయకులు పోరాటాలు, సమ్మెల్లో ఎలా కృషి చేయాలనేది 'బిర్లా మిల్స్'లో సమ్మె అనుభవాలు ప్రతి కార్మిక నాయకుడికి బాగా ఉపయోగపడతాయి. కార్మికులను ఐక్యపర్చగలిగితే నిర్బంధంలో కూడా కార్మికుల నోళ్లు మూయించలేరని, సమ్మెలు ఆపలేరనే అనుభవాలు తెలియజేశారు. ఎమర్జెన్సీని అడ్డుపెట్టుకుని బిర్లా యాజమాన్యం కార్మికులపై పనిభారం రెట్టింపు చేసింది. 'బిర్లా మిల్స్' టెక్స్‌టైల్స్ పరిశ్రమ. ఈ మిల్లులోని వీవింగ్ సెక్షన్‌లో రెండు మగ్గాలకు బదులు నాలుగు మగ్గాలపై ప్రతి కార్మికుడు పని చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇది అమలు జరిగితే ఆ విభాగంలో సగం మందికి పనిపోతుంది. దీన్ని ఎలా ఎదుర్కోవాలనే సమస్య వచ్చినప్పుడు కార్మికుల చర్చలను ప్రత్యక్షం గా, ఓపిగ్గా విన్న అనుభవాలను బృందా చక్కగా ఉదహరించారు. యాజమాన్యం పోలీసులను ఆశ్రయించి బలప్రయోగం చేస్తే సమ్మె చేయగలమా? దీర్ఘకాలం సమ్మె చేయాల్సివస్తే సాధ్యమవుతుందా? వీవింగ్ సెక్షన్ కార్మికుల సమస్యకు మిగిలిన కార్మికుల మద్దతు ఉంటుందా? లాంటి అనేక చర్చల అనంతరం తప్పక సమ్మెలోకి వెళ్లాలని సిఐటియు కార్యకర్తలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. బృందా ఆ రోజు రాత్రి రమేష్ అనే కార్మిక నాయకుని చిన్న ఇంట్లోనే బస చేశారు. ఎమర్జెన్సీ అయినందు వల్ల సమ్మె కరపత్రాన్ని ఏ ప్రెస్ యాజమాన్యం అచ్చువే యలేదు. 'సైక్లోస్టైల్' ద్వారా వేయించి రహస్యంగా దారిలో వెదజల్లారు. ఆ కరపత్రాలను కార్మికులు రహస్యంగా జేబులో పెట్టుకుని తర్వాత చదువుకున్నారు. మరుసటి రోజు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెను చూసి ఎంతో ఉత్తేజం పొందానని బృందా వివరించారు. రహస్య కాలంలో కూడా...ఢిల్లీ లోని క్లాత్ మిల్స్‌లో తొలగించబడిన కమల్ నారాయణ్ ద్వారా...చిన్న బుక్ షాప్ నడిపేవారు. ఈ బుక్‌షాప్‌లో వామపక్ష సాహిత్యం కూడా దొరికేది. సమావేశాలు ఈ బుక్‌షాప్ వెనుకనే జరిగేవి. సమావేశాలు జరిగేటప్పుడు షాప్ షెట్టర్ వేసుకుని మీటింగ్‌లు నడిపేవారు. నేడు యాజమాన్యాల ఒత్తిడిని ఎదుర్కోవడానికి ఇటువంటి మార్గాలు అనుసరించడం ఎంతో అవసరం. కమ్యూనిస్టు కుటుంబాల పేరుతో రాసిన అధ్యాయంలో మన కుటుంబాల్లో ఉండే ఆప్యాయతలు, త్యాగనిరతి మరే పార్టీల్లోగాని, సంఘాల్లో గాని సాధ్యం కాదనే విషయాన్ని స్పష్టం చేశారు.

ఈ సమ్మెను విరమించేటప్పుడు పి.రామమూర్తి స్వయంగా హాజరై ఉపన్యసించారు. పి.రామమూర్తి సిఐటియు అఖిల భారత ప్రథమ ప్రధాన కార్యదర్శి. వారి గురించి పుస్తకంలో పది పంక్తులు రాశారు. అలాగే బృందా, ప్రకాష్ కరత్‌ల వివాహమైన కొద్ది కాలానికే కరత్ తల్లి చనిపోయారు. వారిని పరామర్శించడానికి ఉదయాన్నే ఇంటికి వచ్చిన పుచ్చలపల్లి సుందరయ్య (పి.ఎస్) గురించి కూడా ఈ పుస్తకంలో వివరించారు. పి.ఎస్ మరో సందర్భంలో బృందాను పిలిచి ట్రేడ్ యూనియన్ రంగంలో పార్టీని నిర్మించడం తన ప్రథమ కర్తవ్యంగా ఉండాలని వివరించారని రాశారు. ఆమెతో ఆ కాలంలో పరిచయమైన మేజర్ జయపాల్ సింగ్ గురించి అద్భుతంగా వర్ణించారు. ఆయన జైలు నుండి తప్పించుకుని వచ్చి ప్రజా ఉద్యమంలో పనిచేశారు. ఆయనే దొరికి ఉంటే బ్రిటీష్ వాళ్లు కాల్చేసేవారు. కానీ ఆయన ప్రాణాలకు తెగించి దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి అవసరమైన చోట్లకు వెళ్లి సైనిక శిక్షణ ఇచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా ఆయన సైనిక శిక్షణ కీలకమైంది. ఇలా బి.టి.రణదివే, విమలా రణదివె, జ్యోతిబసు లాంటి అనేక మంది నాయకుల గురించి సందర్భాన్ని బట్టి వివరించడం ఈ పుస్తకంలో ఒక ప్రత్యేకత.

కార్మికులు పోరాటాల్లో ఎదుర్కొనే వాదనలకు ఈ పుస్తకంలో సరైన సమాధానాలున్నాయి. 'కార్మికుల సమస్యలను రాజకీయం చేయకండి' అనే మాట తరచూ యజమానులు, ప్రభుత్వాలు అంటుంటాయి. ఇంతకన్నా దొంగమాట మరోటి వుండదు. 'ప్రభుత్వం పెట్టుబడిదారుల పక్షాన నిలబడటం రాజకీయం కాక మరేమిటి?' అని బృందా సమాధానం చెప్పారు. బి.యం.ఎస్. ప్రతి సమ్మె సందర్భంగా ఇటువంటి తప్పుడు ప్రచారమే చేస్తుంటారు. కార్మిక నాయకులు కార్మికులను రెచ్చగొట్టి సమ్మెలను చేయిస్తున్నారన్నది యజమానుల మరో ప్రచారం. ఇది పూర్తి అవాస్తవం. సమ్మె అనేది కార్మికుల చివరి ఆయుధం. కావాలని కార్మికులు ఎప్పుడూ సమ్మె చేయరు. కష్టాలకు ఓర్చి పోరాటాలు చేసి విజయాలు సాధించాలని, హక్కులు సాధించాలని కార్మికులు సమ్మెలు చేస్తారు. దీర్ఘకాలం సమ్మెలు సాగినప్పుడు గత్యంతరం లేని పరిస్థితుల్లో కార్మికులు వారి భార్య, పిల్లలను స్వగ్రామాలకు పంపేవారు. 'బిర్లా మిల్స్' సమ్మె సందర్భంలో తన భార్య పొత్తిళ్లలో ఒక బిడ్డను, పక్కన మరో బిడ్డను పెట్టుకుని కదులుతున్న బస్సు లోంచి కన్నీళ్లతో వీడ్కోలు చెప్పడాన్ని నేను ఎన్నటికీ మర్చిపోలేను అని అక్కడి కార్మిక నాయకుడు పంత్ చెప్పిన విషయం బృందా పుస్తకంలో చదువుతుంటే కళ్లు చెమ్మగిల్లుతాయి. యాజమాన్యం చేసే అనేక తప్పుడు వాదనలకు సమాధానాలు ఈ పుస్తకంలో లభిస్తాయి.

మత విద్వేషం అంటువ్యాధిలాగా నేడు వ్యాపిస్తున్నది. మత ఘర్షణల ప్రమాదాన్ని ఈ పుస్తకం చివరిలో చక్కగా వివరించారు. కాంగ్రెస్ నాయకత్వంలో జరిగిన సిక్కులపై దాడి, 1984లో అద్వానీ ఆధ్వర్యంలో రథయాత్ర పేరుతో ఆర్.ఎస్.ఎస్ ప్రచారం 1992లో అయోధ్య లోని బాబ్రీ మసీదు కూల్చివేతకు ఎలా దారితీసిందో నేడు ఆ ప్రమాదం మరింత తీవ్ర స్థాయికి వెళ్లిందని ఉదహరించారు. బి.జె.పి మతోన్మాదాన్ని నివాస ప్రాంతాల్లో పని చేయడం ద్వారానే ఎదుర్కోగలం. మతతత్వాన్ని తక్కువగా అంచనా వేయవద్దని హెచ్చరించారు. మన రాష్ట్రంలోని టి.యు కార్యకర్తలు ఈ హెచ్చరికను గమనంలో వుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ పుస్తకంలోని ప్రతి పేజీ సిఐటియు కార్యకర్తలకు, నాయకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని నేను మనస్ఫూర్తిగా భావిస్తున్నాను.

/ రచయిత సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

విప్లవ్ కుమార్ మైత్రా సోనామణి ముర్ము

బెంగాల్‌లో మరో రెండు స్థానాలకు సిపిఎం అభ్యర్థుల ప్రకటన

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల్లో లెఫ్ట్‌ఫ్రంట్ తరపున పోటీ చేయనున్న మరో రెండు స్థానాలకు సిపిఎం అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లోని అధికారిక పేజీలలో సిపిఎం ఒక పోస్టు చేసింది. అరాంబాగ్ (ఎస్‌టి) నియోజకవర్గం నుంచి విప్లవ్ కుమార్ మైత్రా, జార్‌గ్రామ్ (ఎస్‌టి) స్థానం నుంచి సోనామణి ముర్ము (తుడు) పోటీ చేయనున్నట్లు తెలిపింది.

అరుణాచల్‌లో 10 స్థానాల్లో బిజెపికి ఏకగ్రీవం

- 50 స్థానాల్లోనే పోటీ

న్యూఢిల్లీ : అరుణాచల్ ప్రదేశ్‌లోని 60 అసెంబ్లీ స్థానాలకుగాను 10 స్థానాల్లో బిజెపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత సిఎం పెమా ఖండూ ఒక్కరే ముక్తో నుంచి పోటీ చేయడంతో ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ప్రక్రియకు చివరి తేదీ అయిన ఈ నెల 30 వరకూ ఆయా నియోజకవర్గాల్లో ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్లు వేసినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారులు తెలిపారు.

రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా భారతరత్న అవార్డు అందుకుంటున్న పివి నరసింహారావు తనయుడు పివి ప్రభాకర్‌రావు, చౌదరి చరణ్ సింగ్ మనుమడు జైన్ చౌదరి, కర్పూరి ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్ (చిత్రంలో కుడి నుండి ఎడమకు)

భారతరత్న ప్రదానం

- పివి సహా నలుగురి వారసులకు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు, హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్‌సహా నలుగురికి భారత రత్న అవార్డుల ప్రదానం జరిగింది. శనివారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులు అందజేశారు. మొత్తం ఐదుగురికి కేంద్ర ప్రభుత్వం భారత రత్నలు ప్రకటించగా.. బిజెపి సీనియర్ నేత అద్వానీ అనారోగ్యం కారణంగా కార్యక్రమానికి హాజరుకాలేదు. మాజీ ప్రధాని పివి నరసింహారావు తరపున ఆయన కుమారుడు పివి ప్రభాకర్‌రావు భారతరత్న పురస్కారం అందుకున్నారు. అలాగే మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ తరపున ఆయన మనవడు జైన్ చౌదరి, మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ తరపున ఆయన కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్, హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ తరపున ఆయన కుమార్తె డాక్టర్ నిత్య పురస్కారాలు అందుకున్నారు. అద్వానీ నివాసానికి వెళ్లి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా అద్వానీని సన్మానించనున్నారు. నలుగురికి మరణానంతరం ఈ పురస్కారాలు ప్రకటించగా.. వీరిలో ఇద్దరు మాజీ ప్రధానులు పివి నరసింహారావు, చౌదరి చరణ్ సింగ్‌తో పాటు బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ఉన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే తదితరులు హాజరయ్యారు.

కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ నేడు ఢిల్లీలో భారీ బహిరంగసభ

- హాజరుకానున్న 'ఇండియా' వేదిక అగ్రనేతలు రాహుల్, ఖర్గే, ఏచూరి

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మద్దతుగా, ప్రతిపక్ష పార్టీలపై కేంద్రం దాడులకు వ్యతిరేకంగా ఆదివారం భారీ బహిరంగసభ నిర్వహించేందుకు 'ఇండియా' వేదిక సిద్ధమైంది. ఇక్కడి రామ్‌లీలా మైదానంలో నిర్వహించే ఈ సభకు కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్‌పవార్, జార్ఖండ్ సిఎం చంపయీ సోరేన్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యుబిటి) నేత ఉద్ధవ్ థాకరే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్, డిఎంకె నాయకుడు తిరుచ్చి శివ, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా, పిడిపి చీఫ్ మెహబూబా ముఫ్తీ, టిఎంసి నేత డెరెక్ ఓబ్రెయిన్ హాజరవుతారని కాంగ్రెస్ నాయకులు జైరామ్ రమేష్ తెలిపారు.

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకే నేడు ర్యాలీ : కాంగ్రెస్

ఆదివారం 'ఇండియా' వేదిక నిర్వహించనున్న ర్యాలీ ఒక వ్యక్తిని రక్షించడం కోసం కాదని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ తెలిపారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నివాసం ఉన్న లోక్ కల్యాణ్ మార్గ్ వరకూ నిర్వహించనున్న ఈ ర్యాలీ బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం 'సమయం ముగిసింది' అని బలమైన సందేశం ఇస్తుందని తెలిపారు. ఇది వేదికలో సంఘీభావాన్ని, ఐక్యతను తెలియజేస్తుందని చెప్పారు. కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం ద్వారా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడం మరో కీలకమైన అంశమని చెప్పారు. రాజకీయంగా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకునేందుకే ఇద్దరు సిఎంలు, పలువురు మంత్రులను అరెస్టు చేశారని అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీకి మరో రెండు ఆదాయపు పన్ను శాఖ నోటీసులు వచ్చాయని చెప్పారు.

19 నుంచి జూన్ 1 వరకూ ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం

న్యూఢిల్లీ : ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకూ ఎగ్జిట్ పోల్స్‌ను నిషేధిస్తూ భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పోలింగ్ ముగియడానికి నిర్ణయించిన సమయంతో ముగిసే 48 గంటల వ్యవధిలో ఒపీనియన్ పోల్స్, మరేదైనా పోల్ సర్వేతో సహా ఎన్నికలను ప్రభావితం చేసే వాటిని నిషేధిస్తున్నట్లు పేర్కొంది. ఏప్రిల్ 19వ తేదీ ఉదయం 7.00 గంటల నుంచి జూన్ 1వ తేదీ సాయంత్రం 6.30 గంటల మధ్య ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం, ప్రచురించడం లేదా ప్రచారం చేయడంపై నిషేధం విధించింది.

న్యూస్‌క్లిక్, పుర్కాయస్థలపై 8వేల పేజీలతో చార్జిషీట్

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్‌పైన, ఆ సంస్థ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థపైన ఢిల్లీ పోలీసులు శనివారం దాదాపు 8వేల పేజీలతో మొదటి చార్జిషీట్ దాఖలు చేశారు. ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ ఈ తుది నివేదికను అదనపు సెషన్స్ న్యాయమూర్తి హర్‌దీప్ కౌర్ ముందు పెట్టింది. పుర్కాయస్థ, పిపికె న్యూస్‌క్లిక్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్‌ను నిందితులుగా పేర్కొన్నట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖండ్ ప్రతాప్ సింగ్, సూరజ్ రాథీ తెలిపారు. దీనిపై తదుపరి విచారణను ఏప్రిల్ 16కి వాయిదా వేశారు. గతేడాది డిసెంబర్‌లో మొదటిసారిగా, తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో రెండోసారి చార్జిషీట్ దాఖలు చేయడానికి కోర్టు గడువును పెంచుతూ వచ్చింది. విచారణ మార్చి 20న మరో పది రోజులు పెంచుతున్నట్లు తెలిపింది. యుఎపిఎ సెక్షన్ 43 డి కింద దర్యాప్తు 90రోజుల 180రోజుల్లోపు పూర్తి చేయాల్సి వుంటుంది. చైనాకు అనుకూలంగా ప్రచారం నిర్వహిస్తున్నారంటూ గతేడాది అక్టోబరు 3న న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిని అరెస్టు చేశారు. అప్రూవర్‌గా మారిపోయేందుకు ఈ ఏడాది జనవరిలో అమిత్ పెట్టుకున్న దరఖాస్తును కోర్టు అనుమతించింది.

ముందస్తు బెయిల్‌తో న్యాయం అందకుండా పోరాదు ! : సుప్రీం

న్యూఢిల్లీ : అనేక కేసుల్లో బెయిల్ ఒక నిబంధన అని, కానీ ముందస్తు బెయిల్ మాత్రం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ముందస్తు బెయిల్ న్యాయం అందకుండాపోవడానికి దారి తీయరాదని, ముఖ్యంగా మహిళలపై జరిగిన తీవ్రమైన నేరాల్లో ఈ పరిస్థితి ఎదురుకాకూడదని పేర్కొంది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు న్యాయస్థానాలకు గల అధికారం అసాధారణమైనదని, అంతేకాని ఎవరు అడిగితే వారికి ఇచ్చేది కాదని జస్టిస్ సి.టి.రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. ప్రతి ఒక్క కేసులోనూ వాస్తవాలు, పరిస్థితులపై ఆధారపడి, కోర్టు విచక్షణాధికారంతో మంజూరు చేయాల్సిన అంశమని జడ్జిలు ఒక తీర్పు సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. బీహార్‌లో మహిళలపై దాడులు సహా తీవ్రమైన నేరాలకు పాల్పడిన ఇండియన్ పీనల్ కోడ్ నిబంధనల కింద నమోదైన కేసుల్లోని వ్యక్తులు ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేయగా వాటిని విచారించిన న్యాయస్థానం పై తీర్పునిచ్చింది. పాట్నా హైకోర్టు వారి ముందస్తు బెయిల్ విజ్ఞప్తిని తిరస్కరించింది. దాంతో వారు సుప్రీంను ఆశ్రయించారు. సుప్రీం కూడా హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. తీవ్రమైన నేరాల్లోని నిందితులకు ఇలా ముందస్తు బెయిల్ పేరుతో రక్షణ కల్పించేటప్పుడు న్యాయస్థానాలు చాలా జాగ్రత్తగా ఆచితూచి వ్యవహరించాలని సూచించింది. కొన్ని సందర్భాల్లో ఈ ముందస్తు బెయిల్ సాక్ష్యాధారాలు నాశనమవడానికి దారితీస్తుందని హెచ్చరించారు. అవాంఛనీయమైన అరెస్టులు జరుగుతాయనుకున్నప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛను రక్షించుకోవడానికి ఉద్దేశించిన తాత్కాలిక రక్షణే ఈ ముందస్తు బెయిల్ అని అన్నారు. అర్హమైన కేసుల్లో ముందస్తు బెయిల్‌ను మంజూరు చేయరాదని చెప్పడం తమ తీర్పు ఉద్దేశ్యం కాదని జస్టిస్ రవికుమార్ తెలిపారు.

వామపక్షాలకూ ఐటి నోటీసులు

- సాకులు చూపుతూ తాఖీదులు
- గతంలో సమాధానానికి గడువు కోరినా ఇవ్వని వైనం
- న్యాయస్థానం అక్షింతలు వేసినా మారని తీరు

కొల్‌కతా : జరిమానాలు, వడ్డీలు కలిపి రూ.1,823 కోట్లు చెల్లించాలంటూ కాంగ్రెస్ పార్టీకి ఆదాయపన్ను శాఖ నోటీసు ఇచ్చిన రోజే రెండు వామపక్ష పార్టీలకు కూడా ఇదే రకమైన తాఖీదులు పంపారు. రూ.11 కోట్ల బకాయి చెల్లించాలని సిపిఐకి, రూ.15.59 కోట్లు కట్టాలని సిపిఐ (ఎం)కు నోటీసులు పంపారు. పాత పాన్‌కార్డు ఉపయోగించిందన్న సాకు చూపి రూ.11 కోట్లు కట్టాలని సిపిఐకి పంపిన నోటీసులో సూచించారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని ఆ పార్టీ యోచిస్తోంది. ఇక సిపిఐ (ఎం)కు సంబంధించి 2016-17లో ఇచ్చిన పన్ను మినహాయింపును రద్దు చేశారు. ఆ మదింపు సంవత్సరానికి సంబంధించి సెక్షన్ 148ఏ కింద తమకు నోటీసు పంపారని పార్టీ వర్గాలు తెలిపాయి. 'మదింపుదారుడు బ్యాంక్ ఖాతాను నిర్వహిస్తున్నారు. కానీ ఈ ఖాతాను ఆదాయపన్ను రిటర్న్‌లోని కాలమ్ 13 (బి)లో ప్రకటించలేదు' అని ఆ నోటీసులో తెలియజేశారు. ఈ సెక్షన్ కింద మదింపు జరగని ఆదాయంపై నోటీసు అందజేస్తారు.

సిపిఐ (ఎం) ఏం చెప్పిందంటే...

కేంద్ర కమిటీ స్థాయిలో తాము ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లను ఫైల్ చేస్తామని, ఈ బ్యాంక్ ఖాతాను ఉదహరించకపోవడం పొరబాటున జరిగిందని సిపిఐ (ఎం) వివరణ ఇచ్చింది. అయితే దీనిని ఆదాయపన్ను శాఖ 2022 జూలై 29న తోసిపుచ్చింది. కేసును తిరగదోడి సెక్షన్ 148 కింద ఇప్పుడు నోటీసు పంపింది. గతంలో తనకు అందిన నోటీసుపై పలు సందర్భాలలో వివరణలు ఇవ్వడం జరిగిందని సిపిఐ (ఎం) వివరించింది. 'గత సంవత్సరం మే 13న మాకు నోటీసు పంపారు. సెక్షన్ 13ఏ కింద పన్ను మినహాయింపు కోరుతూ మేము పంపిన అభ్యర్థనను తోసిపుచ్చినట్లు అందులో తెలిపారు. రూ.22,66,30,515 చెల్లించాలని చెప్పారు. ఈ షోకాజ్ నోటీసుకు కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే... అంటే 2023 మే 13 లోగా సమాధానం ఇవ్వాలని సూచించారు. సవివరమైన సమాధానం అందజేసేందుకు వాస్తవాలను సేకరించాల్సి ఉన్నందున మే 29 వరకూ గడువు ఇవ్వాలని మే 16న కోరాము. అయితే మే 23న ఆదాయపన్ను శాఖ తుది ఆదేశాలు జారీ చేసింది. సిపిఐ (ఎం) సమాధానం దాఖలు చేయలేదని అభియోగం మోపింది. 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.15.59 కోట్ల పన్ను విధించింది' అని తెలియజేసింది.

కోర్టు మొట్టికాయలు వేసినా...

ఈ వ్యవహారంపై సిపిఐ (ఎం) ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. సమాధానం ఇచ్చేందుకు గడువు పొడిగింపు కోరుతూ పార్టీ నుండి తనకు అభ్యర్థన ఏదీ అందలేదని ఆదాయపన్ను శాఖ చేసిన వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. సాధారణంగా ఇలాంటి కేసుల్లో గడువు పొడిగింపులు సర్వసాధారణంగా జరుగుతూనే ఉంటాయి. ఐటి శాఖ స్పందించే వరకూ (జూలై నెల) సిపిఐ (ఎం) ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది.

2022 నుండి సాగుతూనే ఉంది

సిపిఐ (ఎం)కు సంబంధించిన పన్ను వివాదం 2022లో మొదలై ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. కానీ కాంగ్రెస్, సిపిఐకి మాత్రం లోక్‌సభ ఎన్నికలకు ముందే నోటీసులు జారీ చేశారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఎన్నికల బాండ్ల పథకంపై అనేక పౌర సమాజాలు న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ రాజకీయ పార్టీలలో ఒక్క సిపిఐ (ఎం) మాత్రమే కోర్టును ఆశ్రయించింది. 'ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకొని ఇలా నోటీసులు పంపుతున్నారని చెప్పడానికి ఆధారాలేవీ లేవు కానీ అది కేవలం కాకతాళీయం మాత్రం కాదు' అని సిపిఐ (ఎం) వర్గాలు 'ది వైర్' పోర్టల్‌కు తెలిపాయి.

బిజెపికి జరిమానా వేయాలన్న ఖర్గే

ప్రతిపక్ష ఇండియా వేదికలో కాంగ్రెస్, సిపిఐ (ఎం), సిపిఐ పార్టీలు భాగస్వాములన్న విషయం తెలిసిందే. 'ప్రతిపక్షాలపై సమర్ధనీయం కాని ఇలాంటి చర్యలకు పాల్పడాలని ఆదాయపన్ను శాఖపై ఎవరు ఒత్తిడి తెస్తున్నారు?' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రశ్నించారు. అధికార బిజెపి రూ.4,600 కోట్ల పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉన్నదని, అయితే దానికి మినహాయింపు ఇచ్చారని ఆయన ఆరోపించారు. '2017-18లో 1297 మంది వ్యక్తులు తమ పేర్లు, చిరునామాలు వెల్లడించకుండా బిజెపికి రూ.42 కోట్లు అందించారని ఎన్నికల కమిషన్ అందజేసిన సమాచారం స్పష్టంగా చెబుతోంది. కేవలం రూ.14 లక్షల డిపాజిట్లకే కాంగ్రెస్‌కు రూ.135 కోట్ల జరిమానా విధించారు. మా పార్టీ బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేశారు. ఈ లెక్కన గత ఏడేళ్లలో బిజెపికి రూ.4,600 కోట్ల జరిమానా విధించాల్సి ఉంటుంది' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఖర్గే పేర్కొన్నారు.

CHANGE OF NAME

I, **UPPALAPATI VENKATA SUBBA RAJU S/o. Appala Raju (late),** aged 65 years, Hindu, R/o. Door No.4-39, Tadepalli Village,Tadepalli Mandal, Krishna District, Andhra Pradesh, India., I do hereby solemnly affirm and sincerely state that in my **Aadhar card dearing No.3217 7485 7657** and **PAN card bearing No.ABOPU1070D** my name mentioned as **VUPPALAPATI SUBBA RAJU**. At present I'am going Change my name as **UPPALAPATI VENKATA SUBBA RAJU.** Hereafter all documents & correspondence will be continued with this name **UPPALAPATI VENKATA SUBBA RAJU**.

KARVY FINANCE

సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన ప్రచురణ

కార్పొరేట్ ఆఫీసు: మెసర్స్ కార్వి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, 301, 3వ అంతస్తు, గుజ్రాల్స్ హౌస్, 167 సిఎస్‌టి రోడ్, కొలివెరీ ఏరియా విలేజ్, కలీనా, సంటాక్రుజ్ (ఇ), ముంబయి-400098.

ఇందుమూలంగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులు/ తాకట్టుదారులకు, ఎవరైతే కార్వి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ నుండి, వారిచే పొందియున్న రుణ సదుపాయాల యొక్క అసలు& వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్టిగావింపబడిన వారికి ప్రకటన ఇవ్వడమేమనగా, వారి రుణ ఖాతాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. వారికి ది సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సార్ఫసీ యాక్ట్) యొక్క సెక్షన్ 13(2) క్రింద వారికి, వారి గతంలో తెలిసిన చిరునామాలకు నోటీసులు జారీచేయబడినవి, కాని అవి బట్వాడా కాకుండానే వెనుదిరిగినవి మరియు అట్టి పరిస్థిల్లో మేము ఈ బహిరంగ ప్రకటన ద్వారా వారికి తెలియజేస్తున్నాము.

లోన్ అగ్రిమెంట్ నం./ రుణగ్రహీతల/ హామీదారుల పేరు	డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసులో మొత్తాలు	సెక్యూర్డ్ అసెట్స్ (స్థిరాస్తుల) వివరణ	ఎన్‌పిఏ తేది
లోన్ అగ్రిమెంట్ నం.409114, 1. గంపనాగ కోటేశ్వర రావు, 2. గంప శివ కుమారి, 30-5-10, అన్నదాన సామ్రాజ్యం రోడ్, దుర్గా అగ్రహారం, విజయవాడ-520002.	**23 మార్చి 2024**	Rs.2001000/- (Rupees Twenty lakhs One Thousand Only)	తాడెపల్లి మున్సిపాలిటీ, తాడెపల్లి మండలం, గుంటూరు జిల్లా-522501 వద్ద విస్తీర్ణం 162చ.గ.లు కలిగియున్న సర్వే నం.229, బ్లాక్ నం.6, డోర్ నం.6-24 యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **తూర్పు:** గల్లి బాజారు, **పడమర:** బి. శివా రెడ్డికి చెందిన ఆస్తి, **ఉత్తరం:** బి. శివారెడ్డికి చెందిన ఆస్తి, **దక్షిణం:** ఎం. కృష్ణా రెడ్డికివ చెందిన ఆస్తి.	1 సెప్టెంబర్ 2020.

పై రుణగ్రహీతలు/ లేదా వారి హామీదారులు/ తాకట్టుదారులు (ఎక్కడైతే వర్తించునో) అను వారికి ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజుల్లోగా బకాయి మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా ఆహ్వానిస్తున్నాము, విఫలం చెందిన ఏదైతే, సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద, సదరు 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు తీసుకోబడుతాయి. తదుపరి మరింత సమాచారం ఇవ్వడమేమనగా, సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(8) క్రింద ఇది మీరు శ్రద్దవహించుటకు మీ దృష్టికి తేవడమైనది. అమ్మకం లేదా ట్రాన్స్‌ఫర్ కొరకు నిర్ణయించిన తేదీకి ముందు ఏ సమయమునైనా అన్ని ఖర్చులు, చార్జీలు మరియు మాచే వెచ్చించిన వ్యయాలతోసహా మా బకాయిలను చెల్లించినట్లైతే, సెక్యూర్డ్ అసెట్ విక్రయించబడదు లేదా మాచేత ట్రాన్స్‌ఫర్‌చేయబడదు, మరియు సెక్యూర్డ్ అసెట్ ట్రాన్స్‌ఫర్ లేదా అమ్మకం కొరకు మాచేత ఏదేని తదుపరి చర్యలు తీసుకోబడవు.

సం/-
అధీకృత అధికారి,
కార్వి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ తరపున.

తేది: 30.03.2024,
ప్రదేశం: విజయవాడ

ఈ ఎన్నికలు లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఒక రెఫరెండం!

(మొదటి పేజీ తరువాయి)

భారత పౌరసత్వాన్ని ఎవరికీ నిరాకరించరాదు. మేం ఓట్ల కోసం చూడడం లేదు. భారతదేశ లౌకికవాద గుర్తింపును పరిరక్షించడంపైనే మా దృష్టంతా వుంది.

కాంగ్రెస్ నుండి బిజెపిలోకి ఫిరాయింపులు ఎల్‌డిఎఫ్‌ను ఆందోళనపరుస్తున్నాయా? కేరళలో కాంగ్రెస్ విచ్ఛిన్నమయ్యేలా చూడడం ఎల్‌డిఎఫ్‌కి ప్రయోజనకరం కాదని మీరు పదే పదే చెబుతున్నారు కదా. ఎందుకు కాదో కాస్త మీరు వివరించగలుగుతారా? అటువంటి పరిస్థితి కేరళలో మితవాద పార్టీకి బలం పెరుగుతుందా?

ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని మతోన్మాద బిజెపి పాలనకు వ్యతిరేకంగా అన్ని లౌకికవాద, ప్రజాస్వామ్య శక్తులను ఏకతాటిపైకి తీసుకురావాలని మేం భావిస్తున్నాం. అందువల్ల దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను బలహీనపడుతున్నాయంటే అది కచ్చితంగా ఆందోళన చెందే అంశమే. ప్రజలు లౌకిక, ప్రజాస్వామ్య పార్టీల నుండి మతోన్మాద, నిరంకుశవాద పక్షాల వైపునకు మళ్ళినపుడు కచ్చితంగా అది మితవాద విభాగానికి బలం చేకూరుస్తుంది. మృదు హిందూత్వ విధానాలను అనుసరించడం ద్వారా బిజెపిని ఓడించడం సాధ్యం కాదు, రాజీలేని ధోరణిలో మతోన్మాద వ్యతిరేక రాజకీయ వైఖరిని అనుసరించడం ద్వారానే వారిని ఎదుర్కొనాల్సిన అవసరం వుంది.

వాయనాడ్ నుండి రాహుల్ గాంధీ అభ్యర్థిత్వం వల్ల 2019లో మాదిరిగా యుడిఎఫ్ అవకాశాలు పెరుగుతాయని మీరు భావిస్తున్నారా? లేదా వంతెన కింద నీళ్ళ మాదిరిగా రాహుల్ ప్రభావం వుంటుందా?

అస్సలు ఎలాంటి ప్రభావం వుండదు. కేరళ నుండి ఎంపిగా ఆయన ఏం చేశారో ఆ పనితీరుపైనే ఆయనను అంచనా వేస్తారు. ఆయన నియోజకవర్గం వాయనాడ్ ప్రజలు లోక్‌సభలో ఆయన ఉనికి, పనితీరు గురించి సీరియస్‌గా ప్రశ్నలు అడుగుతున్నారు. ముఖ్యంగా వారికి చెందినటువంటి కీలక సమస్యలపై అంటే మనుషులు-వన్యప్రాణుల మధ్య ఘర్షణ, సిఎఎ, ఎన్‌ఐఎ, అయోధ్య వంటి అంశాలపై మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ నిజంగానే బిజెపితో పోరు సల్పాలనుకుంటే, బిజెపి అభ్యర్థులపై నేరుగానే పోటీకి దిగాలి. అగ్ర నేతలు కూడా బిజెపితో పోరుకు విముఖత చూపిస్తుంటే దేశ ప్రజలకు వారిచ్చే సందేశం ఏమిటి?

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలకు దిగిన వారిపై కేసులను ఉపసంహరించుకోవడం ద్వారా మీరు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని, పైగా మైనారిటీల్లో భయాన్ని పాదుగొల్పడం ద్వారా మతం పేరుతో ఓటర్లను విభజిస్తున్నారని బిజెపి చేస్తున్న ఆరోపణలకు మీరు ఎలా స్పందిస్తారు?

ఏ కమ్యూనిటీలోనూ మేం భయాన్ని పాదుగొల్పడం లేదు. తమ హింసా, విద్వేష రాజకీయాలతో, విచక్షణాపూరిత విధానాలతో, సిఎఎ, ఎన్‌ఐఎ వంటి వాటిని వ్యాప్తి చేయడం ద్వారా భారత సమాజంలోని వివిధ వర్గాల మధ్య బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ కూటమి భయం గొలుపుతోంది.

వ్యక్తిగతంగా మీపై యుడిఎఫ్, బిజెపిలు సాగిస్తున్న నేరారోపణ ప్రచారం కూడా ఇదే ధోరణిలో వుంటోంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో వారి వాదనలను ఓటర్లు తిరస్కరించారు. ఇప్పుడు మళ్లీ పాత ఆరోపణలను తవ్వడానికి యుడిఎఫ్, బిజెపిలు ప్రయత్నిస్తున్నాయి. సిఎఎ, లౌకికవాదం, ఆర్థిక సమాఖ్యవాదంతో సహా కీలకమైన లోక్‌సభ ఎన్నికల్లో ఇమిడివున్న పెద్ద సమస్యలను దృష్టిలో వుంచుకుంటే దీనికి ఏమైనా అవకాశాలు వున్నాయా?

ఏమీ వుండదు. తప్పుడు లక్ష్యాలతో వున్నారు. అంతే.

సిఎఎ, ప్రతిపక్షాలను, వారి ఆర్థిక లక్ష్యాలను బలహీనపరిచేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడంతో సహా కీలకమైన అంశాలపై కాంగ్రెస్ ఒంటరిగా వెళ్ళడం ఇండియా బ్లాక్ ఉమ్మడి ప్రయోజనాన్ని జాతీయ స్థాయిలో ఎలా ప్రభావితం చేస్తుందని మీరనుకుంటున్నారు?

కాంగ్రెస్ పార్టీ దాని పనితీరు గురించి చాలామందికి వున్న విమర్శ ఇదే. ప్రతిపక్షంలో అతిపెద్ద పార్టీగా వారు ప్రతి ఒక్కరినీ కలుపుకుని పోవడంలో సమర్థవంతమైన పాత్ర పోషించలేకపోతున్నారు. అదే సమయంలో, వారి పెద్దన్న వైఖరి కలిసి నిలబడాల్సినవారిని వేరు చేస్తోంది.

సిఎఎ గురించి చూసినట్లైతే, ఈ చట్టం అమలును నివారించడానికి కేరళకు చట్టపరంగా ఏమైనా అవకాశం వుందా, ఎందుకంటే అనేక బహిరంగ సభల్లో మీరు దీని గురించే ఎక్కువగా మాట్లాడుతున్నారు గదా?

సిఎఎ అన్నది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. పైగా రాజ్యాంగ మౌలిక వ్యవస్థ సిద్ధాంతానికి వ్యతిరేకం. అందువల్లే దాన్ని కోర్టులో సవాలు చేశాం. న్యాయ సమీక్ష ప్రక్రియ కొనసాగనివ్వండి, రాజ్యాంగ విరుద్ధమైన, వ్యతిరేకమైన చట్టాన్ని అమలు చేస్తామని ఏ ప్రభుత్వమైనా ఎలా చెబుతుంది?

సవరణ చెల్లుబాటును సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం ఒక పిటిషన్ వేసింది. రూపొందించిన నిబంధనలకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ జనరల్‌ను కోరాం.

నవ్ కేరళ సదస్సు మీ ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత సన్నిహితం చేసిందని మీరు భావిస్తున్నారా? ఆర్థిక సమాఖ్యవాదంపై దారుణమైన ఉల్లంఘనలు, కేంద్రం యొక్క ఘర్షణాయుత వైఖరి రాష్ట్ర అభివృద్ధికి, విస్తృతమైన సామాజిక భద్రతా వ్యవస్థకు ముప్పుగా పరిణమించాయని ఓటర్లను మీ ప్రభుత్వం ఒప్పించగలిగిందా?

అవును, సంపూర్ణంగా చేయగలిగాం. కేరళ పట్ల కేంద్ర ప్రభుత్వ వివక్షను మరింత ప్రశ్నించడాన్ని, ఇటువంటి వివక్షాపూరిత విధానాలను ప్రశ్నించని కేరళలోని ప్రతిపక్షమైన యుడిఎఫ్‌ను ప్రజలు విమర్శించడాన్ని మనం చూస్తున్నాం.

విజ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థ ద్వారా నడిచే ఆధునిక కేరళ పట్ల మీ దార్శనికత ప్రజలకు మీరు చేరువయ్యే సుస్థిరమైన అంశంగా వుంది. రాబోయే కాలంలో అక్షరాస్యత, అత్యంత నాణ్యతతో కూడిన జీవన సూచీలు కలిగిన కేరళ, నిపుణత్వం, ఉదారత్వం, లౌకికవాదానికి ఒయాసిస్‌గా ఆవిర్భవించగలుగుతుందని మీరు భావిస్తున్నారా?

నిస్సందేహంగా. అనేక అభివృద్ధి సూచీల్లో కేరళ ఇప్పటికే దేశానికి మార్గదర్శకత్వం వహిస్తోంది. ముఖ్యంగా విద్య, ఆరోగ్య రంగాల్లో అగ్ర భాగాన వుంది. అనేక విషయాల్లో అభివృద్ధి చెందిన దేశాల సరసన మేం వున్నాం. కేరళలో వున్న లక్షలాదిమంది గెస్ట్ వర్కర్లు వారి స్వంత రాష్ట్రాలతో పోలుస్తూ మా రాష్ట్రం గురించి ఏమంటున్నారో మేం చూస్తున్నాం. వారు ఇక్కడ మరింత మెరుగైన విద్య, ఆరోగ్య సౌకర్యాలు, అధిక ఆదాయాలు పొందుతున్నామని చెబుతున్నారు. అందువల్ల, విజ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థ, వినూత్న సమాజంగా ఆవిర్భవించే బాటలోనే కచ్చితంగా మేమున్నాం.

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम एक परिवार एक बैंक

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
జోనల్ ఆఫీసు, ఇ.నం.4-3-448 నుండి 460 & 465 నుండి 468, 1వ అంతస్తు, వినూత్న పిట్టీస్ మజేస్టి, గోపాల్ బాగ్, బ్యాంక్ స్ట్రీట్ దగ్గర, కోఠి, హైదరాబాద్.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్) 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ యాక్ట్, 2002 (షార్ఫసీ యాక్ట్) క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత& హామీదారులుకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్ క్రెడిటర్‌కు తాకట్టు/చార్జ్‌డ్ పెట్టబడినవి, ఏదైతే **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర** (సెక్యూర్డ్ క్రెడిటర్) యొక్క అధీకృత అధికారిచేత నిర్మాణాత్మక స్వాధీనంచేసుకోబడినది, దానిని రుణ మొత్తాలు + దాని పై లెక్కించని వడ్డీ మరియు తదుపరి వడ్డీ ప్లస్ వ్యయాలు& దానిపై ఇతర చార్జీల రికవరీ కొరకు, **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన **16.04.2024**న విక్రయించబడుతుంది.

క్ర.సం.	రుణగ్రహీత& హామీదారు పేరు	బకాయి మొత్తాలు
1	**మెసర్స్ విజయ శారద డిలైంట్ సీడ్ మిల్స్,** ప్రొప్రైటర్ **శ్రీ కేతినేని సుభాష్ చంద్ర బోస్,** డోర్ నం.145/1సి, ఎన్‌హెచ్-5, గణపవరం, చిలకలూరిపేట్, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522619. **మెసర్స్ విజయ శారద డిలైంట్ సీడ్ మిల్స్,** ప్రొప్రైటర్ **శ్రీ కేతినేని సుభాష్ చంద్ర బోస్,** ఫ్లాట్ నం.201, అనంత లక్ష్మి నిలయం, 2వ లైన్, సి.ఆర్.పురం, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522616. **శ్రీమతి కేతినేని లక్ష్మి అనిల, భర్త శ్రీ కేతినేని సుబాష్ చంద్ర బోస్,** ఫ్లాట్ నం.201, అనంత లక్ష్మి నిలయం, 2వ లైన్, సి.ఆర్.పురం, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522616. **శ్రీ పి. సుబ్బారావు, తండ్రి నరసయ్య,** ఫ్లాట్ నం.201, అనంత లక్ష్మి నిలయం, 2వ లైన్, సి.ఆర్.పురం, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522616.	**రూ.7,42,99,515/- (రూపాయలు ఏడు కోటి నలభై రెండు లక్షల తొంభై తొమ్మిది వేల ఐదు వందల పదిహేను మాత్రమే)** ప్లస్ లెక్కించని వడ్డీ& తదుపరి వడ్డీ ప్లస్ వ్యయాలు& ఇతర చార్జీలు.
	స్థిరాస్తి వివరణ: 1) గణపవరం గ్రామం, రిజిస్ట్రేషన్ జిల్లా నర్సారావుపేట్, సబ్-డిస్ట్రిక్ట్ చిలకలూరిపేట్ వద్ద ఉన్న ఎక.1.12సెంట్లు విస్తీర్ణం చ.అ.లు/చ.మీ. మరియు సర్వే నం.డోర్ నం.145-1సి గల ఆస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** కిదాంబి ప్రసన్న లక్ష్మి పేరున ల్యాండ్, **తూర్పు:** వెలేటి వెంకటేశ్వర రావు ల్యాండ్, **దక్షిణం:** చెరుకూరి సుబ్బారావు పేరున ల్యాండ్, **పడమర:** పరుచూరి సుబ్బారావు చే ఉమ్మడి దారిగా వదిలిన ల్యాండ్, అన్ని ఫిక్షర్స్, ఫిటింగ్స్, దానిపై అనెక్షర్ద్‌తో నిర్మించిన లేదా నిర్మించబడుచున్న భవనాలతోసహా.	
	రిజర్వుధర: రూ.1,06,00,800/-	**ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.10,60,080/-**
	స్థిరాస్తి వివరణ: 2) నాదేండ్ల గ్రామం, రిజిస్ట్రేషన్ జిల్లా నర్సారావుపేట్, సబ్-డిస్ట్రిక్ట్ చిలకలూరిపేట్ వద్ద ఉన్న ఎక.4.00సెంట్లు విస్తీర్ణం మరియు డోర్ నం.1253 వద్ద గల ఆస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** పోతురాజు కుంట, **తూర్పు:** గొల్లపాటి రామయ్య ల్యాండ్, **దక్షిణం:** మాకినేని ప్రభావతి ల్యాండ్, **పడమర:** సర్కార్ డొంక.	
	రిజర్వుధర: రూ.1,92,00,000/-	**ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.19,20,000/-**
	స్థిరాస్తి వివరణ: 3) పురుషోత్తంపట్నం గ్రామం, రిజిస్ట్రేషన్ జిల్లా నర్సారావుపేట్, సబ్-డిస్ట్రిక్ట్ చిలకలూరిపేట్ చిలకలూరిపేట్ మున్సిపల్ ఏరియా నం.1 బ్లాక్ వద్ద ఉన్న ఎక.0.49సెంట్లు విస్తీర్ణం మరియు డోర్ నం.473-బి2 0.20 మరియు డోర్ నం.473-బి1 0.29 వద్ద గల ఆస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** తియ్యగుర కృష్ణా రెడ్డి ల్యాండ్-162.5 లింకులు, **తూర్పు:** ఆవుల హనుమయ్య ల్యాండ్-300 లింకులు, **దక్షిణం:** తాటి రాములు ల్యాండ్-163.5 లింకులు, **పడమర:** ఆవుల సుబ్బమ్మ ల్యాండ్-298 లింకులు.	
	రిజర్వుధర: రూ.1,17,60,000/-	**ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.11,76,000/-**
	స్థిరాస్తి వివరణ: 4) పురుషోత్తమపట్నం జిల్లా, నర్సారావుపేట్ సబ్-డిస్ట్రిక్ట్, చిలకలూరిపేట్ గ్రామం వద్ద సర్వే నం.382/3గా మరియు ఎక.1.20సెంట్ల చ.అ.లు/చ.మీ.ల విస్తీర్ణం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** వి. రాములు పేరున ల్యాండ్, **తూర్పు:** వి. రాధాకృష్ణ మూర్తి పేరున ల్యాండ్, **దక్షిణం:** తోట సుబ్బా రావు పేరున ల్యాండ్, **పడమర:** పొలిమేర డొంక, దానిపై నిర్మిస్తున్న మరియు నిర్మించబడిన భవనాలు& నిర్మాణాలతో మరియు దానిపై అన్ని ఫిక్షర్స్, ఫిటింగ్స్, అనుబంధం.	
	రిజర్వుధర: రూ.57,60,000/-	**ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.5,76,000/-**
2	**1) మెసర్స్ నర్రా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నం.డి1-202, కాంతి శిఖర అపార్టుమెంట్స్, పంజాగుట్ట, హైదరాబాద్-500082. **2) శ్రీ నర్రా శ్రీనివాస్,** డైరెక్టర్ **మెసర్స్ నర్రా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నం.డి1-202, కాంతి శిఖర అపార్టుమెంట్స్, పంజాగుట్ట, హైదరాబాద్-500082. **మరియు: శ్రీ నర్రా శ్రీనివాస్,** 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డిగూడ, హైదరాబాద్-500073. **3) శ్రీమతి నర్రా అనిత,** డైరెక్టర్ మెసర్స్ **నర్రా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నం.డి1-202, కాంతి శిఖర అపార్టుమెంట్స్, పంజాగుట్ట, హైదరాబాద్-500082. **మరియు: శ్రీమతి నర్రా అనిత, భర్త శ్రీ నర్రా శ్రీనివాస్,** 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డిగూడ, హైదరాబాద్-500073. **4) శ్రీ నర్రా శ్రీనివాస్,** హామీదారు, 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డిగూడ, హైదరాబాద్-500073. **5) శ్రీమతి నర్రా అనిత, భర్త శ్రీ నర్రా శ్రీనివాస్,** (హామీదారు), 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డిగూడ, హైదరాబాద్-500073. **6) శ్రీ ఎం. శ్రీహరి,** హామీదారు, ఫ్లాట్ నం.204, పూజా రెసిడెన్సీ, బొల్లారం రోడ్, చైతన్య కాలేజి దగ్గర, శేరిలింగంపల్లి, మియాపూర్, హైదరాబాద్-500029. **7) శ్రీమతి పెద్ది విజయలక్ష్మి,** హామీదారు, **భర్త: కీ॥శే॥ శ్రీ పెద్ది సత్యప్రసాద్,** ఇ.నం.1-14, వీరంక లాకులు, గుర్రాల లంక, పామిడిముక్కల, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521250.	**రూ.6,45,93,181/- (రూపాయలు ఆరు కోట్ల నలభై ఐదు లక్షల తొంభై మూడు వేల నూటా ఎనభై ఒకటి మాత్రమే)** ప్లస్ లెక్కించని వడ్డీ& తదుపరి వడ్డీ ప్లస్ వ్యయాలు& ఇతర చార్జీలు.
	స్థిరాస్తి వివరణ: 1) కృష్ణా జిల్లా, వుయ్యూరు మండలం, గండిగుంట గ్రామం, ఎస్.జి.ఎస్.నగర్, గణపతి సచ్చిదానంద దాత టెంపుల్ వెనుక, డోర్ నం.6-62 దగ్గర, ఆర్.ఎస్.నం.946/4, ప్లాట్ నం.1 వద్ద 402.2చ.గ.ల విస్తీర్ణంతో ఖాళీ ప్లాటు యొక్క మొత్తం భాగం. యజమాని **శ్రీ ఎన్. శ్రీనివాస్** మరియు **ఉత్తరం:** 33అ.ల రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నం.2, **తూర్పు:** 33అ.ల రోడ్డు మరియు **పడమర:** శ్రీ ఎం. విశ్వేర రావు ఆస్తి	
	రిజర్వుధర: రూ.70,00,000/-	**ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.7,00,000/-**
	స్థిరాస్తి వివరణ: 2) కృష్ణా జిల్లా, వుయ్యూరు మండలం, గండిగుంట గ్రామం, ఆర్.యస్.నం.146/6 వద్ద 277.60చ.గ.ల విస్తీర్ణంతో (రిజిస్టర్డు సేల్ డీడ్ నం.3403/2011) ఖాళీ ఇంటి సైటు యొక్క మొత్తం భాగం. మరియు **సరిహద్దులు: ఉత్తరం:** ఎం. సంధ్యారాణికు చెందిన ల్యాండ్, **దక్షిణం:** మహ్మద్ గాలిద్‌కు చెందిన ల్యాండ్, **తూర్పు:** నడుచుట కొరకు 5అ.ల ఉమ్మడి రోడ్డు, **పడమర:** డి. శ్రీహరికు చెందిన ల్యాండ్.	
	రిజర్వు ధర: రూ.55,00,000/-	**ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.5,50,000/-**

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& నిబంధనల కొరకు, దయచేసి సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క వెబ్‌సైట్: http://www.bankofMaharashtra.in లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి.

తేది: 30.03.2024, ప్రదేశం: హైదరాబాద్ **సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర**

మీ కోసం

టీ స్ట్రెయినర్స్ (స్టీలు)లో రంధ్రాలు మూసుకుపోయినప్పుడు తక్కువ మంటపై వాటిని వేడి చేస్తే పేరుకుపోయిన టీపొడి మాడిపోయి రాలిపోతుంది. ఆ తరువాత వాటిని డిటర్జెంట్‌లో శుభ్రపర్చుకోవాలి.

జీవన సౌరభం

ఏదీ దానంతట అదే మన దగ్గరకు రాదు. శోధించి సాధించాల్సిందే.

ఎర్రా ఎర్రని పండు

ఎర్ర ఎర్రాని పండు
నిగ నిగలాడుతుండు
కంటికి ఇంపుగా నుండు
గింజలే కమ్మగా ఉండు

పోషకాలే దండిగుండు
నిరోధకశక్తే మెండు
జ్ఞాపక శక్తి దాగుండు
జీర్ణక్రియే బాగుండు

ఒత్తిడినే తగ్గించును
వృద్ధాప్యమే నెమ్మదౌను
జుట్టురాలుట ఆపును
ఔషధాలే నిలువెల్లను

పల విటమిన్లు లభించును
ఖనిజ లవణాలు ఇచ్చును
పలు లాభాలు చేకూర్చును
చర్మ సౌందర్యమే పెంచును

దాని గింజలు ముత్యాలు
దాని పిల్లలు రత్నాలు

దాని దేహమే లావణ్యం
దాని రసమే మాధుర్యం

అది పండేను మెట్ట ప్రాంతం
మది నిండేను ఆద్యంతం
అది పంచేను అమ్మ ప్రేమ
దాని పేరే, దానిమ్మా!

- గుండాల నరేంద్రబాబు,
94932 35992.



గుర్తు పట్టండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన ఆంగ్ల పజిల్‌లో పక్కనే ఉన్న పండ్ల పేర్లు గజిబిజిగా ఉన్నాయి. అవి ఎక్కడున్నాయో మీరు కనిపెట్టండి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం.

నేను గీసిన బొమ్మ

- ఎన్.జాయ్‌పెర్సిస్,
1వ తరగతి,
భాష్యం ఇంగ్లీషు మీడియం హైస్కూలు,
అశోక్ నగర్,
ఏలూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



శీతల పానీయాలు .. అనారోగ్య కారకాలు ...

వేసవిలో ఎండల నుంచి ఉపశమనం కోసం చాలామంది కూల్‌డ్రింక్స్ (శీతల పానీయాలు) తీసుకుంటారు. తాగిన కాసేపు చల్లగా ఉన్నా ఆ తర్వాత వచ్చే సమస్యలు అనేకం. కొద్ది క్షణాల ఉపశమనం కోసం కూల్‌డ్రింక్స్ తాగితే నోట్లో విషం పోసుకున్నట్లేనని పరిశోధకులు చెబుతున్నారు. మనం ఏదైనా పండ్ల రసాన్ని తయారు చేసి ఫ్రిజ్‌లో ఉంచితే రెండు, మూడు రోజులు బాగానే ఉంటుంది. ఆ తర్వాత పాడవుతుంది. అదే బయట ఉంచితే ఒక్క రోజులోనే పాడవ్వొచ్చు. కానీ మనకు బయట దొరికే శీతల పానీయాలు మాత్రం దాదాపుగా సంవత్సరం దాకా బాగుంటాయని దానిపై తేదీని సైతం ముద్రిస్తారు. మన వద్ద అయితే రోజుల్లోనే పాడైపోయేవి కొన్ని కంపెనీలు చేసే ప్యాకింగ్‌లో ఏడాది పాటు ఎలా ఉంటాయనేది ప్రశ్న. వీటిలో ఎక్కువ రోజులు నిల్వ వుండేలా హానికరమైన రసాయనాలు వాడతారు. మనకు తెలియకుండా వీటిని తాగేయటం వల్ల అనారోగ్యం పాలవుతుంటాం.

కూల్‌డ్రింక్స్ వల్ల అనర్థాలివే...

కూల్‌డ్రింక్‌తో అలసట ఉన్న వారికి ఆస్తమా వ్యాధి, గ్యాస్, అసిసిటీ, కిడ్నీల్లో రాళ్లు, క్యాన్సర్, శరీరంలో చక్కెర శాతం పెరిగి షుగర్, ఊబకాయం వంటి వ్యాధుల బారిన పడతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కూల్‌డ్రింక్‌లో ఉండే క్షార లక్షణం మన పళ్లు కూడా పాడవుతాయి. దాదాపుగా అన్ని రకాల కూల్‌డ్రింకుల్లోనూ ప్రమాదకరస్థాయిలో క్రిమిసంహారక మందుల అవశేషాలు ఉన్నట్లుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) గతంలో వెల్లడించింది. కాబట్టి దాహార్తి తీరటానికి మజ్జిగ, చెరకు రసం, కొబ్బరిబోండాం లాంటి వాటిని తీసుకుంటే ఉత్తమం. పండ్ల రసాలు, నిమ్మకాయ షర్బత్, మజ్జిగ, పుచ్చకాయ, కొబ్బరినీరు వంటి వాటిని తీసుకుంటే ఆరోగ్యం వందశాతం బాగుంటుందని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు.

గ్యాస్ ఆదా చిట్కాలు



వంట చేసేటప్పుడు మనం చేసే చిన్న చిన్న పొరపాట్ల వల్ల గ్యాస్ వృథా అవుతూ ఉంటుంది. అలా వృథా కూడా ఈ కింది జాగ్రత్తలు పాటించండి.

- ఏ గిన్నెలో వంట చేయానుకుంటున్నామో ఆ గిన్నెలో తడి లేకుండా చూసుకోవాలి.
- అన్నం, కూరలు వండేటప్పుడు సరిపోయినన్ని నీళ్లే పోసుకోవాలి.
- ఏ వంట చేయాలో దానికి సంబంధించిన పదార్థాలన్నీ స్టవ్ వెలిగించకముందే సిద్ధం చేసుకోవాలి.
- సాధారణంగా చాలామంది వంటతో పాటు ఇతర పనులూ చేసుకుంటూ ఉంటారు. అలా ఇతర పనుల్లో పడి ఎక్కువసేపు ఉడికిస్తూ ఉంటారు. దానివల్ల గ్యాస్ వృథా అవుతుంది. అప్రమత్తంగా ఉండి, వంట పూర్తి కాగానే స్టవ్ ఆపేయాలి.
- ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో నుంచి తీసి నేరుగా స్టవ్‌పై పెట్టి వేడి చేస్తే.. వేడి కావడానికి చాలా సమయం పడుతుంది. అలా కాకుండా ఫ్రిజ్ నుండి తీసి కొంచెంసేపు బయట పెట్టాలి. చల్లదనం తగ్గి సాధారణ స్థితికి వచ్చిన తరువాత వేడి చేస్తే త్వరగా వేడవుతాయి.
- వంట చేసేటప్పుడు మంటను లోఫ్లేమ్‌లో ఉంచితే ఆ వంటకంలోని పోషకాల ప్రయోజనాలు దెబ్బతినవు.
- వండే పాత్రపై మూత పెట్టడం వల్ల ఆవిరి బయటకు పోదు. వంట త్వరగా అవుతుంది.
- బియ్యం లేదా పప్పులను ముందే నానబెట్టి, తర్వాత ఉడికిస్తే తొందరగా ఉడుకుతాయి.
- ఎప్పటికప్పుడు బర్నర్లను శుభ్రం చేసుకుంటూ ఉండాలి. లేదంటే ఏవైనా వంటకాలు పొంగినప్పుడు వాటి రంధ్రాల్లో డస్ట్ చేరిపోతుంది. నీలి రంగు మంట వుంటేనే గ్యాస్ ఆదా అవుతున్నట్లు.
- అన్నం, పప్పు వేర్వేరుగా కాకుండా రెండు పాత్రలను కుక్కర్‌లో పెట్టి ఉడికిస్తే గ్యాస్ ఆదా అవుతుంది.
- ఇంటి సభ్యులందరూ ఒకేసారి భోజనం చేస్తే మళ్లీ మళ్లీ వేడి చేయాల్సిన అవసరం ఉండదు.

చెమట కాయలకు ఇలా చెక్ పెట్టండి!

వేసవిలో చిన్నారుల నుంచి పెద్దవాళ్ల వరకు ఎక్కువ మందిని బాధించేవి చెమటకాయలు. ఒంటిపై దురదతో మొదలై, ఎర్రని దద్దుర్లలా వస్తాయి. వీటికి ఇంట్లో లభ్యమయ్యే వస్తువులతోనే నియంత్రించవొచ్చు.

- శరీరం చల్లగా, గాలి తగిలేలా ఉండడం ముఖ్యం. వేసవిలో తేలికపాటి రంగుల్లో వదులుగా ఉండే కాటన్ బట్టలు వేసుకోవాలి. సింథటిక్ బట్టల్లో గాలి ఆడదు.
- చర్మాన్ని పొడిగా ఉంచుకోవాలి. స్నానం తరవాత టవల్‌తో గట్టిగా తుడవకుండా పొడిగా అద్దుకోవాలి. వెంటనే పౌడర్ చల్లుకుంటే చల్లగా ఉంటుంది.
- బయట వేడికి శరీరంలోని నీరు ఆవిరవుతుంది. కాబట్టి శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. కొబ్బరి నీళ్లు, నిమ్మకాయ నీళ్లు, లస్సీ, మజ్జిగ వంటివి తాగుతూ ఉండాలి.
- వేపుళ్లు, స్వీట్లు తగ్గించి పండ్లు, సలాడ్లు ఎక్కువగా తీసుకోవాలి. బయటి ఫుడ్ గాని, ఒంట్లో వేడిని పెంచే ఆహారం గాని తీసుకోవద్దు. తాజా కూరగాయలు తీసుకోవాలి.
- చల్లని పెరుగును చెమట కాయల మీద అప్లయ్ చేసి పదిహేను నిమిషాల పాటు వదిలెయ్యాలి. తరవాత చల్లని నీటితో కడిగేసి మెత్తటి బట్టతో అద్దాలి. పెరుగులోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఈ సమస్యకి త్వరగా చెక్ పెడతాయి.
- కలబంద గుజ్జును చెమటకాయలపై రాస్తే, అందులో ఉండే ఆస్ట్రిజెంట్ లక్షణాలు చెమట కాయలతో పాటూ ఇన్‌ఫెక్షన్లనూ తగ్గిస్తాయి.
- ఐస్ బ్యాగులో కొన్ని ఐస్ ముక్కలు వేసి చెమటకాయలపై అద్దాలి. అలా మూడు, నాలుగు గంటలకోసారి 15 నిమిషాల పాటు చేస్తే ఉపశమనం ఉంటుంది.

- టీట్రీ ఆయిల్‌కు కొద్దిగా నీరు కలిపి, ఆ మిశ్రమంలో కాటన్ ముంచి చెమటకాయలపై రాస్తే ఫలితం ఉంటుంది. బ్లాక్ టీ మిశ్రమాన్ని చెమటకాయలపై రాసినా త్వరగా తగ్గిపోతాయి.
- ఓట్స్‌ను పౌడర్‌లా చేసి, అందులో గోరు వెచ్చని నీటిని పోసి కలపాలి. ఆ మిశ్రమాన్ని చెమటకాయలపై రాసి 30 నిమిషాల తర్వాత కడిగేయాలి.
- టిష్యూ పేపర్‌ను వెనిగర్‌లో ముంచి చెమటకాయలపై రాస్తే త్వరగా తగ్గిపోతాయి.
- 200 ఎం.ఎల్. రోజ్ వాటర్, 200 ఎం.ఎల్. ప్యూర్ వాటర్, 4 టేబుల్ స్పూన్ల తేనె కలిపి, ఈ మిశ్రమాన్ని ఐస్ ట్రేలో వేసి ఫ్రీజ్ చేయాలి. తయారైన నాలుగైదు ఐస్‌క్యూబ్ తీసుకొని మెత్తని బట్టలో చుట్టి, చెమటకాయలపై నెమ్మదిగా అద్దాలి. అలా చేయడం వల్ల దురద తగ్గుతుంది.
- గంధాన్ని చల్లటి పాలతో కలిపి ప్యాక్‌లా వేసుకోవాలి. ఆరిన తరవాత చల్లని నీటితో కడిగేయాలి. దీనివల్ల సన్ టాన్ కూడా పోతుంది.
- రెండు టీ స్పూన్ల పుదీనా పేస్ట్, మూడు టేబుల్ స్పూన్ల ముల్తానీ మట్టి, చల్లని పాలు కలిపి పేస్ట్ చేయాలి. బాగా గాలి తగిలేలా కూర్చొని మిశ్రమాన్ని చెమటకాయల మీద అప్లయ్ చేయాలి. తరవాత మెత్తటి టవల్‌తో అద్దాలి.

బిజెపి రాజకీయ ఆయుధంగా ఇడి : ఢిల్లీ మంత్రి అతిషి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి రాజకీయ ఆయుధంగా కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వ్యవహరిస్తోందని ఢిల్లీ మంత్రి అతిషి విమర్శించారు. లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ చేసిన ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ మొబైల్ ఫోన్‌ను పరిశీలించి, ఆమ్ ఆద్మీ పార్టీ లోక్‌సభ ఎన్నికల వ్యూహాలను తెలుసుకోవాలని ఇడి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. "కేజ్రీవాల్ ఫోన్‌ని పరిశీలించాలని ఇడి పట్టుబడుతోంది. నిజానికి.. ఎక్సైజ్ పాలసీని రూపొందించి, అమలు చేసినప్పుడు ఆ మొబైల్ ఫోన్ ఉనికిలోనే లేదు. ఇది కొన్ని నెలల క్రితం నాటిది మాత్రమే. అయినా ఆ ఫోన్ కావాలని ఇడి పట్టుబట్టడాన్ని చూస్తుంటే.. ఆ ఏజెన్సీ బిజెపి రాజకీయ ఆయుధంగా పనిచేస్తున్నట్లు స్పష్టమవుతోంది" అని అన్నారు. నిజానికి.. ఆ ఫోన్‌లో ఏముందో తెలుసుకోవాలని అనుకుంటోంది బిజెపి అని, ఇడి కాదని తెలిపారు. ఎక్సైజ్ పాలసీని అమలు చేసినప్పుడు కేజ్రీవాల్ వద్ద ఉండే ఫోన్ ఇప్పుడు అందుబాటులో లేదని స్వయంగా ఇడి చెప్పిందని, అయితే ఇప్పుడు కొత్త ఫోన్ పాస్‌వర్డ్ కావాలని ఆ ఏజెన్సీ కోరుతోందని చెప్పారు. పాస్‌వర్డ్ ఇవ్వకపోవడం వల్ల.. మరికొన్ని రోజులు కస్టడీ అవసరమని ఇడి న్యాయవాది కోర్టులో చెప్పారని ఆమె గుర్తు చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఇడి పాస్‌వర్డ్ అడగడం లేదని, కేజ్రీవాల్ ఫోన్‌లో ఏముందో తెలుసుకునేందుకు బిజెపి చేస్తున్న కుట్ర అని అతిషి ఆరోపించారు. ఆప్ లోక్‌సభ ఎన్నికల వ్యూహాలు, ప్రచార ప్రణాళికలు, ఇండియా ఫోరం నాయకులతో జరిపిన చర్చలు, మీడియా-సోషల్ మీడియా వ్యూహాలకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడం కోసం వాళ్లు ప్రయత్నిస్తున్నారని ఆమె తెలిపారు. ఢిల్లీ, పంజాబ్, గుజరాత్, అస్సాంలలో మొత్తం 22 లోక్‌సభ స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టిన ఆప్ వ్యూహాన్ని బిజెపి తెలుసుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు.

ఇడి ముందుకు ఢిల్లీ మంత్రి కైలాష్ గెహ్లాట్

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు తరువాత కూడా ఇడి 'ఆప్' నేతలను వెంటాడుతోంది. ఈ కేసులో ఢిల్లీ మంత్రి, ఆప్ నేత కైలాష్ గెహ్లాట్ శనివారం ఇడి ముందు విచారణకు హాజరయ్యారు. నజఫ్‌గఢ్ ఎమ్మెల్యేగా ఉన్న గెహ్లాట్ (49) కేజ్రీవాల్ మంత్రివర్గంలో రవాణా, హోం, న్యాయ శాఖల మంత్రిగా ఉన్నారు. పిఎంఎల్‌ఎ కింద ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసేందుకు తమ ముందు హాజరుకావాల్సిందిగా ఇడి సమన్లు జారీ చేసింది. కేజ్రీవాల్ అరెస్టు తరువాత ఆయనకు ఈ సమన్లు వచ్చాయి.

కేజ్రీవాల్ సతీమణి సునీతను కలిసిన హేమంత్ సోరెన్ సతీమణి కల్పన

జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్‌ను కలిశారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు, ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థల వేధింపులకు వ్యతిరేకంగా దేశ రాజధానిలో ఆదివారం జరిగే ఇండియా ఫోరం మెగా ర్యాలీకి కూడా కల్పనా సోరెన్ హాజరుకానున్నారు. సునీతను కలిసిన అనంతరం కల్పన మాట్లాడుతూ.. "కొన్ని నెలల క్రితం జార్ఖండ్‌లో ఏం జరిగిందో అదే ఇప్పుడు ఢిల్లీలో జరుగుతోంది. నా భర్త హేమంత్ సోరెన్‌ని జైలుకు పంపారు. ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్‌ని అరెస్టు చేశారు. అందుకే మా బాధను పంచుకోవడానికి సునీతని కలవడానికి వచ్చాను. ఇకపై మా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని మేము చర్చించుకున్నాం. ఆమె మాకు మద్దతు ఇస్తుందని, అరవింద్ కేజ్రీవాల్‌కు జార్ఖండ్ మద్దతు ఇస్తుంది" అని కల్పన అన్నారు.

డికాక్, పూరన్ మెరుపులు

పంజాబ్‌పై 21 పరుగుల తేడాతో లక్నో గెలుపు

లక్నో: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17లో లక్నో సూపర్‌జెయింట్స్ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. పంజాబ్ కింగ్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు 21 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 199పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 5 వికెట్లు నష్టపోయి 178 పరుగులే చేసింది. ఈ సీజన్‌లో పంజాబ్‌కు ఇది రెండో ఓటమి. తొలుత ఓపెనర్ డికాక్(54) అర్ధసెంచరీకి తోడు పూరన్(42), కృనాల్ పాండ్యా(43) కూడా బ్యాట్ ఝుళిపించడంతో లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 199పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. పంజాబ్‌పై బోణీ కట్టాలన్న సంకల్పంతో ఉన్న లక్నో బ్యాటర్లు క్వింటన్ డికాక్, నికోలస్ పూరన్, కృనాల్ పాండ్యా చెలరేగి ఆడారు. లక్నోకు ఆరంభంలోనే షాక్ తగిలింది. నాలుగో ఓవర్‌లో కేఎల్ రాహుల్ (15), ఆరో ఓవర్‌లో దేవ్‌దత్ పడిక్కల్ (9) ఔటయ్యారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన మార్కస్ స్టొయినీస్(19) కూడా రాణించలేకపోయాడు. తొమ్మిదో ఓవర్‌లో చాహర్ వేసిన బంతికి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. నికోలస్ పూరన్ (42; 21బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సర్లు).. ఓపెనర్ డికాక్(54; 38బంతుల్లో 5ఫోర్లు, 2సిక్సర్లు) వీరిద్దరూ కలిసి జట్టుకు కీలక స్కోర్ అందించారు. ఆ వెంటనే పెవిలియన్ చేరాడు. డికాక్, పూరన్ పరుగుల వేటను కృనాల్ పాండ్యా (43; 22బంతుల్లో 4ఫోర్లు, 2సిక్సర్లు) కొనసాగించాడు. చివర్లో పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ చేయడంతో 19 ఓవర్‌లో లక్నో వరుసగా మూడు వికెట్లను కోల్పోయింది. పంజాబ్ కింగ్స్ బౌలర్లు సామ్ కర్రన్‌కు మూడు, అర్షదీప్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ ఓపెనర్, కెప్టెన్ ధావన్(70), బెయిర్‌స్టో(42) ధాటిగా ఆడి 11.4ఓవర్లలోనే 102పరుగుల గట్టి పునాది వేశారు. వీరిద్దరూ ఔటయ్యాక మరో బ్యాటర్ క్రీజ్‌లో నిలదొక్కుకోలేకపోయారు. ప్రభ్‌సిమ్రన్(19), జితేశ్ శర్మ(6), సామ్ కర్రన్(0) నిరాశపరిచారు. లక్నో బౌలర్లు మయాంక్ యాదవ్‌కు మూడు, మొహిసిన్ ఖాన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)..
లక్నో: 199/8(20 ఓవర్లలో)
(డికాక్ 54; కృనాల్ 43(నాటౌట్);
సామ్ కర్రన్ 3/28)
పంజాబ్: 178/5 (20 ఓవర్లలో)
(ధావన్ 70; బెయిర్‌స్టో 42;
మయాంక్ యాదవ్ 3/27)

ఐపిఎల్‌లో నేడు

గుజరాత్ × సన్‌రైజర్స్
వేదిక: అహ్మదాబాద్; మ.3.30గం॥లకు

ఢిల్లీ × చెన్నై
వేదిక: విశాఖపట్నం; రా.7.30గం॥లకు

డేనియల్ బాలాజీ కన్నుమూత

కోలీవుడ్ నటుడు డేనియల్ బాలాజీ (48) గుండెపోటుతో శుక్రవారం అర్థరాత్రి మృతిచెందారు. ఒక్కసారిగా తీవ్రమైన ఛాతీనొప్పి రావటంతో తీవ్ర అస్వస్థతకు గురైన డేనియల్ బాలాజీని వెంటనే చెన్నైలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. కానీ మార్గమధ్య లోనే బాలాజీ మరణించినట్లుగా అక్కడి వైద్యులు ధృవీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఇంకా వివాహం చేసుకోలేదు. ఎక్కువగా విలన్ రోల్స్‌లోనే నటించారు. దక్షిణ భారతదేశంలోని అన్ని భాషల్లో 50కిపైగా చిత్రాల్లో నటించారు. తెలుగులో సాంబ, ఘర్షణ, చిరుత, టక్ జగదీష్, సాహసం శ్వాసగా సాగిపో చిత్రాల్లో నటించారు. కమల్‌హాసన్ విడుదల కానీ సినిమా 'మరుదనాయగం' సెట్స్‌లో యూనిట్ ప్రొడక్షన్ మేనేజర్‌గా బాలాజీ తన సినీ జీవితాన్ని ప్రారంభించారు.

ఢిల్లీ జల్‌బోర్డ్ మనీ లాండరింగ్ కేసులో ఇడి మొదటి ఛార్జిషీట్

న్యూఢిల్లీ : ఢిల్లీ జల్ బోర్డ్ (డిజెబి)లో అవకతవకలకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మొదటి చార్జిషీట్‌ను దాఖలు చేసింది. చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు దీనిపై విచారణను ఏప్రిల్ 1కి నిర్దేశించింది. మాజీ డిజెబి చీఫ్ ఇంజనీర్ జగదీష్ కుమార్ అరోరా, కాంట్రాక్టర్ అనీల్ కుమార్ అగర్వాల్, ఎన్‌బిసిసి మాజీ జరల్ మేనేజర్ డి.కె.మిట్టల్, తేజిందర్ సింగ్, ఎన్‌కెజి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌లను ఈ చార్జిషీట్‌లో నిందితులుగా పేర్కొన్నారు. పిఎంఎల్‌ఎ కింద వీరిని ప్రాసిక్యూట్ చేయాలని ఇడి భావిస్తోంది. భవిష్యత్తులో అనుబంధ ఫిర్యాదులను దాఖలు చేస్తామని తెలిపింది. డిజెబి ఇచ్చిన కాంట్రాక్ట్‌లో జరిగిన అవినీతి కారణంగా వచ్చిన ముడుపుల మొత్తాన్ని ఆప్‌కు ఎన్నికల నిధులుగా ఇచ్చారని ఇడి ఆరోపిస్తోంది. కాంట్రాక్ట్ ఇచ్చేందుకు కంపెనీకి అవసరమైన సాంకేతిక అర్హతలు లేనప్పటికీ ఎన్‌కెజి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కి ఈ కాంట్రాక్ట్ ఇచ్చారని సిబిఐ ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసింది. ఆ ప్రాతిపదికనే ఇడి కేసు పెట్టింది.

ఐటి ఉద్యోగాల పేరుతో ఎర !

- సైబర్ నేరాల్లో ఇరుక్కున్న 250మందిని కాపాడిన భారత్ ఎంబసీ

న్యూఢిల్లీ : తప్పుడు ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్ కుంభకోణాల్లో, సైబర్ నేరాల్లో ఇరుక్కున్న దాదాపు 250మంది భారతీయులను కంబోడియా నుండి కాపాడినట్లు విదేశాంగ శాఖ శనివారం వెల్లడించింది. గత మూడు మాసాల్లో 75 మందికి పైగా భారత్‌కు తిరిగివచ్చారు. సంబంధిత ఏజెంట్లపై దర్యాప్తు సంస్థలు దేశవ్యాప్తంగా దర్యాప్తు చేపట్టాయి. పలు కంపెనీలు ఐటి సెక్టార్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామనే హామీలతో దక్షిణాసియా, తూర్పు ఆసియా వ్యాప్తంగా అభ్యర్థులను రిక్రూట్ చేసుకుంటాయి. ఇవి కంబోడియా, లావోస్, మయన్మార్‌ల్లో పనిచేస్తున్నాయి. ఐటి ఉద్యోగాల పేరుతో విదేశాలకు వెళ్లిన తర్వాత వారిని సైబర్ అవినీతి సెంటర్లలో బలవంతంగా పనిచేసేలా ఒత్తిడి తీసుకొస్తారు. టెలిఫోన్, ఆన్‌లైన్‌ల్లో ఇతరులను మోసగించేలా వీరిపై ఒత్తిళ్లు, వేధింపులు తీసుకువస్తారు. ఉపాధి అవకాశాల పేరుతో ఆకర్షించి మోసపోయిన భారతీయుల నుండి ఫిర్యాదులు అందిన తర్వాత కంబోడియాలోని ఇండియన్ ఎంబసీ వెంటనే స్పందించిందని, ఈ అవినీతి, బూటకపు విధానాలు, పథకాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేందుకు కంబోడియా అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో పేర్కొంది.

జీలో 50% ఉద్యోగులపై వేటు

బెంగళూరు : పొదుపు చర్యల్లో భాగంగా జీ ఎంటర్‌టైన్‌మెంట్ భారీగా ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. బెంగళూరు టెక్ సెంటర్‌లో పని చేసే సిబ్బందిలో 50 శాతం మందిపై వేటు వేస్తోందని శనివారం రిపోర్టులు వచ్చాయి. సోనీతో విలీనం బెడిసికొట్టిన క్రమంలో ఈ తొలగింపులు జరగడం చర్చనీయాంశం అవుతోంది. సాధ్యమైనంత వరకు మానవ వనరుల తగ్గించుకుని పొదుపునపై దృష్టి సారించాలనే ఉద్దేశ్యంతో జీ ఎండి, సిఇఒ పునీత్ గోయంక ఈ చర్యలు తీసుకున్నారని సమాచారం.

దీపక్ శర్మ అరెస్ట్

న్యూఢిల్లీ: అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య(ఎఐఎఫ్‌ఎఫ్) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు దీపక్ శర్మను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరు మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారిణులపై భౌతిక దాడి చేసిన ఆరోపణలపై దీపక్ శర్మను గోవా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఖాద్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారిణులు.. ఆయన తమ హోటల్ గదికి వచ్చి భౌతిక దాడికి పాల్పడ్డారంటూ ఫిర్యాదు చేశారు. ఫుడ్ తయారీ విషయంలో ఆగ్రహానికి గురైన ఆయన తమపై దాడి చేసినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పుడు ఆయన మద్యం సేవించి ఉన్నారని, అలాగే హిమాచల్ ప్రదేశ్ నుంచి గోవాకు వస్తోన్న సమయంలో కూడా ఆయన తమ ముందే మద్యం సేవించారని అందులో పేర్కొన్నారు. ఇండియన్ విమెన్ లీగ్(ఐడబ్ల్యుఎల్)లో భాగంగా ఖాద్ బృందం ప్రస్తుతం గోవాలో ఉంది. క్రీడాకారుణులు తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేయడంతో.. గోవా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధికారులు వారి భద్రతపై రాతపూర్వక హామీ ఇచ్చారు. అలాగే దీనిపై ఏఐఎఫ్‌ఎఫ్ విమెన్ ఫుట్‌బాల్ కమిటీ ఛైర్‌పర్సన్ వాలంకా అలెమావో స్పందించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. 'ఆ ఫిర్యాదు కాపీ నా దష్టికి వచ్చింది. అలాంటి ఘటనలు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. దీనిపై ఏఐఎఫ్‌ఎఫ్ తగిన చర్యలు తీసుకుటుంది' అని వాలంకా వెల్లడించారు.

శ్రీలంక 314/4

బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్

ఛిట్టోగ్రామ్(బంగ్లాదేశ్): బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో శ్రీలంక టాపార్డర్ బ్యాటర్స్ రాణించారు. మధుశంక(57), కరుణరత్నే(86), కుశాల్ మెండీస్(93) అర్ధసెంచరీలతో రాణించడంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 314పరుగులు చేసింది. సీనియర్ బ్యాటర్ అంగోలా మాథ్యూస్(23) నిరాశపరిచినా.. ఛండీమాల్(34), ధనుంజయ(15) మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. బంగ్లాదేశ్ బౌలర్లు హసన్ మహమూద్‌కు రెండు, షకీబ్‌కు ఒక వికెట్ దక్కాయి.

సెమీస్‌లో ఓడిన సిక్కిరెడ్డి-సుమిత్

స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటర్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. మహిళల డబుల్స్‌లో సెమీస్‌కు చేరిన సిక్కిరెడ్డి-సుమిత్ రెడ్డి జంట శనివారం జరిగిన పోటీలు పరాజయం పాలైంది. ఏకపక్షంగా సాగిన ఈ పోటీలో సుమిత్-సిక్కిరెడ్డి 17-21, 12-21తో కేవలం 29నిమిషాల్లోనే ఓటమిపాలయ్యారు. అంతకుముందు శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో పివి సింధు 26-24, 17-21, 20-22తో 6వ సీడ్ కెటెంటోంగ్(థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడింది. ఓటమి అనంతరం సింధు రాకెట్‌ను నేలకేసి కొట్టడంతో ఎల్లోకార్డుకు గురైంది. పురుషుల డబుల్స్‌లో ఎం.ఆర్ అర్జున్-ధృవ్ కపిల జంట 19-21, 23-21, 17-21తో మలేషియా జోడీ చేతిలో ఓటమిపాలయ్యారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68